AKHANDAA SURYAA
# అఖండ సూర్య
PRGI NO : TGTEL/25/A1809
అజేయ ప్రజా స్వరం
తెలుగు దినపత్రిక
Simultaneously Published from Hyderabad and Vijayawada
సంపుటి : 01 సంచిక : 152 హైదరాబాద్, డిసెంబర్, బుధవారం 24, 2025 పేజీలు : 12 వెల : 6.00



## బంగ్లాదేశ్‌కు ట్రీట్‌మెంట్ అవసరం

యూనస్ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదు
సరిహద్దు దేశాలకు ఇబ్బంది కలిగిస్తోంది
అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ

02



## చైనా ఆయుధ సంపత్తిపై అమెరికా ఆందోళన

అమెరికా రక్షణశాఖ ఆందోళన
అణ్వాయుధాలను సమకూర్చుకుంటోంది
ఆయుధ నియంత్రణ పాటించడం లేదు: అమెరికా
మేం మా దేశ రక్షణ మాత్రం చూసుకుంటున్నాం: చైనా

02



# తెలంగాణలో నీళ్ల యుద్ధం

### కేసీఆర్ ప్రెస్ మీట్‌తో రాజుకున్న వివాదం

అసలు పాలమూరుకు అన్యాయం చేసిందెవరు?
బీఆర్ఎస్ పాలనలో ఆ జిల్లాకు న్యాయం జరిగిందా?
కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగానే నిర్లక్ష్యం చేస్తోందా?
పాలమూరు ఎత్తిపోతలకు 45 టీఎంసీలు చాలని ఉత్తమ్ లేఖ రాశారా?
అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం

**అఖండసూర్య, హైదరాబాద్**

తెలంగాణ రాజకీయాల్లో నీటి పంచాయతీ మళ్లీ తీవ్రరూపం దాల్చింది. రెండేళ్లుగా రాజకీయంగా నిశ్శబ్దంగా ఉన్న భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) డిసెంబర్ 21, 2025న తన మౌనాన్ని వీడారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఈ ప్రాజెక్టు తెలంగాణలోని పాలమూరు (మహబూబ్‌నగర్), రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు జీవనాడిగా ఉండాల్సినదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో ఈ ప్రాజెక్టుకు రూ.35 వేల కోట్లు కేటాయించి, రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం నీటి కేటాయింపును తగ్గించేలా కేంద్రానికి లేఖ రాసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి రాసిన లేఖలో ప్రాజెక్టుకు కేవలం 45 టీఎంసీల నీరు చాలని పేర్కొన్నారని, ఇది తెలంగాణకు ద్రోహమని ఆరోపించారు. ఈ ఆరోపణలతో అధికార కాంగ్రెస్‌లో గగ్గోలు మొదలైంది. మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ తదితరులు కేసీఆర్‌పై మూకుమ్మడిగా దాడి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను "ఆర్థిక ఉగ్రవాది" అని పిలిచి, బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ మిగతా 2లో..

# అసెంబ్లీకి రావాలంటే కేసీఆర్‌కు భయం

ప్రజా ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారు
ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నాం
రైతులకు మా ప్రభుత్వంలో అధిక ప్రాధాన్యం
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యలు

**అఖండసూర్య, హైదరాబాద్**

అసెంబ్లీకి రావాలంటే కేసీఆర్‌కు భయం అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని పినపాక గ్రామంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా సభలో ఆయన మాట్లాడుతూ, భారత రాష్ట్ర సమితి (BRS) నేతలు ప్రజా ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం ప్రతి పైసాను ప్రజల అభివృద్ధి కోసమే ఖర్చు చేస్తోందని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయడం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా కోసం ప్రతి సంవత్సరం రూ.12,500 కోట్లు విద్యుత్ శాఖకు చెల్లిస్తున్నామని వివరించారు. ఇది రైతులకు భారం లేకుండా వారి ఉత్పత్తులను పెంచడానికి సహాయపడుతుందని అన్నారు. అంతేకాకుండా, ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంతో పని చేస్తోందని, అన్ని వనరులను ప్రజల సంక్షేమానికి మాత్రమే ఉపయోగిస్తోందని ఉద్ఘాటించారు. BRS నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించిన భట్టి, వారు 'తోలు తీస్తామని' లాంటి దిగజారిన మాటలు మాట్లాడుతున్నారని, అలాంటి వ్యాఖ్యలు చేసేవారికి ప్రజలే సరైన బుద్ధి చెబుతారని మిగతా 2లో..



# రాహుల్ భారత్‌ను అవమానిస్తున్నాడు



విదేశాల్లో దేశ వ్యతిరేక విమర్శలు
చైనాను పొగుడుతూ భారత్‌ను అవమానిస్తారా?
ఆయన కామెంట్లు దేశ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీస్తాయి
రాహుల్ ఆరోపణలపై బీజేపీ మండిపాటు

**అఖండసూర్య, హైదరాబాద్**

జర్మనీలోని బెర్లిన్‌లోని హెర్టీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. భారత రాజ్యాంగాన్ని "రద్దు చేయడం" లేదా దాని సారాన్ని నాశనం చేయడమే బీజేపీ లక్ష్యమని, దేశ సంస్థలపై పూర్తిస్థాయి దాడి జరుగుతోందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ ఆయుధాలుగా మార్చి, ప్రతిపక్షాలను అణచివేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేయాలని ప్రతిపాదిస్తోంది. ఇది రాష్ట్రాల మధ్య సమానత్వం, భాషలు, మతాల మధ్య సమానత్వాన్ని నాశనం చేసే ప్రయత్నం" అని అన్నారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటు చోరీ జరిగిందని, ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓటర్లు ఉన్నారని ఆరోపించారు. "కాంగ్రెస్ హర్యానాలో గెలిచింది, కానీ ఓట్లు దొంగిలించారు" అని చెప్పారు. ఎన్నికల మిగతా 2లో..

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, హరీశ్‌రావుకు నోటీసులు?



కీలక దశకు చేరుకున్న విచారణ
అసెంబ్లీ సమావేశాల అనంతరం నోటీసులు పంపుతారా?
గత ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే ట్యాపింగ్ జరిగిందా?
ప్రభాకర్ రావు విచారణ అధికారులకు ఆ విషయమే చెప్పారా?
రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయబోతున్నది?

**అఖండసూర్య, హైదరాబాద్**

తెలంగాణలో భారీ సంచలనం సృష్టించిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు మరింత కీలక దశకు చేరుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అక్రమ నిఘా కార్యకలాపాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దూకుడు పెంచింది. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్), టి. హరీష్ రావులకు త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ప్రభాకర్ రావు వాంగ్మూలం కీలకం**

కేసులో ప్రధాన నిందితుడు, మిగతా 2లో..

# జీవోలను రహస్యంగా ఉంచుతున్న రేవంత్ ప్రభుత్వం



రేవంత్ రెడ్డీ నువ్వు దొంగచాటుగా ఏం చేస్తున్నావో బహిర్గతం చెయ్యి
13 నెలల కాలంలో 82 శాతం జీవోలను రహస్యంగా ఉంచారని విమర్శ
జీవోల గోప్యతపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని వ్యాఖ్య
చీకటి జీవోల మాటున ఏం చేస్తున్నారో బహిర్గతం చేయాలని డిమాండ్

**అఖండసూర్య, హైదరాబాద్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) ప్రజలకు అందుబాటులో ఉంచకుండా దాచిపెడుతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. దాచిపెట్టిన అన్ని జీవోలను నాలుగు వారాల్లోగా బహిర్గతం చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు... ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్ రెడ్డి సర్కార్‌కు చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు. ఈ విషయంపై హరీశ్ రావు స్పందిస్తూ.. "ప్రజా పాలన అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, జీవోలను దాచిపెడుతూ పెద్ద డ్రామా ఆడుతోంది. మా పార్టీ మిగతా 2లో..

# మాఫియా చేతిలో తెలంగాణ ప్రభుత్వం

ఇసుకమాఫియా అరాచకాలు పెరిగాయి
చెక్ డ్యామ్ లను ధ్వంసం చేస్తున్నారు
భూగర్భ జలాలు రక్షించేందుకు చెక్ డ్యామ్‌లు కట్టాం
ఈ విధ్వంసం వెనుక కాంగ్రెస్ నేతల హస్తం
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**అఖండసూర్య, హైదరాబాద్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెక్‌డ్యామ్‌లు వరుసగా ధ్వంసమవుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నడుస్తుంది ప్రజాపాలన కాదు, పక్కా మాఫియా పాలన అని ఆరోపించారు. డిసెంబర్ 22న ఎక్స్‌లో పోస్ట్ చేసిన సిరీస్ ట్వీట్లలో ఈ విమర్శలు చేశారు. ప్రముఖ జల సంరక్షణ నిపుణుడు, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత 'వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా' డాక్టర్ రాజేంద్ర సింగ్ కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో ధ్వంసమైన చెక్‌డ్యామ్‌లను స్వయంగా పరిశీలించారు. ఇవి మానవ నిర్మిత విధ్వంసమేనని, డ్రిల్లింగ్ మెషీన్లతో రంధ్రాలు చేసి జిలెటిన్ స్టిక్స్ పెట్టి పేల్చారని సాక్ష్యాలతో నిరూపించారు. ఇసుక దోపిడీకి అడ్డుగా ఉన్న చెక్‌డ్యామ్‌లను ఉద్దేశపూర్వకంగా కూల్చివేస్తున్నారని ఆయన తేల్చారు. కేటీఆర్ మాట్లాడుతూ, "గత ఎన్నికల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై బాంబులు వేశారు. ఇప్పుడు ఇసుక మాఫియా కోసం చెక్‌డ్యామ్‌లపై జిలెటిన్ స్టిక్స్ పెట్టి మిగతా 2లో..

# భవిష్యత్తు అంతా క్వాంటమ్ టెక్నాలజీదే

అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దుతాం
ప్రపంచవ్యాప్తంగా క్వాంటమ్ టెక్నాలజీ మీదే చర్చ
ఆధునిక పరిశోధనల కేంద్రంగా అమరావతి
మనదేశంలో తొలి హబ్ అమరావతిలో నిర్మించబోతున్నాం
తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు
ఆహార ధాన్యాల్లో స్వయం సమృద్ధి సాధించిన భారత్
'క్వాంటమ్ టాక్' కార్యక్రమంలో చంద్రబాబు

**అఖండసూర్య, విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇవాళ ఉదయం వేలాది టెక్నాలజీ విద్యార్థులతో ఆన్‌లైన్‌లో నిర్వహించిన 'క్వాంటమ్ టాక్' కార్యక్రమంలో క్వాంటమ్ టెక్నాలజీపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అందరూ క్వాంటమ్ టెక్నాలజీ గురించే ఆలోచిస్తున్నారని, అమరావతిని ఆధునిక పరిశోధనల మిగతా 2లో..






## బ్లూబర్డ్ బ్లాక్2 మిషన్ కౌంట్‌డౌన్

అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లనున్న ఎల్‌వీఎం3-ఎం6
శ్రీహరికోటలో 24 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభం
రేపు ఉదయం 8.54 గంటలకు నింగిలోకి ఎగరనున్న రాకెట్

02



# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, హరీశ్‌రావుకు నోటీసులు ?

**మొదటిపేజీ తరువాయి**

మాజీ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) చీఫ్ టి. ప్రభాకర్ రావు విచారణలో గత ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే ట్యాపింగ్ జరిగిందని పేర్కొన్నట్లు తెలుస్తోంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు డిసెంబర్ 12న సరెండర్ అయిన ప్రభాకర్ రావు పోలీస్ కస్టడీ డిసెంబర్ 25 వరకు పొడిగించబడింది. ఆయన వాంగ్మూలం, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) నుంచి వచ్చిన డిజిటల్ ఆధారాల ఆధారంగా సిట్ రాజకీయ నేతలపై దృష్టి సారించింది.

**ఉన్నత అధికారుల విచారణ**

ఇటీవల సిట్ అధికారులు మాజీ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్‌లకు నోటీసులు జారీ చేసి విచారించారు. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) మాజీ పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావును కూడా ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ నంబర్ల మంజూరు, అనుమతులపై వీరిని నిలదీసినట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా సిట్ పలు ఆసక్తికర విషయాలు గుర్తించింది. ఒక ప్రముఖ టీవీ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్‌తో కలిసి మాజీ మంత్రి హరీష్‌రావు ట్యాపింగ్ చేయించినట్లు ప్రాథమికంగా తేలింది. అలాగే, కొందరు ప్రముఖులపై నిఘా పెట్టేందుకు కేటీఆర్ ఈ వ్యవహారాన్ని నడిపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రత్యర్థులు, పౌర సమాజ ప్రతినిధులు, సొంత పార్టీ నేతలపై కూడా అక్రమ నిఘా పెట్టారనే కోణంలో లోతుగా విచారణ జరుపుతున్నారు.

**కేసు నేపథ్యం**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, న్యాయమూర్తులు, జర్నలిస్టులు, సినీ ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు. ఈ కేసు 2024 మార్చిలో వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే పలువురు ఉన్నత పోలీసు అధికారులు అరెస్ట్ అయి బెయిల్ పై విడుదలయ్యారు. సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సాగుతున్న ఈ దర్యాప్తులో కొందరు అధికారులు అప్రూవర్‌గా మారే అవకాశం ఉందని ప్రచారం. హైకోర్టు కూడా కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. కొత్తగా ఏర్పాటైన సిట్ (హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పర్యవేక్షణలో) అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో మరింత దుమారం రేపే అవకాశం ఉంది.

# రాహుల్ భారత్‌ను అవమానిస్తున్నాడు



**మొదటిపేజీ తరువాయి**

సంస్థలు, నిఘా సంస్థలు బీజేపీ గుప్పిట్లో ఉన్నాయని, వ్యాపారవేత్తలను బెదిరించి బీజేపీకి నిధులు సేకరిస్తున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ విజన్ విఫలమవుతుందని, అది దేశంలో లోతైన విభేదాలకు దారితీస్తుందని రాహుల్ హెచ్చరించారు. భారత్, పాశ్చాత్య దేశాలు ఉత్పత్తిని చైనాకు అప్పగించడం వల్ల ఉద్యోగాల సృష్టి తగ్గిందని, ఇది రాజకీయ అస్థిరతకు కారణమవుతోందని అన్నారు. ప్రతిపక్షాలు ఈ సంస్థల ఆక్రమణను ఎదుర్కోవడానికి "ప్రతిఘటన వ్యవస్థ"ను నిర్మిస్తున్నాయని పేర్కొన్నారు.

**భారత్‌ను అవమానిస్తారా?**

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. విదేశీ భూమిపై దేశాన్ని అవమానించడం రాహుల్ అలవాటని విమర్శించారు. బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా "రాహుల్ గాంధీ 'ప్రచార నాయకుడు, పర్యటన నాయకుడు, ప్రాపగాండా నాయకుడు'. విదేశాల్లో భారత్‌ను బద్నామ్ చేయడం ఆయన పని. చైనాను పొగడ్తలు, భారత్‌ను అవమానించడం ఆయన గుర్తింపు" అని మండిపడ్డారు. కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే "రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడు కాదు, దేశ వ్యతిరేక నాయకుడు. విదేశాల్లో దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటం ద్వారా ఏమి సాధించాలనుకుంటున్నారో అర్థం కావడం లేదు. ఇంకా చిన్నపిల్లాడిలా ప్రవర్తిస్తున్నారు" అని విమర్శించారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ.. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో జర్మనీలో దేశాన్ని అవమానించడం సరికాదని అన్నారు. ఐదు రోజుల జర్మనీ పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా రాజకీయ దుమారాన్ని రేపింది.

# తెలంగాణలో నీళ్ల యుద్ధం

**మొదటిపేజీ తరువాయి**

నీటి హక్కులు దెబ్బతిన్నాయని కౌంటర్ ఇచ్చారు. ఈ వివాదం తెలంగాణ సాగునీటి చరిత్రలోని పాత గాయాలను మళ్లీ తవ్వుతోంది. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు మొదట 90170 టీఎంసీల నీటిని ఉపయోగించేలా రూపొందించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం లేఖలో 45 టీఎంసీలకే పరిమితం చేయడం వివాదాస్పదమైంది. బీఆర్ఎస్ నాయకులు దీన్ని లేఖ ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నారు.

**అసలు సాగునీటి విషయంలో నిజం ఏమిటి?**

తెలంగాణలో సాగునీటి సమస్య రాజకీయాలకు అతీతంగా చారిత్రక నేపథ్యం కలిగి ఉంది. కృష్ణా, గోదావరి నదులపై హక్కులు రెండు రాష్ట్రాల మధ్య వివాదం. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల కృష్ణా నీటిని కేటాయించింది. కానీ బేసిన్ పరిమాణం ఆధారంగా తెలంగాణకు 6870% వాటా రావాల్సి ఉండగా, ఉమ్మడి పాలనలో ఆంధ్ర ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో తెలంగాణకు నష్టం జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. పాలమూరు ప్రాంతం దశాబ్దాలుగా కరువు బారిన పడింది, గంజాయి కేంద్రాలు పనిచేశాయి.

**ఉమ్మడి పాలనలో తెలంగాణకు అన్యాయం జరిగిందా?**

అవును, చారిత్రకంగా తెలంగాణకు నీటి పంచాయతీలో



అన్యాయం జరిగినట్లు వివిధ ట్రిబ్యునళ్లు, నివేదికలు సూచిస్తున్నాయి. బచావత్ ట్రిబ్యునల్ స్వయంగా పాలమూరు నిర్లక్ష్యాన్ని గుర్తించి జూరాల ప్రాజెక్టుకు 17 TMC కేటాయించింది. కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, టీడీపీ పాలనల్లో తెలంగాణ ప్రాంతాలకు ప్రాధాన్యత తక్కువ. ఉదాహరణకు, టంగభద్ర, భీమా వంటి ప్రాజెక్టుల నుంచి 174 TMC నీరు పాలమూరుకు రావాల్సి ఉండగా, అది జరగలేదు. ఆంధ్ర ప్రాంతాల్లో ఇప్పటికే అభివృద్ధి చేసిన ఆయకట్టును రక్షించేందుకు తెలంగాణ బలి అయిందనే వాదన బలంగా ఉంది. ఇది తెలంగాణ ఉద్యమంలో కీలక అంశం కూడా.

**కేసీఆర్ పాలనలోనే అన్యాయం జరిగిందా?**

ఈ విషయంలో రెండు వైపుల వాదనలు ఉన్నాయి. బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ పాలనలో చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దేందుకు పెండింగ్ ప్రాజెక్టులు (నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి వంటివి) పూర్తిచేసి 6.5 లక్షల ఎకరాలకు నీరు అందించామని చెప్పుకుంటారు. మిషన్ కాకతీయతో చెరువులు పునరుద్ధరించారు. కానీ కాంగ్రెస్ వాదన ప్రకారం, కేసీఆర్ కృష్ణా నీటి వాటాలో ఆంధ్రకు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలకు అంగీకరించి "డెత్ వారంట్" రాశారు. ఆంధ్ర ప్రాజెక్టులు (పోతిరెడ్డిపాడు, ముచుమర్రి) నిర్మాణానికి మౌనంగా ఉన్నారు. పాలమూరు ప్రాజెక్టును శ్రీశైలం నుంచి నీరు తీసుకునేలా మార్చడంతో జాప్యం, చట్ట సమస్యలు వచ్చాయి.

**కేసీఆర్ పదేళ్ల పాలనలో నిజంగానే ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదా?**

ఇది పూర్తిగా సరికాదు. కేసీఆర్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టు కీలక భాగాలు (పంప్ హౌసులు, బ్యారేజీలు) పూర్తయ్యాయి, రికార్డు సమయంలో నీరు ఎత్తారు. పెండింగ్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ వంటివి పూర్తి చేసి లక్షల ఎకరాలకు సాగునీరు అందించారు. మిడ్ మానేరు, దేవాదుల వంటివి కూడా పూర్తయ్యాయి. కానీ పెద్ద ప్రాజెక్టులు (పాలమూరురంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ, దిండి) పూర్తికాలేదు. కాంగ్రెస్ ఆరోపణలు: రూ.1.8 లక్షల కోట్లు ఖర్చు చేసినా ఒక్కటి పూర్తికాలేదు, కాంట్రాక్టర్లకు లాభం మాత్రమే. కాళేశ్వరం మేడిగడ్డ బ్యారేజీ కూలిపోవడం కూడా విమర్శలకు కారణమైంది. మొత్తంగా, తెలంగాణ సాగునీటి సమస్య రాజకీయ ఆరోపణలకు అతీతంగా రెండు రాష్ట్రాల సహకారం, ట్రిబ్యునల్ నిర్ణయాలపై ఆధారపడి ఉంది. ప్రస్తుత వివాదం రాజకీయ లబ్ధి కోసమే అయినా, రైతుల భవిష్యత్తు దీనిపైనే ఆధారపడి ఉంది.



# బ్లూబర్డ్ బ్లాక్2 మిషన్ కౌంట్‌డౌన్

- **అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లనున్న ఎల్‌వీఎం3-ఎం6**
- **శ్రీహరికోటలో 24 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభం**
- **రేపు ఉదయం 8.54 గంటలకు నింగిలోకి ఎగరనున్న రాకెట్**

**అఖండసూర్య, హైదరాబాద్**

కొత్త తరం అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్6ను మోసుకెళ్లే ఎల్‌వీఎం3ఎం6 రాకెట్ ప్రయోగానికి 24 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం శ్రీహరికోటలో ప్రారంభమైనట్లు ఇస్రో ప్రకటించింది. బ్లూబర్డ్ బ్లాక్2 మిషన్ కౌంట్ డౌన్ ప్రారంభమైందని, రేపు ఉదయం 8.54 గంటలకు రాకెట్ నింగిలోకి ఎగరనున్నట్లు వెల్లడించింది. ఈ ఉపగ్రహం బరువు సుమారు 6,100 కిలోలు ఉంటుంది. స్పేస్‌పోర్ట్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ఎల్‌వీఎం3ఎం6 వ్యోమనౌకను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారులు తెలిపారు. అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది. శాటిలైట్ ద్వారా నేరుగా మొబైల్ కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు ఈ బ్లూబర్డ్ బ్లాక్2 మిషన్. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా నేరుగా 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, మెసేజ్‌లు, వీడియో ప్రసారాలు చేసేందుకు వీలుగా ఈ ప్రయోగం చేపట్టారు. వాణిజ్య, ప్రభుత్వ అప్లికేషన్లకు సపోర్ట్ చేసేలా దీనిని రూపొందించారు.

# మాఫియా చేతిలో తెలంగాణ ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి**

పేలుస్తున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ నిర్మాణాలను డైనమైట్లతో ధ్వంసం చేస్తారా? భూగర్భజలాలు పెంచేందుకు బీఆర్ఎస్ హయాంలో వేలాది చెక్‌డ్యామ్‌లు కట్టాం. ఇప్పుడు వాటిని కూల్చి రైతుల పొలాలను ఎడారులుగా మారుస్తున్నారు. ఇసుక కాంట్రాక్టర్ల లాభాల కోసం తెలంగాణ రైతులు బలి కావాలా?" అని ప్రశ్నించారు. ప్రకృతి విపత్తుల వల్ల కూలిపోయాయని కట్టుకథలు అల్లిన కాంగ్రెస్ మంత్రులకు రాజేంద్ర సింగ్ రిపోర్టు చెంపదెబ్బ లాంటిదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "ఇప్పుడు ఏం సమాధానం చెబుతారు రేవంత్ రెడ్డి?" అని సవాల్ విసిరారు. అభివృద్ధి చేయడం చేతకాదు కానీ, ఉన్నవాటిని కూల్చడంలో సిద్ధహస్తులని విమర్శించారు. గత 18 నెలల్లో 420కు పైగా చెక్‌డ్యామ్‌లు ధ్వంసమయ్యాయని అంచనా. ముఖ్యంగా మానేరు నది పరివాహక ప్రాంతంలో (కరీంనగర్, పెద్దపల్లి) వరుస ఘటనలు జరుగుతున్నాయి. నవంబర్‌లో గుంపులతనుగుల చెక్‌డ్యామ్, డిసెంబర్‌లో అడవి సోమనపల్లి చెక్‌డ్యామ్ ధ్వంసమయ్యాయి. ఇరిగేషన్ అధికారులు ఇసుక మాఫియా జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చిందని అనుమానిస్తున్నారు. ప్రభుత్వం ఈ ఘటనలపై విజిలెన్స్ దర్యాప్తు ఆదేశించినప్పటికీ, బీఆర్ఎస్ నేతలు మాఫియా వెనుక కాంగ్రెస్ నేతల చేయి ఉందని ఆరోపిస్తున్నారు. రాజేంద్ర సింగ్ పీపుల్స్ ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వివాదం రాజకీయంగా మరింత ఉద్ధృతమవుతోంది.



# అసెంబ్లీకి రావాలంటే కేసీఆర్‌కు భయం

**మొదటిపేజీ తరువాయి**

హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా విమర్శలు గుప్పించారు. రెండేళ్లుగా అసెంబ్లీకి రాని కేసీఆర్, మీడియా సమావేశాల్లో ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, శాసనసభకు రావడానికి భయపడుతున్నారని ఆరోపించారు. BRS పాలనలో జరిగిన అవినీతి, అభివృద్ధి లోపాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వం ఆ లోపాలను సరిచేస్తూ ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం ద్వారా స్థానిక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మెరుగుపరచడం, రైతులకు నిరంతర విద్యుత్ అందించడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి తెలిపారు. సభకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమం ప్రజలలో ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచడంతో పాటు, రాజకీయ వివాదాలను కూడా హైలైట్ చేసింది.

# జీవోలను రహస్యంగా ఉంచుతున్న రేవంత్ ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి**

సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ సమాచార హక్కు చట్టం (RTI) ద్వారా సేకరించిన సమాచారంతో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (PIL) దాఖలు చేశారు. దీంతో ప్రభుత్వ అసలు రంగు బయటపడబోతోంది" అని తెలిపారు. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 జనవరి 26 వరకు మొత్తం 13 నెలల కాలంలో ప్రభుత్వం 19,064 జీవోలు జారీ చేయగా, వాటిలో కేవలం 3,290 మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో పెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. "ఏకంగా 15,774 జీవోలను, అంటే 82 శాతం జీవోలను ఎందుకు దాచిపెడుతున్నారు? చీకటి జీవోల మాటున దొంగచాటుగా ఏం చేస్తున్నారు? రేవంత్ రెడ్డి, ఇదేనా మీరు చెప్పిన ప్రజా ప్రభుత్వం?" అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. తక్షణమే జీవోలన్నింటినీ బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.




# భవిష్యత్తు అంతా క్వాంటమ్ టెక్నాలజీదే

**మొదటిపేజీ తరువాయి**

కేంద్రంగా 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ'గా మారుస్తామని ప్రకటించారు. క్యూబిట్, వైసర్ సంస్థలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో 50 వేలకు పైగా టెక్ విద్యార్థులు నమోదు చేసుకున్నారు. ఇది భారతదేశంలో అతిపెద్ద క్వాంటమ్ విద్యా కార్యక్రమంగా నిలిచింది. అన్ని రంగాల్లోనూ క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రభావం చూపబోతోందని చంద్రబాబు హామీ ఇచ్చారు.

**చరిత్రలో సంస్కరణలు, భవిష్యత్తులో క్వాంటమ్**

సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో గత సంస్కరణలను గుర్తు చేసుకున్నారు. 1970లో చైనా ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిందని, 1991లో భారత్‌లో ఆ సంస్కరణలు వచ్చాయని, ఆ తర్వాత రెండు దేశాలూ వెనక్కి తిరిగి చూడలేదని అన్నారు. వ్యవసాయ రంగంలో హరిత విప్లవంతో భారత్ ఆహార ధాన్యాల్లో స్వయం సమృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం సామాన్యుల సాధికారతే లక్ష్యంగా సంస్కరణలు తీసుకొస్తోందని చంద్రబాబు కొనియాడారు. విశాఖపట్నం నగరానికి చాలా ఐటీ కంపెనీలు వస్తున్నాయని, భవిష్యత్తులో నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి ఆ నగరం చిరునామాగా మారబోతోందని చెప్పారు. అలాగే తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని వెల్లడించారు.


**భారత్‌లోనే తొలి హబ్**

అమరావతి క్వాంటమ్ వ్యాలీ దేశంలోనే మొదటి క్వాంటమ్ టెక్ పార్కుగా రూపుదిద్దుకుంటోంది. ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్‌టీ వంటి గ్లోబల్ కంపెనీలతో భాగస్వామ్యంతో 2026 జనవరి నుంచి ఇక్కడ క్వాంటమ్ కంప్యూటర్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ఇప్పటికే 50 ఎకరాల భూమి కేటాయించారు. ఇది సిలికాన్ వ్యాలీ తరహాలో గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మారనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మూడు వేల మంది ఉన్నత ప్రతిభ కలిగిన విద్యార్థులను ఎంపిక చేసి అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇస్తారు. టాప్ 100 మందికి ఐబీఎం, టీసీఎస్ వంటి సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తారు. మూడేళ్లలో ఒక లక్ష మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయడమే లక్ష్యం. ఈ కార్యక్రమం రాష్ట్ర యువతకు కొత్త అవకాశాలు తెరుస్తుందని, క్వాంటమ్ టెక్నాలజీ భవిష్యత్ పాలన, ఆవిష్కరణలకు పునాది అవుతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా క్వాంటమ్ విద్యపై ఆసక్తి పెరుగుతోందన్న నేపథ్యంలో ఏపీ ముందంజలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

# చైనా ఆయుధ సంపత్తిపై అమెరికా ఆందోళన

- **అమెరికా రక్షణశాఖ ఆందోళన**
- **అణ్వాయుధాలను సమకూర్చుకుంటోంది**
- **ఆయుధ నియంత్రణ పాటించడం లేదు: అమెరికా**
- **మేం మా దేశ రక్షణ మాత్రం చూసుకుంటున్నాం: చైనా**

**అఖండసూర్య, హైదరాబాద్**



అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) డ్రాఫ్ట్ నివేదికలో చైనా అణు ఆయుధాల వేగవంతమైన విస్తరణపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మంగోలియా సరిహద్దు సమీపంలో మూడు కొత్త సిలో ఫీల్డ్‌లలో 100కు పైగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు మోహరించినట్టు అంచనా వేసింది. ఇవి ప్రధానంగా సాలిడ్‌ఫ్యూయల్ DF31 సిరీస్ క్షిపణులు. గతంలో ఈ సిలో సైట్ల ఉనికిని పెంటగాన్ గుర్తించినప్పటికీ, మోహరించిన క్షిపణుల సంఖ్యను మొదటిసారిగా వెల్లడించింది. ఈ సైట్లు చైనా లోపలి ప్రాంతాల్లో ఉండటంతో అమెరికా సాధారణ లేదా అణు క్రూజ్ మిస్సైల్స్‌కు అందని దూరంలో ఉన్నాయి.

**చైనా అణు వార్‌హెడ్‌ల అంచనా**

2024లో చైనా వద్ద 600ల (సుమారు 600కు మించని) అణు వార్‌హెడ్‌లు ఉన్నాయి. గత సంవత్సరాలతో పోల్చితే ఉత్పత్తి రేటు కొంత మందగించినట్టు నివేదిక పేర్కొంది. అయినా, 2030 నాటికి ఈ సంఖ్య 1,000కు పైగా చేరవచ్చు. మరే అణుశక్తి దేశం కంటే వేగంగా చైనా అణు ఆయుధాలను విస్తరిస్తోందని నివేదిక హెచ్చరించింది.

**ఆయుధ నియంత్రణ చర్చలు**

నివేదికలో మరో ముఖ్య అంశం: చైనా ఆయుధ నియంత్రణ చర్చలపై ఎలాంటి ఆసక్తి చూపడం లేదు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా, రష్యాలతో అణు నిరాయుధీకరణ చర్చలు జరిపే అవకాశం ఉందని పేర్కొన్నప్పటికీ, బీజింగ్ నుంచి సానుకూల స్పందన లేదు. వాషింగ్టన్‌లోని చైనా దౌత్యకార్యాలయం ఈ నివేదికను తోసిపుచ్చింది. చైనా రక్షణాత్మక అణు వ్యూహాన్ని అనుసరిస్తోందని, దేశ భద్రతకు అవసరమైన కనీస స్థాయి సామర్థ్యాన్ని మాత్రమే నిర్వహిస్తోందని స్పష్టం చేసింది. అమెరికా ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించింది. ఈ నివేదిక కాంగ్రెస్‌కు సమర్పించే ముందు మార్పులు రావచ్చని అధికారులు తెలిపారు. అయితే ఇప్పటికే వెలువడిన సమాచారం అంతర్జాతీయ భద్రతపై కొత్త చర్చను రేకెత్తించింది. అణు ఆయుధాల రేసు నివారణకు మూడు పెద్ద శక్తుల మధ్య చర్చలు అవసరమన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

# బంగ్లాదేశ్‌కు ట్రీట్‌మెంట్ అవసరం

- **యూనస్ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదు**
- **సరిహద్దు దేశాలకు ఇబ్బంది కలిగిస్తోంది**
- **అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ**

**అఖండసూర్య, హైదరాబాద్**



బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న రాజకీయ అస్థిరత, భారత్ వ్యూహాత్మక భద్రతపై పడుతున్న ప్రభావం నేపథ్యంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌తో దౌత్యం సమయం దాటిపోయిందని, ఇక శాశ్వత పరిష్కారానికి 'శస్త్రచికిత్స' (సర్జరీ) అవసరమని ఆయన అన్నారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన 'రైజింగ్ అస్సాం' కార్యక్రమంలో మాట్లాడిన హిమంత, భారత్‌కు అతి ముఖ్యమైన సిలిగురి కారిడార్ (చికెన్స్ నెక్)ను రక్షించుకోవడానికి ఈ చర్య అనివార్యమని సూచించారు. "ఔషధాలు విఫలమైనప్పుడు శస్త్రచికిత్స తప్పదు" అని వైద్య సామెతను ఉదాహరిస్తూ, ఒకరోజు దౌత్యం లేదా బలప్రయోగం ద్వారా 2022 కి.మీ భూభాగాన్ని స్వాధీనం చేసుకోవాల్సి రావచ్చని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు బంగ్లాదేశ్ తాత్కాలిక నాయకుడు మహమ్మద్ యూనస్ మార్చి 2025లో చైనా పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా వచ్చాయి. యూనస్ చైనా వ్యాపారవేత్తలతో మాట్లాడుతూ, భారత ఈశాన్య రాష్ట్రాలు (సెవెన్ సిస్టర్స్) భూపరివేష్టితమై ఉన్నాయని, సముద్రానికి చేరుకోవడానికి బంగ్లాదేశ్ ఏకైక మార్గమని, ఇది చైనా ఆర్థిక విస్తరణకు భారీ అవకాశమని అన్నారు. హిమంత మాట్లాడుతూ.. యూనస్ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదని, ఇది భారత్ సరిహద్దు రాష్ట్రాలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని ఆరోపించారు. అస్సాంలో 40 శాతం జనాభా బంగ్లాదేశ్ మూలాలు కలిగి ఉందని, ఇది 'పౌడర్ కెగ్' పరిస్థితి సృష్టిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**భారత్ వ్యూహాత్మక బలహీనత**

పశ్చిమబెంగాల్‌లోని సిలిగురి ప్రాంతంలో ఉన్న ఈ కారిడార్ కేవలం 2022 కి.మీ వెడల్పు కలిగి ఉంది. ఇది భారత మెయిన్‌ల్యాండ్‌ను ఈశాన్య రాష్ట్రాలతో (అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, త్రిపుర, సిక్కిం) కలుపుతుంది. ఈ ప్రాంతం నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, చైనా చుంబీ వ్యాలీలకు అతి సమీపంలో ఉంది. దాడి జరిగితే ఈశాన్య రాష్ట్రాలు భారత్ నుంచి వేరుపడతాయి, సైనిక సరఫరాలు నిలిచిపోతాయి. 2017 డోక్లాం ప్రతిష్టంభనకు ఇదే ప్రధాన కారణం. హిమంత వ్యాఖ్యలు భారత్‌బంగ్లాదేశ్ సంబంధాల్లో కొత్త ఉద్రిక్తతలను సూచిస్తున్నాయి. భారత్ తన వ్యూహాత్మక ప్రయోజనాలను రక్షించుకోవడానికి సిద్ధంగా ఉందనే సంకేతాలు ఇస్తున్నాయి.

# సమిష్టి కృషితోనే సింగరేణి అభివృద్ధి

- సింగరేణి డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ
- కార్పొరేట్లో ఘనంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**అఖండ సూర్య, భద్రాద్రి కొత్తగూడెం:**



సింగరేణి అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని సింగరేణి డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ఆవరణలోని కార్పొరేట్ ఆధ్వర్యంలో మంగళవారం సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న సింగరేణి డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కార్మికులు సూపర్వైజర్ సిబ్బంది అధికారులు కార్మిక సంఘాల నాయకులు వారి కుటుంబ సభ్యులు పాత్రికేయులు స్థానిక ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. 137 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ బలంగా నిలబడడానికి కారణం ఒక్క కాలం ఒక్క నిర్ణయం కాదని తరతరాల శ్రమ క్రమశిక్షణ పరస్పర నమ్మకమే సింగరేణి నిజమైన బలమన్నారు. ఈ ఏడాది మనం పని చేసిన పరిస్థితులు సులభమైనవి కావని వాతావరణ ప్రభావాలు సాంకేతిక సవాళ్లు మార్కెట్ మార్పులు ఇవన్నీ మన పనిని ప్రభావితం చేశాయన్నారు. అయినప్పటికీ భద్రతను ముందుంచుకొని అందుబాటులో ఉన్న వనరులను సమర్ధంగా వినియోగించుకుంటూ ముందుకు సాగేందుకు ప్రయత్నించమన్నారు. ఈ ప్రయత్నంలో ప్రతి గని కార్మికుడు ప్రతి సూపర్వైజర్, ప్రతి అధికారి చూపిన బాధ్యతాభావం ప్రశంసనీయమన్నారు. ఇప్పటివరకు సింగరేణి ప్రధానంగా తెలంగాణ అవసరాలకు సేవలు అందించిందని చెప్పారు. అయితే కాలం మారుతున్నప్పుడు సింగరేణి తన అనుభవం, సామర్థ్యంతో మరెక్కడైనా ఉపయోగపడగలదా అన్న ప్రశ్న సహజంగానే వస్తుందని ఈ నేపథ్యంలో కీలక ఖనిజాలు, అనుబంధ రంగాల్లో అవకాశాలు ఉన్నాయా అనే అంశాన్ని మనం పరిశీలించడం ప్రారంభించామన్నారు. ఇవి ఇంకా ఆలోచన దశలోనే ఉన్నప్పటికీ భవిష్యత్తును నిర్లక్ష్యం చేయకుండా ముందే సిద్ధమవ్వాలన్న భావనతోనే ఈ ప్రయత్నం ముందుకు పోతుందని పేర్కొన్నారు. అలాగే శక్తి రంగంలో జరుగుతున్న మార్పులను గమనిస్తూ పునరుత్పాదక శక్తి, శక్తి సామర్థ్యం వంటి రంగాల్లో సింగరేణి ఏ పాత్ర పోషించగలదో అన్న దానిపై కూడా మనం ఆలోచన చేస్తున్నామని చెప్పారు. ఇవన్నీ సింగరేణి తన బాధ్యతను విస్తృతంగా అర్థం చేసుకునే ప్రయత్నాలుగా మాత్రమే చూడాలన్నారు. సింగరేణి బలం కేవలం ఉత్పత్తిలో కాదు మనుషుల్లో ఉందని, కార్మికుల భద్రత, సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి ఎప్పటికీ మన ప్రధాన సమస్యలే అని చెప్పారు. ఇప్పటికే అమలులో ఉన్న పథకాలను మెరుగుపరచడం పని పరిస్థితులను మరింత సురక్షితంగా చేయడం ఇవన్నీ నిరంతర ప్రక్రియలు అన్నారు. ప్రమాదాలను పూర్తిగా తొలగించలేకపోయినా వాటిని తగ్గించేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా పరిసర ప్రాంతాల అభివృద్ధి విద్య ఉపాధి అవకాశాల విషయంలో సింగరేణి తన వంతు పాత్రను కొనసాగిస్తుందన్నారు. మహిళా శక్తి పెరుగుతున్న తీరు సింగరేణిలో కనిపించడం మనందరికీ సంతోషకరమైన విషయం అన్నారు. గనుల్లో ఆపరేషన్లలో రక్షణ బృందాల్లో మహిళల భాగ్యస్వామ్యం మరువలేనిదన్నారు. సరైన వేగంతో సరైన దిశలో పరస్పర విశ్వాసంతో ముందుకు సాగితే సింగరేణి తన స్థిరత్వాన్ని కాపాడుకుంటూ కొత్త కాలానికి తగినట్టు మారగలదని తనకు నమ్మకం ఉందన్నారు. అనంతరం సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా కార్పొరేట్ పరిధిలోని ఉత్తమ అధికారి గా ఎంపికైన బి.శ్రీనివాస రావు, జిఎం ఎక్స్ప్లోరేషన్ ను, ఉత్తమ ఎన్సిడబల్యూఏ ఉద్యోగులుగా ఎంపికైన కే.వేంకటేశ్వర ప్రసాద్, సీనియర్ సిటి టెక్నీషియన్, మెయిన్ హాస్పిటల్, డి.వి.వి.నాగేంద్ర ప్రసాద్ లను సన్మానించారు.మెయిన్ ఆసుపత్రి నందు నిర్వహించిన వెల్ బేబీ షో లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతుల ప్రధానం చేశారు.జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైరక్టర్(పి అండ్ పి) కే.వెంకటేశ్వర్లు, డైరక్టర్(ఈ అండ్ ఎం) ఎం.తిరుమల రావు, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్టియూసి)సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్, సింగరేణి సిఎంఓఏఐ ప్రెసిడెంట్ టి.లక్ష్మి పతి గౌడ్, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, వివిధ శాఖల అధిపతులు, యూనియన్ నాయకులు, ఉత్తమ అధికారి, ఉత్తమ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, వెల్ఫేర్ సిబ్బంధి, ఎస్ అండ్ పిసి సిబ్బంది, సేవ సెక్రటరీలు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## అసౌకర్యం కలగకుండా 'ముక్కోటి' ఏర్పాట్లు

- రోడ్డు ప్రమాదాల నియంత్రణ కొరకు నిత్యం వాహన తనిఖీలు చేపట్టాలి
- జిల్లా పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు

**అఖండ సూర్య, భద్రాద్రి కొత్తగూడెం:**



తెప్పోత్సవం ముక్కోటి మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని రోడ్డు ప్రమాదాల నియంత్రణ కొరకు నిత్యం వాహన తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులతో మంగళవారం జరిగిన నేర సమీక్షా సమావేశాన్ని ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నివారణా చర్యలను చేపట్టాలని సూచించారు. సంవత్సరం చివరలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా నిత్యం వాహన తనిఖీలు చేపడుతూ మద్యం సేవించి వాహనాలను నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించి ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరూ భాద్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన పెండింగ్లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి భాదితులకు న్యాయం చేకూర్చాలని తెలిపారు. పోక్సో కేసులలోని నిందితులకు త్వరతగతిన శిక్ష పడే విధంగా కృషిచేయాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, మట్కా, క్రికెట్ బెట్టింగులు, కోడిపందాలు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చేసి నేరాల నియంత్రణకు పాటుపడాలని అన్నారు.ఈ నెల 29,30 తారీఖులలో భద్రాచలంలో జరగనున్న తెప్పోత్సవం, ముక్కోటి ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఇతర శాఖల సమన్వయంతో పకడ్బందీ బందోబస్తును ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామీ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఐటీ సెల్ సిఐ రాము, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## సంగారెడ్డి జిల్లాలో తగ్గిన నేరాల జోరు వార్షిక నివేదికను విడుదల చేసిన జిల్లా ఎస్పీ

**అఖండసూర్య, సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషి ఫలితంగా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు జిల్లా ఎస్పీ గారు వెల్లడించారు. రెండు వేల ఇరవై ఐదు వార్షిక నేరగణాంక నివేదిక ప్రకారం, జిల్లాలో మొత్తం ఎనిమిది వేల రెండు వందల యాభై ఐదు కేసులు నమోదు కాగా, గత ఏడాదితో పోలిస్తే తీవ్రమైన నేరాలు ఇరవై ఎనిమిది శాతం, హత్యలు ముప్పై రెండు శాతం మరియు అత్యాచార కేసులు ఇరవై ఒకటి శాతం మేర తగ్గాయి. అయితే, అపహరణ కేసులు మాత్రం ముప్పై తొమ్మిది శాతం పెరిగాయని, రోడ్డు ప్రమాదాలు మరియు వాటి వల్ల జరిగే మరణాల్లో కూడా సానుకూల తగ్గుదల నమోదైందని వివరించారు. ప్రజలకు భద్రత పై అవగాహన కల్పించేందుకు కమ్యూనిటీ పోలిసింగ్ మరియు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ జిల్లావ్యాప్తంగా షీటీంగస్తీని పెంచామని, పోక్సో బాధితులకు కౌన్సిలింగ్ తో పాటు సుమారు నలభై ఐదు లక్షల రూపాయల నష్టపరిహారం అందించామని ఎస్పీ తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా నలభై మూడు కేసులు నమోదు చేసి పెద్ద ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, ముప్పై నాలుగు కోట్లకు పైగా విలువైన సైబర్ మోసాల్లో ఏడు కోట్లకు పైగా సొమ్మును తిరిగి హోల్డ్ చేయగలిగామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా రెండు వేల నూట యాభై సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, డయల్ వంద కాల్స్‌కు కేవలం ఆరు నిమిషాల్లోనే స్పందిస్తున్నామని వెల్లడించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని, ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, పోలీసుల సంక్షేమానికి కూడా తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# ఓటరు జాబితా సవరణ గడువులోపు పూర్తి చేయాలి

- తాసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్

**అఖండ సూర్య, భద్రాద్రి కొత్తగూడెం:**



జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ, డేటా మ్యాపింగ్ పనులను నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జితేష్ పాటిల్ అన్నారు. మంగళవారం ఐడీఓసి కార్యాలయంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, ఐటీడీఏ పీవో రాహుల్, అన్ని మండలాల తహసీల్దార్లతో ఓటరు జాబితా సవరణ, మ్యాపింగ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరణ, సీతమ్మసాగర్ ప్రాజెక్టు భూసేకరణ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఉన్న డూప్లికేట్ ఎంట్రీలు, బ్లర్ ఫోటోలు, ఇతర లోపాలను గుర్తించి నిబంధనల ప్రకారం సరిదిద్దాలని సూచించారు. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు(బీఎల్ఓలు) సమన్వయంతో పని చేసి ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఎఈఆర్ఓలు తమ పరిధిలో పూర్తి బాధ్యత తీసుకుని, బీఎల్ఓలకు రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన నిర్వహించి ఫోటోలు తీసి అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి క్షుణ్ణంగా పరిశీలించి మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న హౌస్ నంబర్, పేరు, ఈపిక్ నంబర్ సెర్చ్ ఆప్షన్లు డేటా మ్యాపింగ్‌ను సులభతరం చేస్తున్నాయని తెలిపారు. అవసరమైన చోట్ల అదనపు సిబ్బంది, కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. బుధవారం అన్ని మండలాల్లో తహసీల్దారులు ఒకటి ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రం, మరొకటి తక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఎంపిక చేసి మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే జిల్లా స్థాయికి తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా మ్యాపింగ్ పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా మ్యాపింగ్‌ను 15 రోజుల్లోపు పూర్తి చేయాలని, అత్యంత జాగ్రత్తగా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూసేకరణను 15 రోజుల్లోపు పూర్తి చేయాలని కలెక్టర్ తహసీల్దారులను ఆదేశించారు. ఈ కెనాల్ కోసం అన్నపురెడ్డిపల్లి, బూర్గంపాడు, అశ్వాపురం, చంద్రుగొండ, చుంచుపల్లి, దమ్మపేట, జూలూరుపాడు, కొత్తగూడెం, ములకలపల్లి, పాల్వంచ, సుజాతనగర్ మొత్తం 11 మండలాల్లో అవసరమైన భూసేకరణకు సంబంధించిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సర్వేయర్లు ప్రతిరోజూ ఏ మండలాల్లో ఎంతవరకు సర్వే పూర్తయిందో పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి చర్ల, దుమ్ముగూడెం, మణుగూరు మండలాల్లోని 30 గ్రామాల్లో భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీతారామ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరణ, సీతమ్మసాగర్ ప్రాజెక్టు భూసేకరణ పనులను భద్రాచలం సబ్ కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పీపీసీ కేంద్రాలు, రైస్ మిల్లులను నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన అశ్వారావుపేట చెక్‌పోస్ట్ వద్ద ఇసుక, ధాన్యం అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు 'మన ఇసుక మన వాహనం' కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని తహసీల్దారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఎన్నికల సూపర్డెంట్ ధారా ప్రసాద్, భూసేకరణ సిబ్బంది యాసీన్, ఎన్నికల శిక్షకుడు సాయికృష్ణ, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రసాయన పరిశ్రమ ఏర్పాటుపై నిరసన

- మనుగడకే ముప్పు అని టీపీజేఏసీ ఆందోళన

**అఖండసూర్య, సంగారెడ్డి**



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం మల్గి గ్రామంలో శ్రీ ఆశా ఆల్డిహైడ్స్ అండ్ అడ్హెసివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేయ తలపెట్టిన ఫార్మాల్డిహైడ్ మరియు రెసిన్ తయారీ పరిశ్రమను వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రజల జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) ప్రతినిధులు మంగళవారం డప్పూరు మరియు మల్గి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామ సభల్లో టీపీజేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ కన్నెగంటి రవి మరియు జిల్లా కన్వీనర్ వై. అశోక్ కుమార్ మాట్లాడుతూ, ఈ పరిశ్రమ వల్ల స్థానిక ప్రజల మనుగడకే ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్లాంట్‌లో వాడే ఫార్మాల్డిహైడ్ వంటి ప్రమాదకర రసాయనాల వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు రావడమే కాకుండా, పుట్టబోయే పిల్లలు మందబుద్ధులుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా మంజీరా నదికి అత్యంత సమీపంలో ఈ పరిశ్రమ ఉండటం వల్ల గాలి, నీరు మరియు భూమి కలుషితమై వ్యవసాయం కుంటుపడుతుందని, హైదరాబాద్‌తో సహా లక్షలాది మందికి అందే త్రాగునీరు విషతుల్యమవుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం సమర్పించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో అనేక లోపాలు ఉన్నాయని, చుట్టుపక్కల ఉన్న కర్ణాటక రాష్ట్ర పరిధిలోని ఇరవై ఎనిమిది గ్రామాలు మరియు బీదర్ నగరంపై పడే ప్రభావాలను అధికారులు పూర్తిగా విస్మరించారని ప్రతినిధులు ధ్వజమెత్తారు. రెండు రాష్ట్రాల సరిహద్దులో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతి తప్పనిసరి అని, కేవలం రాష్ట్రస్థాయి అనుమతులతో ముందుకు వెళ్లడం చట్టవిరుద్ధమని వారు స్పష్టం చేశారు. అసంపూర్తిగా ఉన్న నివేదికల ఆధారంగా వచ్చే ఏడాది జనవరి మూడున నిర్వహించ తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రంలోని ప్రభావిత ప్రాంతాలను కూడా కలుపుకుని సరికొత్తగా అధ్యయనం చేయాలని, శూన్య ద్రవ వ్యర్థాల విడుదల (జీరో లిక్విడ్ డిస్చార్జ్) వంటి అంశాలపై స్పష్టమైన వివరాలను ప్రజల ముందు ఉంచాలని వారు కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా ఏకమై ఈ కాలుష్య కారక పరిశ్రమను అడ్డుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్తు తరాలకు తీరని అన్యాయం జరుగుతుందని టీపీజేఏసీ నేతలు పిలుపునిచ్చారు.



## శ్రీ రాగాలో సెమీ క్రిస్మస్ వేడుకలు

**అఖండ సూర్య, భద్రాద్రి కొత్తగూడెం:**

శ్రీ రాగా ప్లే అండ్ హై స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లే స్కూల్ విద్యార్థులు ఫాన్సీ డ్రెస్సుల్లో శాంతా క్లాజ్, ఏంజిల్స్, మేరీమాత, యేసు క్రీస్తు వేషధారణల్లో సందడి చేసి అందరినీ ఆకట్టుకున్నారు. క్రిస్మస్ పండుగ శాంతి ప్రేమ సోదరభావానికి ప్రతీక అని ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ మల్లారపు వర ప్రసాద్ తెలిపారు. స్కూల్ డైరెక్టర్ మల్లారపు కవిత మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ఉద్దేశాన్ని వివరిస్తూ విద్యార్థులు మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు క్రిస్మస్ గీతాలు నృత్యాలు స్కిట్లు ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## పకడ్బందీగా ఫతే ఖాన్ దర్గా ఉర్సు ఏర్పాట్లు

- అధికారులతో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమీక్ష

**అఖండసూర్య, సంగారెడ్డి :**

సంగారెడ్డి పట్టణంలోని ప్రసిద్ధ ఫతే ఖాన్ దర్గా ఉర్సు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆదేశించారు. వచ్చే నెల జనవరి తొమ్మిది, పది మరియు పదకొండు తేదీలలో జరగనున్న ఈ ఉత్సవాల ఏర్పాట్లపై ఆయన వక్ఫ్ బోర్డు, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు మరియు మైనార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా పారిశుధ్యం, మంచినీరు మరియు భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మతం ఏదైనా తాను రాజకీయాలకు అతీతంగా పండుగల్లో పాల్గొంటానని, ఈ ఉత్సవాల కోసం తన సొంత ఖర్చులతో పట్టణమంతా విద్యుత్ దీపాలంకరణ చేయించడమే కాకుండా, సుమారు నాలుగు వేల మందికి భోజన సదుపాయం కల్పిస్తానని వెల్లడించారు.

జనవరి ఆరవ తేదీ నాటికి ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని, ఆ రోజున తాను స్వయంగా పట్టణంలో పర్యటించి పనులను పర్యవేక్షిస్తానని అధికారులకు స్పష్టం చేశారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులను అధికారికంగా ఆహ్వానించాలని వక్ఫ్ బోర్డు అధికారులను కోరారు. దర్గా అభివృద్ధికి సంబంధించి శాశ్వత ప్రాతిపదికన చేపట్టాల్సిన పనుల కోసం ఒక సమగ్ర నమూనాను సిద్ధం చేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంగారెడ్డి పర్యటనకు వచ్చినప్పుడు వినతిపత్రం అందజేసి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. దర్గాతో పాటు పట్టణంలోని ఇతర మతాల ప్రార్థనా స్థలాల అభివృద్ధికి కూడా నిధులు ఇప్పిస్తానని తెలిపారు. త్వరలోనే దర్గా కమిటీల నియామకం పూర్తవుతుందని, గతంలో తొలగించబడిన ఇద్దరు సేవకులను మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.



## శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు

**అఖండ సూర్య, భద్రాద్రి కొత్తగూడెం:**

ఖమ్మం జిల్లా స్థానిక మామిళ్లగూడెం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నందు మంగళవారం సెమీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పిల్లలందరూ ఏంజెల్స్, శాంటా క్లాస్ దుస్తులలో ఎంతో అందంగా కనిపించారు. అలాగే క్రిస్టమస్ యొక్క ప్రత్యేకతను తెలియజేశారు. పిల్లలు వివిధ రకాల ఆటపాటలతో అలరించారు.పిల్లల తల్లి దండ్రులు ఎంతో మురిసి పోయారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్, ప్రిన్సిపాల్ నీరజ, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ గౌతమి, ప్రైమరీ ఇంచార్జ్ రేణుక, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ గీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




## హైదరాబాద్‌లో ఘనంగా అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ ముగింపు

- విజేత ఇనియన్‌కు రూ. 5 లక్షల బహుమతి

**అఖండసూర్య, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని హైటెక్స్ ప్రదర్శన కేంద్రంలో నిర్వహించిన ఏకాగ్ర అంతర్జాతీయ బహిరంగ రాపిడ్ చెస్ పోటీల బహుమతి ప్రధానోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన చెన్నైకి చెందిన ఇనియన్ ప్రథమ స్థానంలో నిలిచి ఐదు లక్షల రూపాయల నగదు బహుమతిని సొంతం చేసుకున్నారు. మిత్రోబా గుహ ద్వితీయ స్థానంలో నిలిచి మూడు లక్షల రూపాయలు, హరి కృష్ణ తృతీయ స్థానంలో నిలిచి ఒక లక్ష రూపాయల బహుమతిని అందుకున్నారు. మొత్తం ఇరవై రెండు లక్షల ఇరవై రెండు వేల రెండు వందల ఇరవై రెండు రూపాయల భారీ బహుమతి నిధిలో భాగంగా, మిగిలిన పదమూడు లక్షల ఇరవై రెండు వేల రెండు వందల ఇరవై రెండు రూపాయలను వివిధ విభాగాల్లో, ర్యాంకింగ్‌ల ప్రకారం విజేతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సినీ నటుడు జెమినీ సురేష్ మాట్లాడుతూ, ఇంతటి భారీ బహుమతి నిధితో తెలంగాణలో పోటీలు నిర్వహించడం అభినందనీయమని, ఈ వాతావరణం చూశాక తన పిల్లలకు కూడా చెస్ నేర్పించాలనే ఆసక్తి కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కాంగ్రెస్ నాయకులు ఫెరోజ్ ఖాన్, సంగీత దర్శకులు అనూప్ రూబెన్స్ మరియు ఇతర ప్రముఖులు మాట్లాడుతూ.. పిల్లల్లో ఏకాగ్రత, మేధాశక్తిని పెంపొందించడంలో చదరంగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. నిరంతర శ్రమే విజయానికి మార్గమని, గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాకారులు ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. ఇదే వేదికపై ఏకాగ్ర అకాడమీలో శిక్షణ పొంది 'కాండిడేట్ మాస్టర్' టైటిల్ సాధించిన హైదరాబాద్ కవలలు అమాయ అగర్వాల్, అనయ్ అగర్వాల్‌లను నిర్వాహకులు ప్రత్యేకంగా సత్కరించారు. అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్ సందీప్ నాయుడు మాట్లాడుతూ.. త్వరలోనే అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్లు దీపెన్, సేతురామెన్, అకాడమీ డైరెక్టర్లు చైతన్య నాయుడు, గిరీష్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# సంపాదకీయం



## పేదరిక నిర్మూలనపై దొంగ లెక్కలు!

భారతదేశంలో పేదరిక నిర్మూలన అన్నది కేవలం కాగితాలకే పరిమితం అవుతోంది. పేదలు ఉంటేనే రాజకీయ నాయకుల మనుగడ సాధ్యం అవుతుంది. పేల పేరుతో దుబారా చేయడం సులువవువతుంది. అనేక పథకాలను ప్రకటిచడం, డబ్బులను దుబారా చేయడం, ఓట్లను దండుకోవడం అన్న ప్రక్రియ నిరంతరంగా సాగాలి. అందుకే పేదల పేరుతో నిత్యం ఏదో ఓ కార్యక్రమం సాగుతూనే ఉంటుంది. ఇటీవల ఉపాధి హామీ పథకం పేరు మారింది. దీంతో అన్ని పార్టీలు గగ్గోలు పెడుతున్నాయి. మహాత్మాగాంధీ పేరు తొలగిండంపై ఆందోళనలకు దిగాయి. లెఫ్ట్ పార్టీలు కూడా ఇందులో పాలుపంచుకోవడం దారుణం. పేరులో ఏముందున్న జ్ఞానం లేకుండా గగ్గోలు పెడుతున్నారు. ఉపాధిహామీతో అసలు కూలీలకు కరువు వచ్చింది. ప్రభుత్వ ధనం వృధా అవుతోంది. వ్యవసాయ పనులు జరగడం లేదన్నది ప్రధాన ఆరోపణ. అయితే ఈ పథకం కింద గ్రామ స్థాయిలో నిర్మాణాత్మక పనులేవీ ఇప్పటి వరకు జరగలేదు. కేవలం మట్టి ఎత్తిపోయడం తప్ప. దీనికోసం వేలకోట్లు తగలేశారు. ఇకపోతే కోట్లాదిమందిని పేదరికం నుంచి బయటపడేశామని, కోట్ల మందికి ఇళ్లు కట్టించామని కేంద్రం చెబుతోంది. ఇంత జరిగితే పేదరికం లేకుండా పోవాలి. అలాంటప్పుడు ఉచిత బియ్యం, ఉచిత ఇల్లు, ఉచిత కరెంట్, ఉచిత గ్యాస్ వంటి పథకాలు అసవరం లేదు. ఓ వపు పేదరిక నిర్మాలన జరిగిందని చెబుతూనే..మరోవైపు పేదల పేరుతో పథకాల దందా సాగుతోంది. ఇది పాలకుల ద్వంద్వ విధానాలకు నిదర్శనం. పేదలు ఉంటేనే ఓట్లు రాలుతాయని వారికి తెలుసు. భారత్‌లో పేదలు జనాభాలో 5.25 శాతం మాత్రమే ఉన్నారంటూ ప్రపంచబ్యాంక్ ప్రకటించింది. తలసరి రోజు ఖర్చు రూ.62గా నిర్ధారించి అంతకన్నా తక్కువ ఆదాయం వస్తున్నవారు 5.25 శాతం మాత్రమే ఉన్నారని ప్రకటించింది. ఇక నీతి ఆయోగ్ 2022`23 నాటికి దేశంలో 5 శాతం మాత్రమే నిరుపేదలు ఉన్నట్టు ప్రకటించింది. గ్రామాల్లో రూ.57, పట్టణాల్లో రూ.69 చొప్పున రోజుకు తలసరి ఆదాయం గనుక వస్తే వారంతా నిరుపేదలు కానట్టే లెక్కించింది. పేదరిక స్థాయి నిర్ధారించేటప్పుడు ఆ సొమ్ముతో రోజువారీ ఆహారపు అవసరాలతో బాటు వైద్యానికి, దుస్తులు వగైరాలకు, రవాణాకు, అద్దెకు కూడా చెల్లించగలిగేలా ఉండాలి. ఇప్పుడు నిర్ణయించిన స్థాయిలో బతకాలంటే వాళ్ళు ఇల్లూ వాకిలీ లేని బిచ్చగాళ్ళుగా మాత్రమే మిగులుతారు. ఈ లెక్కన చూస్తే మరో ఏడాది నాటికి ఇండియాలో నిరుపేదలు అనేవారే లేరంటూ ప్రభుత్వం ప్రకటించవచ్చు. పెరుగుతున్న విద్య, వైద్యపు ఖర్చులతో కోట్లాదిమంది అదనంగా పేదరికంలోకి అనునిత్యమూ దిగజారిపోతూ వుంటే, కనీస పౌష్టికాహార లోపం వారిని జీవచ్ఛవాలుగా చేస్తూ వుంటే, మరోపక్క ప్రపంచబ్యాంక్ తన తప్పుడు లెక్కలతో నిరుపేదలు తగ్గిపోయారంటూ ప్రకటిస్తూ వారిని అవహేళన చేస్తూనే వుంది. ఎందుకంటే ఇంత తక్కువ స్థాయిలో బతకలేక ఆ నిరుపేదలంతా అప్పటికి చచ్చివూరుకుంటారు. కనీస పౌష్టికాహార స్థాయిని బట్టి పేదరికపు స్థాయిని గనుక నిర్ణయిస్తే అది ప్రభుత్వం నిర్ణయించినదానికి మూడు రెట్లయినా ఉంటుంది. ఆ స్థాయికి దిగువన ఇప్పుడు 65 శాతం ప్రజలు పడిపోయారు. నజానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో ధరల దాడి వల్ల ఉన్నవారు కూడా పేదలుగా మారే ప్రరమాదం ఏర్పడిరది. దీనిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదు. ప్రపంచ బ్యాంక్ లెక్కలు ఎందుకు పనికిరానివిగా గుర్తించాలి. పేదరిక నిర్మూలన అంటే కూడు,గూడు, గుడ్డ ఉంటేనే చాలదు. బతకడానికి పని ఉండాలి. పనిచేసుకుంటే కుటుంబాన్ని పోషించుకోగలగాలి. ఇవేవీ లెక్కల్లోకి తీసుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితులను కల్పించేందుకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు కూడా లేవు. పేదరికం నుంచి బైట పడడానికి నిర్దిష్టమైన చర్యలను తీసుకోవడం మొదలుపెట్టాలి. దుర్భర దారిద్యంలో బతుకుతున్నవారిని గుర్తించి వారికి తగు విధంగా పునరావాసానికి సహాయం అందించడంలో ముందుకు సాగాలి. కుటుంబాలను గుర్తించేందుకు గ్రామాల వారీగా లెక్కలు తీయాలిచ ప్రపంచబ్యాంక్ మాత్రం ఇటువంటిదేమీ చేయడం లేదు. నిరుపేదరికపు స్థాయిని అమెరికన్ డాలర్లలో రోజుకు 3 డాలర్లుగా నిర్ధారించింది. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడు డాలరు`రూపాయి మారకపు విలువ ప్రకారం పేదరికపు స్థాయి రూ.270గా ఉండాలి. కాని వాస్తవ మారకపు రేటు ప్రకారం కాకుండా అందులో 0.28 శాతం రేటు ప్రకారం మాత్రమే లెక్కిస్తోంది! ఇక్కడి అధికారిక పేదరిక స్థాయికి దగ్గరగా ఉండేట్టు వాస్తవ మారకపు రేటును సవరిస్తోంది! ఇలా వివిధ దేశాల్లో అధికారిక లెక్కల్లో పేదరికపు స్థాయిని హీనమైన స్థాయికి దిగజార్చు తున్నారు. ఆ స్థాయిలో ప్రాణాలను నిలబెట్టుకోవడమే అసాధ్యం అన్న వాస్తవాన్ని తెలిసి కూడా లెక్కల కోసం ఇలా చేస్తున్నారని అనుకోవాల్సిందే. చాలా దశాబ్దాలుగా ప్రభుత్వాలు పేదరికపు స్థాయిని లెక్కించే విధానాన్ని అసమగ్రంగా చేపడుతున్నాయి. ఇది ప్రపంచబ్యాంక్ ఆదేశాల మేరకే జరుగుతోందన్నది స్పష్టం. మొట్టమొదట లెక్కించిన కనీస పేదరిక స్థాయి మాత్రమే సరైన పద్ధతిలో సాగింది. తరవాత ధరల సూచీ ఆధారంగా సవరిస్తూ వచ్చారు. అలా సవరించిన తర్వాత ఆ సొమ్ముతో పౌరుడు లేదా ఓ కుటుంబం కనీస పౌష్టికాహారం పొందగలుగుతున్నారా లేదా అన్నది మాత్రం ఎక్కడా పరిశీలించిన పాపాన పోలేదు. పేరికాన్ని లెక్కించే విషయంలో దేశంలో చదువుకున్న వారికీ ఈ ప్రభుత్వం, ప్రపంబ్యాంక్ అనుసరిస్తున్న పద్ధతి ఎంత అర్ధరహితమో తెలియదు గనుకనే ప్రభుత్వపు ఆటలు సాగుతున్నాయి.ఇలా ప్రతీసారీ అధికారిక లెక్కలు పేదరిక స్థాయిని అంతకంతకూ తగ్గిస్తూనే వస్తున్నాయి. అది కాస్తా ఇప్పుడు అసందర్భమైన, అర్ధం లేని స్థాయికి చేరింది. ప్రభుత్వం నిర్ణయించిన పేదరిక స్థాయి కనీసం ప్రాణాలనైనా నిలబెట్టుకోడానికి కూడా పనికిరాదు. అందుచేత మా దేశంలో నిరుపేదలే లేరు అని చెప్పుకోవడం దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు. నిజానికి కాలానుగుణంగా కనీస అవసరాలు మారుతూ వుంటాయి. ఆ మార్పును పరిగణనలోకి తీసుకోవాలి. కాని అలా తీసుకోకపోయినప్పటికీ, పాత స్థాయిలోనే అవసరాలు కొనసాగుతున్నాయని అనుకున్నప్పటికీ, వాటిలో వచ్చిన మార్పులనైనా పరిగణనలోకి తీసుకోవాలి. 50 సంవత్సరాల క్రితం విద్య, వైద్యం ప్రభుత్వ వ్యవస్థ ద్వారా అందుతూవుండేవి. అప్పుడు వాటి కోసం చేయవలసిన ఖర్చు నామ మాత్రంగా ఉండేది. ఇప్పుడు ఆ సేవలు ప్రైవేటుపరం అయ్యాయి. వాటి ధరలు శరవేగంగా పెరిగిపోతూ వున్నాయి. ఇటు వైద్యానికి, చదువుకు, అటు ఆహారానికి ఖర్చు సర్దుబాటు చేయడం చాలా కుటుంబాలకు అసాధ్యం అయిపోతోంది. దీని వలన ఎక్కువమంది పేదల పౌష్టికాహార స్థాయి పడిపోతోంది. అంతేగాక, ఇంతవరకూ పేదలుగా పరిగణించబడనివారు కూడా ఇప్పుడు పేదరిక స్థాయికి దిగువకు జారిపోతున్నారు. జాతీయ శాంపిల్ సర్వే గణాంకాల ప్రకారం ఇండియాలో గ్రామాల్లోను, పట్టణాల్లోను తలసరి పౌష్టికాహార లభ్యత చాలా వేగంగా పడిపోయింది. ఇది గమనించకుండా పేదరికం నుంచి విముక్తి పొందారని, పేదరికం తగ్గిందని లెక్కలు వేసుకోవడం ఆత్మహత్యా సదృశ్యం కాగలదు.




# ట్రెండింగ్ లో సేవ్ ఆరావళి




కేంద్రం ఇచ్చిన సిఫార్సులను సుప్రీంకోర్టు ఆమోదించిన తరువాత 'సేవ్ అరావళి' ప్రచారం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. కేంద్రం నిర్ణయం, సుప్రీంకోర్టు తీర్పు పర్యావరణ వేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ క్రమంలో తాజాగా నిర్ణయాలు.. ఆరావళికి డెత్ వారెంట్ అంటూ కొందరు పేర్కొంటున్నారు. అయితే, కేంద్రం ఏం నిర్ణయం తీసుకుంది.. సుప్రీంకోర్టు ఏమని ఆమోదించింది.. ఆరావళికి వచ్చే ముప్పు ఏమిటి.. సేవ్ ఆరావళి ప్రచారం సోషల్ మీడియాలో ఎందుకు ట్రెండ్ అవుతోంది.. ఢల్లీ చుట్టూ ఉన్న ఆరావళి పర్వతాల దగ్గర మైనింగ్ కి అనుమతి ఇవ్వడంతో ప్రారంభమైన రగడ తీవ్ర స్థాయికి చేరింది. కంపెనీల లాభం కోసమే ఇలా ఆరావళి పర్వతాల నిర్వచనమే మార్చేశారని ప్రతిపక్షాలు నేతలు, పర్యావరణవేత్తలు ఆందోళనకి దిగారు. కేంద్రం మాత్రం 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న వాటిని పర్వతాలు అనరని.. అసలు ఆరావళి జోలికి తాము వెళ్లడం లేదని వాదిస్తోంది. దీంతో రాజకీయ రగడకి తోడు.. పర్యావరణ కోణంలోనూఆందోళనలకి తావిస్తోంది.మన దేశంలో అత్యంత పురాతనమైన పర్యతశ్రేణి ఆరావళి. ఇది 250 కోట్ల ఏళ్ల క్రితం నాటివని చెప్తారు. గుజరాత్ నుంచి రాజస్థాన్, హర్యానా, ఢల్లీవరకు ఈ పర్వతాలు విస్తరించగా.. అసలు ఇతర ప్రాంతాల నుంచి ఢల్లీకి ఇసుక తుఫాన్లు.. ధూళి వగైరా రాకుండా పెట్టని కోటలా కాపాడుతున్నాయంటారు. అసలు ఎడారులు థార్ నుంచి ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా అడ్డుపడిరది కూడా ఈ పర్వతాలే. ఈ పర్వతాలలో అరుదైన ఖనిజాలు ఉన్నాయి. ప్రపంచంలో ఏ పర్వతాల్లోనైనా అరుదైన జీవ జాతులు నిక్షేపాలు ఉంటాయ్. వాటి కోసం అన్వేషణలో భాగంగా ఈ సంపద అంతా నాశనం చేస్తున్నారు.ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం 100 మీటర్ల కంటే ఎత్తు తక్కువ ఉన్న ఏ కొండలనైనా మైనింగ్ చేసుకోవచ్చంటూ.. మౌంటైన్.. అంటే పర్వతాలకు కొత్త నిర్వచనం ఇచ్చింది. దీంతో మైనింగ్ కంపెనీలకు ఆరావళిలో దారి దొరికినట్లైంది. దీనిపైనే పీపుల్ ఫర్ ఆరావలీస్ అనే స్వచ్ఛంద సంస్థ ఆందోళనకి దిగింది. ఇప్పటికే అక్రమ తవ్వకాలు, అభివృద్ధి పేరిట సాగుతున్న కట్టడాలతో? హరియానా, రాజస్థాన్‌లోని చార్ఖీ దాద్రి, భీవానీ జిల్లాల్లో ఆరావళి పర్వతాలు ధ్వంసమయ్యాయి. జీవ వైవిధ్యం నాశనమైంది. పరిస్థితి మరింత దిగజారితే ఉత్తర భారతంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ఆరావళిలో గనుల తవ్వకాలను సుప్రీంకోర్టు గతంలో నిషేధించినా, అక్రమ కార్యకలాపాలు మాత్రం ఆగలేదు. ఇప్పుడు పర్వతాలకు కొత్త నిర్వచనం ఇవ్వడంతో ఆరావళిలోని 90 శాతం ప్రాంతాలకు మైనింగ్ ముప్పు పొంచి ఉంది. అదే జరిగితే, ఢిల్లీ వరకు థార్ ఎడారి విస్తరించే ప్రమాదముంది. గాలి నాణ్యత మరింత దెబ్బతింటుంది. అనారోగ్య సమస్యలు పెరిగిపోతాయని 'పీపుల్ ఫర్ ఆరావలీస్' హెచ్చరిస్తోంది.ఈ ఏడాది జూన్ 5న స్వయంగా మోదీనే ఆరావళి గ్రీన్ ప్రాజెక్ట్ ప్రారంభించగా.. ఇప్పుడిలా అసలు పర్వతాలంటే ఏంటంటూ కొత్త డెఫినిషన్ ఇవ్వడమే విమర్శలకు తావిస్తోంది. కేంద్రం మాత్రం ప్రతిపక్షాల ఆందోళనను తప్పుబడుతోంది. తాజా నిబంధనల వల్ల పర్వతాలకు ఎలాంటి ముప్పు వాటిల్లదని స్పష్టం చేసింది. కొత్త నిబంధనలతో 90 శాతం పర్వతాలు సురక్షితంగా ఉంచుతామని భరోసా ఇస్తూ.. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులు, మార్గదర్శకాలకు అనుగుణంగానే పర్వత ప్రాంతాల రక్షణ జరుగుతోందని ప్రకటించింది. ఆరావళి ప్రాంతంలో అక్రమ మైనింగ్‌ను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి పని చేస్తామంటోంది కేంద్రం. భారత దేశంలో పురాతనమైన ఆరావళి పర్వత శ్రేణి గుజరాత్ నుంచి రాజస్థాన్, హర్యానా, ఢల్లీవరకు విస్తరించి ఉంది. ఈ పర్వతాలు దేశ చారిత్ర, భౌగోళిక శాస్త్రంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సుమారు 700 కిలోమీటర్ల పొడవున పర్వత శ్రేణి విస్తరించి ఉంది. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా 2024లో ఒక విషయం చెప్పింది. ఆరావళిలోని తక్కువ ఎత్తు ఉండే పర్వతాలు.. థార్ ఎడారి నుంచి వచ్చే ధూళి, ఇసుకను అడ్డుకోవడంలో సహజ కవచంగా పనిచేస్తోందని తెలిపింది. ఇది ఢల్లీ? ఎన్సీఆర్ ప్రాంతంతో సహా బహుళ రాష్ట్రాలకు భూగర్భ జల రీఛార్జ్, గొప్ప జీవవైవిధ్యాన్ని నిలబెట్టేందుకు సహాయపడుతుంది. కొంతకాలంగా ఆరావళి పర్వతాలపై ఖనిజాలకోసం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అందువల్ల క్రమంగా కొండలు తరిగిపోతున్నాయి. పర్యావరణం దారితప్పుతోంది.. ఈ పర్వతాలు తరిగిపోతూ ఉంటే చలిగాలులు ముందుగానే ఇండియాలోకి వచ్చేస్తాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ పర్వతాల్లో 100 మీటర్ల కంటే (328 అడుగులు) తక్కువ ఎత్తు ఉన్న ప్రాంతాల్లో మైనింగ్ జరుపుకోవచ్చునని అనుమతి ఇచ్చింది. కేంద్రం తీరుపై పర్యావరణ వేత్తల నుంచి, పలు పార్టీల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి 100మీటర్లలోపు ఉన్న వాటిని ఆరావళి పర్వతాలుగా చెప్పలేమని, పర్వతం అనేది 100 మీటర్ల కంటే ఎత్తే ఉంటుందనీ,.. అందువల్ల తాము పర్మిషన్ ఇచ్చింది పర్వతాల్ని తొలిచేందుకు కాదని కేంద్రం పేర్కొంది. స్థానిక భూభాగాల నుండి కనీసం 100 మీటర్ల ఎత్తులో ఉన్న కొండలు లేదా ఒకదానికొకటి 500 మీటర్లలోపు ఉన్నటువంటి కొండల సమూహాలు మాత్రమే ఇప్పుడు ఆరావళి శ్రేణిలో భాగంగా గుర్తించబడతాయని కేంద్రం పర్యావరణ మంత్రిత్వ శాఖ పేర్కొంది.సుప్రీంకోర్టు నిర్ణయం తరువాత పురాతన పర్వత వ్యవస్థల్లో ఒకటైన ఆరావళి కొండలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. సుప్రీం తీరుపై పర్యావరణ వేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో 'సేవ్ ఆరవళి' హ్యాష్‌ట్యాగ్‌తో ఆరావళిని రక్షించాలని సోషల్ మీడియా వేదికగా నిపుణులు, పర్యావరణ కార్యకర్తలు పిలుపునిస్తున్నారు.. అంతేకాదు.. ఆరావళిని టేప్ కొలతలు లేదా ఎత్తు ద్వారా మాత్రమే అంచనా వేయలేము. దాని పర్యావరణ ప్రాముఖ్యత ద్వారా దానిని అంచనా వేయాలని గెహ్లాట్ అన్నారు.

## ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుడు పెరియార్ రామస్వామి



భారతీయ సమాజంలో కుల వ్యవస్థ నరనరాల్లో జీర్ణించుకొని అన్ని రంగాల్లో అసమానతలు పెరగడానికి కారణమైంది. ఈ అసమానతలను రూపుమాపడానికి సాహు మహరాజ్, నారాయణ గురు, రామస్వామి పెరియర్ వంటి సామాజిక విప్లవవీరులు చేసిన త్యాగఫలితంగా భారతదేశం స్వేచ్ఛా, సమానత్వం, సామాజిక, ఆర్థిక, రాజకీయాలు పునాదులుగా ఏర్పడిన భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూనే సమసమాజ నిర్మాణానికి దోహదం చేశారు. దక్షిణ భారతదేశ ప్రజలచే ముఖ్యంగా తమిళనాడు ప్రజలచే పెరియర్‌గా తాన్ తై పెరియర్‌గా ఆత్మీయంగా పిలవబడే ఈరోడ్ వెంకట రామస్వామి 1879 సెప్టెంబరు 17న ఈరోడ్‌లో జన్మించారు. సంఘ సంస్కర్తగా, హేతువాదిగా, ఆత్మగౌరవ ఉద్యమ నిర్మాతగా ద్రావిడ ఉద్యమ సారథిగా ఆయన చేసిన సేవలకు గుర్తుగా ప్రజలు ఆయనను పెరియర్‌గా పిలుచుకునేవారు. 'పెరియర్' అంటే 'పెద్ద మనిషి' అని అర్థం.సమాజంలో ఆయన కుల, మత, వర్గ ఆధిపత్యాలపై తిరుగుబాటు చేశాడు. కుల, మత రహిత సమసమాజం కావాలని ఆయన ఆకాంక్ష. కానీ నిన్నగాక మొన్న పరువు హత్యలు ఈ దేశంలో జరిగిన తరుణంలో పెరియర్ జయంతి, వర్ధంతి లు నిర్వహించుకుంటున్నామంటే ఆయన ఆకాంక్ష ఇంకా అలాగే ఉంది. మహిళలకు సమాన హక్కులు కావాలని ఆయన కాంక్షించారు. పెరియర్ ముఖ్యంగా సమాజంలో ప్రధానంగా నెలకొని ఉన్న బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించారు. దక్షిణ భారతానికి చెందిన ద్రావిడులపై ఉత్తరానికి చెందిన బ్రాహ్మణ ఆధిపత్యాన్ని సహించేది లేదని స్వీయభావన ఉద్యమాన్ని నిర్మించారు. అగ్రవర్ణాలు తమ ఆధిప త్యాన్ని కొనసాగిం చడం కోసమే ఈ దేవుండ్లు, గుడులు, గోపురాలను నిర్మి స్తూ పనికిమాలిన పురాణా లను సృష్టించారని ప్రచారో ధ్యమాన్ని సాగించడం ద్వారా ఆయన ప్రముఖ హేతువాదిగా పేరు పొందారు. హేతువాదం, ఆత్మగౌరవం, స్త్రీ హక్కులు, కుల నిర్మూలన కోసం పెరియర్ చేసిన పోరాటం అప్పటికీ, ఇప్పటికీ ఒక చరిత్రగా మిగిలిపోతుంది. మూల`ద్రావిడ వాసులైన బ్రాహ్మణేతరులను, భార తదేశానికి చెందిన బ్రాహ్మ ణులు దోపిడీ చేయడాన్ని అణివేయడాన్ని వ్యతిరేకించారు. తమిళ సమాజాన్ని విప్లవ మార్గంలో నడిపి కుల వివక్షతను తొలగిం చడానికి తీవ్రంగా కృషి చేసిన వ్యక్తిగా తమిళ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి పెరియర్ రామస్వామి. అందుకే ఆయ నను ఆధునిక కాల ప్రవ క్తగా, ఆగేయ ఆసియా సోక్రటిస్‌గా, సామాజిక విప్లవ పితామహుడిగా, అజ్ఞానం, అంధ విశ్వాసాలు, అసంబద్ధమైన అచిర వ్యవహారాల ను వ్యతిరేకించే వారిగా యునెస్కో అభివర్ణించింది. ''దేవుడు లేడు, దేవుడు లేడూ, అసలు దేవుడే లేడు'' అనే నినాదంతో పెరియర్ సాగించిన ఉద్యమం ప్రధానమైనది, కుల, మత వ్యత్యాసాలు కలిగిన భారతదేశం తనకు వద్దని, కుల, మత రహితమైన భారతమే తనకు కావాలని పోరాటం చేశాడు. కుల, మతాలను రాజ్యాంగం నిషేధించినప్పుడే కుల, మత రహిత సమాజం ఏర్పడుతుందని ఆయన వాధించాడు. హిందుత్వ వాదాన్ని గట్టిగా వ్యతిరేకించారు. కాబట్టే వారికి పెరియర్ అంటే గిట్టడం లేదు. పెరియర్ తన ఆశయాల సాధన కోసం 1939లో జస్టిస్ పార్టీ పెట్టారు. 1944లో జస్టిస్ పార్టీని 'ద్రావిడ్ దార్ కళనంగా' మార్చారు. ఈ పార్టీ సామాజికోద్యమానికే ప్రాధాన్యతని చ్చి ఎన్నికలకు దూరంగా ఉండి మరీ పోరాటం చేసింది. అంట రానితనం, కులం, వర్ణ వివక్షత తీవ్రంగా ఉన్న దేశంలో ప్రజల తో ఆత్మగౌరవాన్ని పెంపొందించడం, వారి మధ్య ఉన్న సా మాజి క ఆర్థిక సమానత్వాన్ని సాధించడం కుల వ్యవస్థను దోపిడీ మయమైన సాంప్రదాయాలను నిర్మూలించడమే పెరియర్ ధ్యేయం. హిందూ మతం ఆపాదించిన తరతరాల బానిసత్వాన్ని వదిలించుకునేందుకు దేవుడు ఒక్కడే, మనుషులంతా ఒక్కటే అని చాటడం మంచిదని ప్రభోధించాడు. ఎప్పుడు ఆయన భావాలు, ఆలోచనలు విప్లవాత్మకమైనవిగానే ఉండేవి. దేశం కుల, మత కంపులో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో మత దురహంకారాన్ని వ్యతిరేకిస్తూ శాస్త్రీయ, హేతుబద్ధమైన జీవన విధానాన్ని అవలంభించారు.రామస్వామి పెరియార్ 1973 డిసెంబరు 24న తన 94వ ఏట మరణించారు.ఆత్మగౌరవ పోరాటాలు చేసిన దళితులు, స్త్రీలు, బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని ధారపోసి, తన చివరి శ్వాస వరకు సమసమాజం కోసం పోరాటం చేసిన సామాజిక విప్లవకారుడు పెరియర్ రామస్వామి



## నేడు జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

భారతదేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 24వ తేదీని జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా జరుపుకుంటారు, దీనిని జాతీయ వినియోగదారుల దినోత్సవం అని కూడా పిలుస్తారు, డిసెంబర్ 24, 1986న వినియోగదారుల రక్షణ చట్టం భారత రాష్ట్రపతి ఆమోదం పొందిన రోజును గుర్తుచేసుకునేందుకు దీనిని నిర్వహిస్తారు. వినియోగదారులకు వారి హక్కులు మరియు బాధ్యతల గురించి అవగాహన కల్పించడం ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.వినియోగదారులకు వారి హక్కుల గురించి మరింత అవగాహన కల్పించడానికి ఈ చట్టం అమలు చేయబడిరది. వినియోగదారుల హక్కులను కాపాడటం మరియు వినియోగదారులు మార్కెట్ దుర్వినియోగానికి గురికాకుండా చూసుకోవడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం.వినియోగదారుల రక్షణ చట్టం అన్యాయమైన వాణిజ్య పద్ధతులను నియంత్రిస్తుంది.ఈ పద్ధతుల నుండి వినియోగదారులకు రక్షణను కూడా అందిస్తుంది. ఈ చట్టం వినియోగదారులకు పరిష్కార వేదికల ప్రభావవంతమైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం ద్వారా వారి వివాదాలను త్వరగా పరిష్కరించడంలో సహాయపడుతుంది. అప్పీలేట్ కోర్టులు వినియోగదారులకు వారి వ్యత్యాసాలకు చవకైన పరిష్కారం లభించేలా చూస్తాయి.ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని మార్చి 15న జరుపుకుంటారు.

## చెక్‌డ్యామ్‌లు కూలాయా..కూల్చివేశారా ?

- అంతుచిక్కని చెక్‌డ్యామ్‌ల విధ్వంసం
- పరస్పర విమర్శలతో అసలు సమస్య పక్కకు

**అఖండసూర్య, కరీంనగర్ :**



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మానేరు పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాలు పెంచడంతోపాటు రైతులకు సాగునీరు ఇచ్చేందుకు గతంలో నిర్మించిన చెక్ డ్యామ్‌లు కూలిపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. బీఆర్‌ఎస్ హయాంలో వందల కోట్లు ఖర్చుచేసి నిర్మించిన ఈ చెక్‌డ్యామ్స్ ద్వారా దాదాపు 10 వేల ఎకరాల్లో సాగునీటికి ఢోకా లేకుండా పోయింది. కానీ ఇప్పుడు వాటి ఉనికే ప్రశ్నార్థకం కావడం ఆందోళన కలిగిస్తోంది. చెక్ డ్యామ్స్ వరుసగా కూలిపోతుండటం హాట్ టాపిక్‌గా మారింది. నవంబర్‌లో గుంపుల`తనుగుల గ్రామాల మధ్య ఉన్న చెక్ డ్యామ్ రాత్రికి రాత్రే కొట్టుకుపోయిన ఘటన కలకలం రేపింది. తిరిగి రెండ్రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవి సోమన్‌పల్లి శివార్లలో మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యాం పూర్తిగా ధ్వంసమైపోయింది. ఈ రెండిటి ఆధారంగా వందల ఎకరాలు సాగవుతున్నాయి. ఉన్నట్టుండి రెండూ కొట్టుకుపోవడంతో చుట్టుపక్కల రైతాంగానికి తీరని నష్టం జరుగుతోంది. ఆ నష్టం ఒక ఎత్తయితే? అసలు ఉన్నట్టుండి ఈ చెక్ డ్యామ్‌లు ఎందుకు కొట్టుకుపోతున్నాయి? ప్రమాద వశాత్తు అలా జరుగుతోందా? లేక పనిగట్టుకుని ఎవరైనా కూల్చేస్తున్నారా అన్న ప్రశ్నలకు ప్రస్తుతానికి సమాధానం దొరకడం లేదు. నిజానికి వరుసగా కుప్పకూలే అవకాశం లేదు. దీంతో ఇప్పుడీ ఘటను రాజకీయంగా వేడి రాజేస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల పరస్పర విమర్శలు పెంచేస్తున్నాయి. చెక్ డ్యామ్‌లు కూలిన విషయం తెలిసిన వెంటనే కాంగ్రెస్ నేతలు అక్కడకు వెళ్ళి పరిశీలించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయించిన నాసిరకం పనులు, అనాలోచిత చర్యల వల్లే చెక్ డ్యామ్ కూలిందని ఆరోపించారు. దాంతో బీఆర్‌ఎస్ నేతలు క్షేత్రస్థాయికి వెళ్లి అధికార పార్టీపై ఎదురుదాడి మొదలు పెట్టారు. తనుగుల దగ్గర కూలిన చెక్ డ్యామ్ దగ్గరికి మాజీ మంత్రులు హరీష్, గంగుల వెళ్లి ఇసుక మాఫియా కోసమే బాంబులు పెట్టి పేల్చివేశారని ఆరోపించారు. అది కూలిపోయిందా పేల్చివేశారా అన్న చర్చలు, విచారణలు జరుగుతుండగానే అడవి సోమన్ పల్లి వద్ద ఉన్న చెక్ డ్యామ్ కొట్టుకుపోవడం ఇంకా సంచలనమైంది. అడవి సోమన్ పల్లి విచారణకు బీఆర్‌ఎస్ నిజ నిర్ధారణ బృందాన్ని పంపింది. నీటిపారుదల నిపుణులు, బీఅరెస్ నేతలతో కూడిన ఆ టీమ్ శనివారం అక్కడకు చేరుకుని చెక్ డ్యామ్ కూలిపోలేదని కూల్చివేశారని ప్రకటించింది. దానికి తోడు ఆదివారంనాడు మీడియాతో మాట్లాడిన కేసీఆర్ కూడా చెక్ డ్యామ్‌లను బాంబులు పెట్టి పేల్చివేస్తారా?? ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తారా..? మేం అధికారంలోకి రాగానే దోషులు పాతాళంలో ఉన్నా పట్టుకు వస్తామంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసలు చెక్ డ్యామ్‌ల చుట్టూ ఏం జరుగుతోందన్న చర్చలు నడుస్తున్నాయి. లక్షలాది క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు కూడా చెక్కుచెదరకుండా ఉన్న చెక్ డ్యామ్స్ ఉన్నట్టుండి, అదీ కూడా ఎలాంటి వరదలు లేని టైంలో ఎలా కొట్టుకుపోతాయని ప్రశ్నిస్తున్నారు బీఆర్‌ఎస్ నేతలు. ఇసుక మాఫియా కోసం అధికార పార్టీ నేతలే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డారంటూ విమర్శలు మొదలుపెట్టారు. బాంబులు పెట్టి పేల్చారంటూ ప్రతిపక్ష నేతలు పదే పదే ప్రస్తావించడం అధికార పార్టీకి కాస్త ఇబ్బందిగానే మారింది. నాణ్యతా లోపం వల్లే కూలిందని తొలుత ప్రకటించిన కారణంగా ఇప్పుడు ఆత్మరక్షణలో పడ్డామన్న అభిప్రాయం పెరుగుతోంది. లోకల్ లీడర్స్ తొందరపాటు వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని హస్తం క్యాంపులో చర్చలు సాగుతున్నాయి. కోట్లాది రూపాయలతో నిర్మించిన చెక్ డ్యామ్‌లు కూలిపోయాయా.. లేక కూల్చివేశారా..? అనేది తేల్చాల్సింది ప్రభుత్వమే. ఇందుకు కారణమైన వారిని పట్టుకుని శిక్షించాల్సిందే.

## యూరియా కోసం యాప్ ద్వారా బుకింగ్

- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- గ్రామాల వారీగా సమావేశాల ద్వారా చైతన్యం

**అఖండసూర్య, నిజామాబాద్ :**

రైతులకు యూరియా ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల బుకింగ్ యాప్‌ను ప్రతి రైతు తప్పనిసరిగా వినియోగించాలని, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారులకు కలెక్టర్ సూచించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతులందరూ ఈ యాప్‌ను వినియోగించాలని, ఎలాంటి సందేహాలున్నా సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎరువుల కోసం గంటల తరబడి లైన్లలో నిలబడకుండా.. సులభంగా, పారదర్శకంగా అవసరమైన ఎరువులు అందేలా ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ తీసుకొచ్చింది. రైతులు ఇంటి దగ్గరే ఉండే ఆయా సీజన్లకు అవసరమైన ఎరువులను యాప్‌లో బుకింగ్ చేసుకొని సులభంగా పొందవచ్చు. జిల్లాలో ఇది అమల్లోకి రావడంతో ఎలా బుకింగ్ చేయాలి అన్న అంశాలపై రైతులకు కేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం వ్యవసాయ అధికారులు గ్రామాల్లో సమావేశాలు పెట్టి అవగాహన రైతులకు కల్పిస్తున్నారు. రైతు వేదికలు, పంచాయతీ భవనాలు, సొసైటీలు, గ్రామ కూడళ్లలో సమావేశాలు పెట్టి .. యాప్ గురించి సులభంగా అర్థమయ్యేలా వివరిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా వరి, మక్క, సోయా, పత్తి, చెరకు, కంది,పెసర, మినప పంటలు సాగు చేస్తుంటారు. ఈ పంటల సాగుకు విరివిగా ఎరువులు అవసరమవుతాయి. ప్రధానంగా యూరియా వినియోగంఎక్కువ. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో సొసైటీలు, డీలర్ల వద్ద రైతులు ఎరువుల కోసం క్యూ కట్టవలసివస్తోంది.



# రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకున్న కవిత

**అఖండసూర్య, యాదాద్రి**

జాగృతి జనంబాట కార్యక్రమం లో పాల్గొనేందుకు కవిత వెళ్తుండగా ఆమెకు అభివాదం చేసేందుకు ప్రయత్నించి తండ్రీకుమార్తె బైక్ పై నుంచి కింద పడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనలో భాగంగా బీబీ నగర్ ఎయిమ్స్ కు వెళ్తుండగా నారపల్లి వద్ద బైక్ అదుపుతప్పి తండ్రీకుమార్తె కింద పడిపోయారు,. వారిని గమనించి కవిత వెంటనే తన వాహనం ఆపేసి కింద పడిన తండ్రీకుమార్తె వద్దకు వెళ్లి తన కాన్వాయ్ లోని వాహనం లో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తండ్రీకుమార్తెలకు ప్రథమ చికిత్స చేయించారు. ఇద్దరికి ప్రమాదం లేదని డాక్టర్లు తెలిపారు.

# అర్ధరాత్రి అంతాయిపల్లిలో గుండాల హల్చల్

**అఖండసూర్య, మేడ్చల్**

మేడ్చల్?మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట మండలం అంతయిపల్లి బిట్స్ కాలనీ సర్వేనెంబర్ 108 వద్ద ఉద్రిక్తత....సోమవారం రాత్రి పెద్ద ఎత్తున కిరాయి గుండాలు, రౌడీ మూకలు పట్టాదారుల భూమిలో హద్దులు మార్చి ఆక్రమణలకు యత్నం. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన కిరాయి గుండాలతో గత కొన్ని రోజులుగా పహారా కాస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మాగం దేవేందర్ రెడ్డి మరియు మాగం నర్సింహారెడ్డిలకు చెందిన పట్టా భూమిలో సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, కంచెలను తొలగించారు. స్థానిక ప్రజలు నిత్యం ప్రయాణించే రోడ్డు ను సైతం కబ్జా చేసి అడ్డంగా కంటైనర్ను ఏర్పాటు చేసారు. స్థల టు యజమాని ఉదయం తమ స్థలంలోకి వెళ్లి చూడగా వారు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు సూచిక బోర్డులు మరియు హద్దు రాళ్లు ముక్కలు ముక్కలుగా పడి ఉండడంతో వెంటనే పోలీసులను ఆశ్రయించారు. సంఘటన స్థలానికి చేరుకున్న శామీర్ పేట సిఐ శ్రీనాథ్ తన బృందంతో కబ్జాకి గురైన స్థలాన్ని పరిశీలించి ఆ స్థలంలో తిష్టవేసిన 15 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు,.

# బంగ్లాదేశ్ ఘటనలను ఖండిస్తూ హిందూ సంఘాల ఆందోళన

**అఖండసూర్య, హైదరాబాద్:**

బంగ్లాదేశ్లో హిందువులపై జరుగుతున్న మారణహోమాన్ని ఖండిస్తూ కొత్తపేట చౌరస్తాలో బంగ్లాదేశ్ జిహాదీల దిష్టిబొమ్మ దహనం జరిగింది. హిందూ మైనారిటీలపై జరుగుతున్న మారణహోమాన్ని తీవ్రంగా ఖండిస్తూ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, హిందూ వాహిని, స్థానిక బీజేపీ కార్పొరేటర్స్ లతో కలిపి కొత్తపేట చౌరస్తాలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్లో హింసకు పాల్పడుతున్న జిహాదీ శక్తులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వారి దిష్టిబొమ్మను దహనం చేశారు. హైదరాబాద్ లో ఉన్న కేంద్ర రక్షణ రంగ సంస్థల చుట్టూ రోహింగ్యాలు అక్రమంగా వచ్చి నివాసం ఉంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వలెనే పెద్ద సంఖ్యలో అక్రమంగా వలస వచ్చి ఇక్కడ శాశ్వతంగా నివాసాలు ఏర్పరుచుకుని ఉండడం ఆందోళనకర విషయమని, కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్ధత వలనే నిఘా లేకపోవడం వలెనే అక్రమంగా వలసలు వస్తున్నారని, వారిని గుర్తించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ వలస దారులకు అడ్డుకట్ట వేయాలని పఊఖ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత హిందువులకు న్యాయం చేయాలని, అంతర్జాతీయ సమాజం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

# పూర్ణామార్కెట్లో పూజా సామాగ్రి దగ్ధంపై పరామర్శ

- **బూడిదైనా రూ. 50 లక్షల సామాగ్రి**
- **నష్టపోయిన వ్యాపారులను ఆదుకోవాలి**
- **దక్షిణ వైసీపీ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి**

**అఖండసూర్య, విశాఖపట్నం**

విశాఖ దక్షిణం పూర్ణా మార్కెట్లో అగ్నిప్రమాదంలో నష్టపోయిన వ్యాపారులను ప్రభుత్వ ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం అర్ధరాత్రి జరిగిన సంఘటనా స్థలాన్ని దక్షిణ వైఎస్ఆర్సిపి శ్రేణులతో కలిసి వాసుపల్లి సందర్శించారు. వ్యాపారులను పరామర్శించి అగ్ని ప్రమాదం గల కారణాలు నష్టపోయిన సామాగ్రి విలువ అంచనా వివరాలను సేకరించారు. ఆకస్మికంగా చెలరేగిన ఈ మంటల వల్ల 16 పూజ సామాగ్రి షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. సుమారు 50 లక్షల సరుకు బూడిదవ్వడం దురదృష్టకరమన్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపు చేశారనీ ప్రమాదం అర్ధరాత్రి జరగడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. కానీ షాపులో ఉన్న సామాగ్రి పూర్తిగా అగ్నికి బూడిద అయిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో 35 వార్డ్ ప్రెసిడెంట్ కనక రెడ్డి, జిల్లా సెక్రటరీ అభిరెడ్డి అది విష్ణు, జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భారత్, సౌత్ పబ్లిసిటీ వింగ్ ప్రెసిడెంట్ సుధా, గంగాధర్, నగేష్, బతుల రాము, ఈశ్వరరావు,ఇషు,బేవార మహేష్, తాడి రవితేజ, 36 వార్డ్ ప్రెసిడెంట్ మహమ్మద్ షకీల్,దక్షిణ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, వార్డు అధ్యక్షులు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారం

- **నిందితుడూ మైనరే**

**అఖండసూర్య, పామర్రు**

మొవ్వ (మ) పెదసనగల్లు గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగింది. ఐదు సంవత్సరాల మైనర్ బాలికని బలవంతంగా 13 సంవత్సరాలు మైనర్ బాలుడు అత్యాచారం చేసాడు. సోమవారం సాయంత్రం సమయంలో కేక్ ఇస్తాను అని చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి బలవంతంగా లైంగిక దాడి చేసాడు. మంగళవారం ఉదయం పాప నొప్పిగా ఉందని ఏడుస్తూ ఉండడంతో తల్లిదండ్రులు గమనించారు. కూచిపూడి హాస్పిటల్ కు తీసుకెళ్లి చూపించగా చికిత్స చేసిన వైద్యుడికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. సదరు సమాచారం ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# కేసీఆర్ గేర్ మార్చారా

- **పాలమూరు జిల్లా టార్గెట్..**

**అఖండ సూర్య, హైదరాబాద్ :**



రేవంత్ పేరును ప్రస్తావించకుండానే..గట్టిగానే అటాక్ చేశారు కేసీఆర్. రేవంత్ సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్కు చెందిన కృష్ణా జలాల వాటా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను సెంట్రిక్గా కేసీఆర్ ఇండైరెక్ట్గా రేవంత్ రెడ్డిపై సీరియస్ కామెంట్స్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల డీపీఆర్ను కేంద్రం వెనక్కి పంపితే నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారంటూ ఫైరయ్యారు. డీపీఆర్ను వెనక్కి పంపితే భూమి, ఆకాశాన్ని ఏకం చేసి లొల్లి చేయాల్సింది పోయి ప్రభుత్వం సైలెంట్గా ఉందని పరోక్షంగా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేశారు కేసీఆర్.పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో గ్రామగ్రామాన సభలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగట్టి తీరుతామ్. పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామ్. బహిరంగ సభలకు తాను స్వయంగా హాజరవుతానంటూ..ఇక పూర్తిస్థాయిలో రంగంలోకి దిగుతానని చెప్పకనే చెప్పారు గులాబీ బాస్. ఎంతసేపు రియల్ ఎస్టేట్ దందాలే తప్ప.. వేరే ధ్యాసే లేదని రేవంత్ రెడ్డి సర్కార్పై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎక్కడికక్కడ నిలదీస్తామని..అన్యాయాలపై ప్రశ్నిస్తామని హెచ్చరించారు.అయితే ఎక్కడా కేసీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును పలకలేదు. రేవంత్ పేరును ప్రస్తావించకుండానే ఓ రేంజ్లో విమర్శలు, ఆరోపణలు చేయడం మరోసారి సమ్థింగ్ స్పెషల్గా మారింది. ఆఖరికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేరును పలికిన కేసీఆర్, రేవంత్ రెడ్డి పేరును మాత్రం పలకకపోవడం ఆసక్తికరంగా మారింది. రేవంత్ పేరును తీయకుండానే ఆయనపై కేసీఆర్ యుద్ధం ప్రకటించారన్న చర్చ సాగుతోంది.ఇక సీఎం రేవంత్ రెడ్డి యాజ్ టీజ్గా మాజీ సీఎం కేసీఆర్ను నేరుగా టార్గెట్ చేశారు. పదేళ్ల పాలనలో తెలంగాణను 8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన కేసీఆర్ ఒక ఆర్థిక ఉగ్రవాది అంటూ మండిపడ్డారు. కలుగులో దాక్కున్న ఎలుకలా ఇన్నాళ్లూ మౌనంగా ఉండి.. ఇప్పుడు బయటకు వచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే జనవరి 2న జరిగే అసెంబ్లీ సమావేశాలకు రావాలని..తెలంగాణకు ఎవరు మేలు చేశారో అక్కడే తేల్చుకుందామంటూ సవాల్ చేశారు రేవంత్.పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా కేసీఆర్ తీరు మారలేదని.. కమిషన్ల కోసమే రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారంటూ దుమ్మెత్తిపోశారు. అయితే రేవంత్ రెడ్డి పేరు తీయకుండా కేసీఆర్ సీఎం సొంత జిల్లాలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణాజలాల అంశాలను బేస్ చేసుకుని టార్గెట్ చేస్తే, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం యథావిధిగా కేసీఆర్ను టార్గెట్ చేయడం చర్చకు దారితీస్తోంది. ఇక ఇప్పుడు కేసీఆర్ యాక్టీవ్ కాబోతుండటంతో తెలంగాణలో ఇకపై రాజకీయం రంజుగా ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది.

**టార్గెట్ సాగునీటి ప్రాజెక్టులు**

గులాబీ అధినేత కేసిఆర్ మొత్తానికి ఫామ్హౌస్ నుంచి బయటికి వచ్చారు. శనివారం రాత్రి హైదరాబాదులోని నంది నగర్ లో తన నివాసానికి వచ్చారు. చాలా రోజుల తర్వాత కెసిఆర్ బయటికి రావడంతో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో సంచలనం నెలకొంది. కెసిఆర్ ఇప్పటికిప్పుడు బయటకు రావడం వెనుక బలమైన కారణం ఉంది.2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కేసీఆర్ బయటకు కనిపించడం అత్యంత అరుదుగా మారింది. పార్లమెంటు ఎన్నికల్లో ప్రచారం తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రానికి పరిమితమైపోయారు. గులాబీ పార్టీ పాతిక సంవత్సరాల పండుగకు ఆయన వరంగల్ నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత ఓ టీవీ ఛానల్ నిర్వహించిన ఇంటర్వ్యూకు కూడా హాజరయ్యారు. ఇటీవల తన మేనల్లుడు హరీష్ రావు తండ్రి చనిపోతే కేసీఆర్ బయటికి వచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో స్టార్ క్యాంపైనర్ గా కెసిఆర్ పేరు పేర్కొన్నప్పటికీ.. ఆయన బయటికి రాలేదు. తనను కలిసే నేతలతో మాత్రమే కేసీఆర్ మాట్లాడుతున్నారు. కేటీఆర్, హరీష్ రావు తో అప్పుడప్పుడు సమావేశం అవుతున్నారు.. ఎన్నికల్లో, వివిధ సందర్భాలలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాల గురించి మాత్రమే ఆయన మాట్లాడుతున్నారు. అయితే ఇన్ని రోజుల తర్వాత కెసిఆర్ బయటికి వచ్చారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులపై ప్రధానమైన చర్చ జరుగుతుందని సమాచారం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల పోలవరం నల్లమల సాగర్ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. దీనిపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపాదించిన పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుపై కూడా చర్చ జరుగుతుందని తెలుస్తోంది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు 45 టీఎంసీల కృష్ణా నీటితో సర్దుకుపోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన తీరును గులాబీ పార్టీ తప్పుపడుతోంది. తాము అధికారంలో ఉన్నప్పుడు 90 టీఎంసీల నీటి కోసం పోరాటం చేసామని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 45 టీఎంసీలకు ఇలా ఒప్పుకుంటుందని గులాబీ పార్టీ ప్రశ్నిస్తోంది. ఈ వ్యవహారంపై ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని గులాబీ అధినేత భావించినట్టు సమాచారం. ఉద్యమ కార్యాచరణకు సంబంధించి తేదీలను మాత్రం ప్రకటించకపోవచ్చని.. ఎందుకంటే త్వరలో స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికలు జరగబోతున్నాయని.. అందువల్లే పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.. చాలాకాలం తర్వాత కెసిఆర్ బయటికి వచ్చిన నేపథ్యంలో రేవంత్ రెడ్డికి సవాళ్లు విసిరే అవకాశం లేకపోలేదని? మరి దీనిని ముఖ్యమంత్రి ఎలా స్వీకరిస్తారో చూడాల్సి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# మూడేళ్ల ముందు నుంచే టిక్కెట్ల లొల్లి

**అఖండ సూర్య, మహబూబ్ నగర్ :**





ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని షాద్నగర్ బీఆర్ఎస్లో వర్గ విభేదాలు పీక్ లెవల్కు చేరాయి. కారు పార్టీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరుతో క్యాడర్ రెండుగా చీలిపోయిందన్న టాక్ వినిపిస్తోంది. షాద్ నగర్ నియోజకవర్గంలో 2014, 2018లో రెండు సార్లు ఘన విజయం సాధించిన గులాబీ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైంది. గత రెండేళ్లుగా పార్టీ వర్గ విభేదాలతో కొట్టుమిట్టాడుతోంది. బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్కు, మహబూబ్ నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఏ మాత్రం పొసగడం లేదు. అంజయ్య యాదవ్, నవీన్ రెండు వర్గాలుగా విడిపోవడంతో ద్వితీయస్థాయి నేతలతో పాటు కార్యకర్తలు అయోమయంలో పడ్డారట. అధికార పార్టీ మీద పోరాడాల్సింది పోయి..సొంత పార్టీలో ఈ కుంపటి ఏంటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారట గులాబీ పార్టీ కార్యకర్తలుమాజీ ఎమ్మెల్యే అంజయ యాదవ్ ఈ సారి తన కుమారుడికి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో షాద్నగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ట్రై చేస్తున్నారట. నవీన్ రెడ్డి ఎమ్మెల్యే సీటుపై కన్నేయడంతో తమ సీటుకు ఎసరు వస్తుందన్న ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వర్గం అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారట. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నవీన్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ తరపున స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా గెలవడంతో ఆయనపై బీఆర్ఎస్ అధిష్టానానికి మంచి అభిప్రాయం ఉండటంతో పాటు ఆర్థికంగా రాజకీయంగా అన్ని విధాల నవీన్ కుమార్ బలంగా ఉండటంతో స్పీడు పెంచారు. ఇదే ఇప్పుడు అంజయ్య యాదవ్ వర్గంలో ఆందోళనకు కారణమవుతోందని తెలుస్తోంది.ఎమ్మెల్సీ హోదాలో ఉన్న నవీన్ రెడ్డి..హైదరాబాద్లోని పార్టీ ఆఫీస్ మొదలుకొని షాద్నగర్ వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ ప్రజల దృష్టిలో, అధిష్టానం దృష్టిలో పడే ప్రయత్నం చేస్తున్నారట. అంతేకాదు బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలకు షాద్నగర్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలను తరలించడంతో..కేటీఆర్ కూడా నవీన్ రెడ్డిని అభినందించారట. ఇది మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వర్గానికి ఏ మాత్రం రుచించడం లేదంటున్నారు. అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోదన్న టాక్ వినిపిస్తోంది.లేటెస్ట్గా జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ ఓ వైపు అంజయ్య యాదవ్, మరోవైపు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఎవరికి వారు సెపరేట్గా.. తమ వర్గానికి చెందిన అభ్యర్థులను బరిలోకి దింపి చాలా వరకు గెలిపించుకున్నారు. అయితే అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి వర్గ పోరు పార్టీకి డ్యామేజ్ చేస్తుందన్న ఆందోళన క్యాడర్ కనిపిస్తోందట. ఇంకా కొన్ని పంచాయితీల్లో గెలవాల్సి ఉన్నా అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి విభేదాలతో అధికార కాంగ్రెస్కు మేలు జరిగిందని అంటున్నారు. ఇక షాద్నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ మద్దతుదారులుగా బరిలో నిలిచి గెలిచిన సర్పంచ్లను తెలంగాణ భవన్లో సన్మానించారు కేటీఆర్.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరు కాలేదు. అంతే కాకుండా ఈ సమావేశంలో అంజయ్య యాదవ్ మళ్లీ భారీ మెజార్టీతో గెలుస్తారని కేటీఆర్ చెప్పడంతో మళ్లీ ఆయనకే టికెట్ అని చెప్పకనే చెప్పారన్న చర్చ మొదలైంది. ఇంకా ఎన్నికలకు మూడేళ్ల సమయం ఉండగానే..మాజీ ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ టికెట్ ఫైట్ ఇంట్రెస్టింగ్గా మారింది. అప్పటి వరకు పరిస్థితుల్లో మార్పు వచ్చి తనకే టికెట్ వస్తుందన్న ధీమాతో నవీన్ రెడ్డి ఉంటే..అధిష్టానం ఆశీస్సులు తనకే ఉన్నాయని అంజయ్య యాదవ్ చెప్పుకుంటున్నారట. మొత్తానికి షాద్నగర్ నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గాల మధ్య కార్యకర్తలు నలిగిపోవాల్సి వస్తుందట. మాజీ ఎమ్మెల్యే వెంట నడవాలో..ఎమ్మెల్సీ చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొనాలో తెలియక గులాబీ పార్టీ కార్యకర్తలు సతమతం అవుతున్నారని అంటున్నారు.

# 29 నుంచి అసెంబ్లీ

**అఖండ సూర్య, హైదరాబాద్ :**



అసెంబ్లీ సమావేశాలు ఈనెల 29 నుంచి మొదలు కానున్నాయి. సమావేశాల్లో కృష్ణా, గోదావరి జలాల అంశమే ప్రధాన అజెండా కావాలి. అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాన్ని ఎండగడదాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాల కారణంగా సాగు జలాల విషయంలో తెలంగాణ కోల్పోయిన హక్కులను ప్రజలకు తెలియజేద్దాం' అని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పిలుపునిచ్చారు. అవసరమైతే సభలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని అభిప్రాయపడ్డారు.పాలమూరు ` రంగారెడ్డి ఎత్తుపోతల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. హైదరాబాద్లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో సోమవారం ఆయన మంత్రులతో సమావేశమయ్యారు. ఇటీవలి సర్పం చ్ ఎన్నికలు, వచ్చే ప్రాదేశిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, పీఏసీఎస్ ఎన్నికలు, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల షెడ్యూల్తోపాటు కేంద్రం వద్ద పెండిరగ్లో ఉన్న అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.దాదాపు మూడున్నర గంటల పాటు అనేక అంశాలపై చర్చ సాగింది. తెలంగాణ అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్కడ నిర్మిస్తున్న ప్రాజెక్టులను అడ్డుకునే కార్యాచరణపై సీఎం చర్చించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్లే కృష్ణా నీటి వాటాలో అన్యాయం జరిగిందని, ఇదే విషయాన్ని సభ వేదికగా ప్రజలకు పూర్తిగా వివరించాలనే నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీ ఎన్నికలు మంచి ఫలితాలనే ఇచ్చాయని, కొన్ని పొరపాట్లు వల్ల స్థానాలు తగ్గాయని సీఎం అభిప్రాయపడినట్లు తెలిసింది. వచ్చే ప్రాదేశిక ఎన్నికల్లో ఆ పొరపాట్లకు తావు లేకుండా చూసేందుకు ఎత్తుగడలు రూపొందించేందుకు సిద్ధమయ్యారని సమాచారం. పంచాయతీ ఫలితాలపై మంత్రులకు ర్యాంకులు ఇచ్చినట్లుగా తెలిసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు జిల్లాల ఇన్చార్జ్ మంత్రులదే బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించినట్లుగా తెలిసింది. మండల పరిషత్లతో పాట్లు జడ్పీ పీఠాలను క్లీన్ స్వీప్ చేయాలని సీఎం పిలుపునిచ్చినట్లు సమాచారం.జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనం.. డివిజన్ల ఏర్పాటుపై తీసుకున్న నిర్ణయాలు, నిబంధనలు మంత్రులకు సీఎం వివరించారు. కేంద్రం వద్ద పెండిరగ్ నిధుల అంశంపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రానికి రావాల్సిన వాటిపై శాఖల వారిగా ఆయా మంత్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు.



# పూర్ణమార్కెట్ లో అగ్నిప్రమాదం

**అఖండ సూర్య, విశాఖపట్నం :**

విశాఖ పూర్ణ మార్కెట్లో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆకస్మికంగా చెలరేగిన ఈ మంటలు వలన మార్కెట్ ఉన్న ఆరు పూజ సామాగ్రి షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు మరియు అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలని అదుపు చేశారు. ప్రమాదం అర్ధరాత్రి జరగడంతో ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించారు..



# డీ లిమిటేషన్ కు లైన్ క్లియర్

**అఖండ సూర్య, హైదరాబాద్ :**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను 300 డివిజన్లను పెంచడంపై దాఖలైన 80 పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టి వేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. అభ్యంతరాలు తెలిపేందుకు ఇచ్చిన గడువు ముగిసిందని హైకోర్టు గుర్తు చేసింది. దీంతో ప్రభుత్వం గ్రేటర్ ను 300 వార్డులుగా విభజించడానికి అడ్డంకులు తొలగిపోయినట్లయింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరిస్తూ, వార్డుల సంఖ్యను 150 నుండి 300కు పెంచుతూ ప్రభుత్వం డీలిమిటేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజన అశాస్త్రీయంగా ఉందంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. పిటిషన్లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి జస్టిస్ విజయ్సేన్ రెడ్డి, తొలుత 300 వార్డుల జనాభా వివరాలు, మ్యాప్లను 24 గంటల్లో పబ్లిక్ డొమైన్లో ఉంచాలని ఆదేశించారు. అయితే, దీనిపై ప్రభుత్వం అప్పీలుకు వెళ్లడంతో డివిజన్ బెంచ్ ఈ ఉత్తర్వులను పాక్షికంగా సవరించింది. కేవలం పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసిన వార్డులు ముఖ్యంగా వార్డు నెం. 104 ` షా అలీ బండా, 134 ` లంగర్ హౌజ్ వివరాలు మాత్రమే బహిర్గతం చేయాలని స్పష్టం చేసింది. వార్డుల విభజనపై ప్రజలు తమ అభ్యంతరాలను సమర్పించడానికి హైకోర్టు అదనపు సమయం కేటాయించింది. తొలుత డిసెంబర్ 17తో ముగియాల్సిన గడువును కోర్టు డిసెంబర్ 19 వరకు పొడిగించింది. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ డీలిమిటేషన్ అనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో కోర్టుల జోక్యం పరిమితంగా ఉండాలని వాదించారు. కేంద్ర సెన్సస్ కమిషనర్ ఆదేశాల ప్రకారం డిసెంబర్ 31, 2025 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని, అందుకే వేగంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశామని, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.డీలిమిటేషన్ పై ప్రభుత్వానికి చాలా అభ్యంతరాలు వచ్చాయి. ఒకే వార్డు రెండు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోకి వస్తోందని కొందరు ఫిర్యాదు చేశారు. కొన్ని వార్డుల్లో 18 వేల జనాభా ఉంటే, మరికొన్నింటిలో 70 వేల వరకు ఉండటంపై కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హయత్ నగర్ వంటి ప్రాంతాల్లో చారిత్రక కట్టడాలు ఒక వార్డులో, ఆ ప్రాంత పేరుతో ఉన్న మరో వార్డు వేరే చోట ఉండటంపై స్థానికులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు అభ్యంతరాలను స్వీకరిస్తూనే, మరోవైపు కోర్టు కోరిన వార్డుల మ్యాప్లను వెబ్సైట్లో అందుబాటులో ఉంచారు. డిసెంబర్ 31లోగా తుది నివేదిక సిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దానికి సంబంధించి కోర్టు వద్ద అడ్డంకులు అన్నీ తొలగిపోయినట్లయింది.




# వైసీపీలో కోల్డ్ వార్

**అఖండ సూర్య, కర్నూలు :**

2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినప్పటి నుంచి వైసీపీ డిఫరెంట్ సిచ్యువేషన్స్‌ను ఫేస్ చేస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలో అంతా తామేనని.. ముందుండి నడిచిన నేతలంతా సైలెంట్ అయిపోయారు. మాజీ మంత్రులు, కీలక పదవులు చేపట్టిన నేతలు..ఓడిపోగానే సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. చాలా నియోజకవర్గాలకు ఇంచార్జ్‌లు కూడా లేని పరిస్థితి. ఇప్పుడిప్పుడే నియోజకవర్గ ఇంచార్జ్‌లను నియమించడం..ఇంచార్జ్‌లు యాక్టీవ్‌గా లేని నియోజకవర్గాల్లో మరొకరికి బాధ్యతలు అప్పగించడం వంటి డెసిషన్ తీసుకుంటున్నారు వైసీపీ అధినేత జగన్.ఈ క్రమంలో పార్టీ యాక్టివిటీ..ముందుండి నడిపించే నాయకులు లేక జిల్లాల్లో క్యాడర్ నిరాశలో ఉందన్నది వైసీపీ వర్గాల టాక్. చాలా నియోజకవర్గాల్లో వైసీపీ క్యాడర్, లీడర్లు సైలెంట్ మోడ్‌లోనే ఉన్న పరిస్థితి. కానీ కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం ఇప్పటినుంచే టికెట్ ఫైట్ నడుస్తోంది. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు నేతలు. నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతల కోసం ఓవైపు..ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించినా అదే నియోజకవర్గంలో కంటిన్యూ అయ్యేందుకు మరి కొందరు ఎవరి ప్రయత్నాల్లో వారు బిజీగా ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు నియోజకవర్గంలో వైసీపీలో వర్గ విభేదాలు పీక్‌కు చేరాయి. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాజీ ఎంపీ బుట్టా రేణుక మరోవైపు యువ నాయకుడు రాజీవ్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య కోల్డ్ వార్ రచ్చకెక్కుతుంది. ఎవరికి వారు బల ప్రదర్శనలు చేయడం, పార్టీ లైనుకు భిన్నంగా పోటాపోటీగా కార్యక్రమాలు చేయడం చర్చకు దారితీస్తోంది. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఎమ్మిగనూరు వైసీపీలో విభేదాలు హీటెక్కాయి. బుట్టా రేణుక వర్గం ఒక కార్యక్రమం చేపట్టగా, రాజీవ్ రెడ్డి వర్గం మరోలా కోటి సంతకాల సేకరణలో పాల్గొన్నాయి. పార్టీ నేతలంతా కలిసి కోటి సంతకాలు సేకరణ పూర్తి చేయాలని వైసీపీ అధినేత జగన్ భావించారు. అదే విధంగా క్షేత్రస్థాయిలోనూ చెప్పుకొచ్చారు. కానీ ఆ పరిస్థితి కనిపించలేదు. ఇతర చోట్ల పరిస్థితి ఎలా ఉన్నా.. ఎమ్మిగనూరులో మాత్రం బుట్టా రేణుక వర్సెస్ రాజీవ్ రెడ్డి వర్గపోరు మరోసారి హాట్ టాపిక్ అయింది.బలమైన రెడ్డి సామాజిక వర్గం అంతా తనవైపే ఉందని రాజీవ్ రెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేస్తుండగా జగన్ చెప్పిందే తాను చేస్తున్నానని బుట్టా రేణుక వాదిస్తున్నారు. వచ్చే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉన్నప్పటికీ విభేదాలు పెట్టుకొని పార్టీలో చీలికలు తెస్తున్నారని క్యాడర్ రగిలిపోతోందట. ఎవరి తరఫున మాట్లాడితే ఎవరికి కోపం వస్తుందో..ఏ నేతకు మద్దతు తెలిపితే ఎవరికి కోపం వస్తుందోనన్న డైలమా కార్యకర్తల్లో నెలకొందట. ఇటు బుట్టా, అటు రాజీవ్‌రెడ్డి వర్గాలు ఆర్థికంగా బలంగా ఉండడం, రెండు వర్గాలకు అంతో ఇంతో ప్రజాబలం ఉండటంతో ఎవరినీ కాదనలేని పరిస్థితిలో పార్టీ అధిష్టానం ఉందట. ఎమ్మిగనూరులో పరిణామాలను పార్టీ అధిష్టానం సీరియస్ తీసుకోకపోవడానికి ఇదే కారణమంటున్నారు. టికెట్ ఫైటే కాదు..ప్రజల్లోకి వెళ్లేప్పుడు కూడా ఎవరికి వారుగా వెళ్లడం ఎవరికి వారుగా కార్యక్రమాలు చేపట్టడం వంటివి క్యాడర్‌లో ఆందోళనకు దారితీస్తున్నాయట.2024 ఎన్నికల్లో ఎమ్మిగనూరు నుంచి బుట్టా రేణుక పోటీ చేశారు. ఆ తర్వాత వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఏడాదిన్నరగా కొనసాగుతూ వచ్చారు. అయితే బుట్టా రేణుక రాజకీయ ఎదుగుదల..మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, ఆయన వర్గీయులకు మింగుడు పడటం లేదట. ఎలాగైనా ఆమెను ఎమ్మిగనూరు నుంచి పంపించాలని పట్టుబట్టి..ఇప్పటికే బుట్టా రేణుకను ఎమ్మిగనూరు వైసీపీ ఇంచార్జ్ పదవి నుంచి తప్పించారు. ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మనుమడు రాజీవ్‌రెడ్డిని వైసీపీ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే నియోజకవర్గం ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించినా..పార్లమెంటు సమన్వయ కర్తగా బుట్టా రేణుక ఎమ్మిగనూరులో తన వర్గాన్ని కాపాడుకుంటూ వస్తున్నారట. ఇలా రెండు వర్గాలు ఎవరికి వారే బల ప్రదర్శనకు దిగుతుండటంతో క్యాడర్‌లో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయట. వర్గపోరుకు వైసీపీ అధిష్టానం ఎలా చెక్ పెడుతుందో చూడాలి.



# కేసీఆర్ ను నమ్మేదెలా?

**అఖండ సూర్య, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ మళ్లీ యాక్టివ్ కానున్నారన్నది ఆ పార్టీ నేతలకే నమ్మకం కలగడం లేదు. ఎందుకంటే పార్టీ ఆవిర్భావ సభలో వరంగల్ లో ఇక జనంలోనే ఉంటానని చెప్పిన కేసీఆర్ నిన్నటి వరకూ బయటకు రాలేదు. ఇప్పుడు మరోసారి వచ్చి ఇదిగో వస్తున్నానంటే నమ్మడానికి పార్టీ నేతలు కానీ, కార్యకర్తలు కాని మానసికంగా సిద్ధంగా లేరు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో వరంగల్ లో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో కూడా ఇలాగే ప్రకటన చేశారు. కానీ ఆవిర్భావ దినోత్సవాలు జరిగి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఫామ్ హౌస్ గడప దాటలేదు. వరంగల్ సభలో కూడా ఆవేశంగా ప్రకటించిన కేసీఆర్ తర్వాత అయితా పయితా లేరు. అదే విషయాన్ని ఇప్పుడు కార్యకర్తలు గుర్తుకు తెస్తున్నారు.దాదాపు చాలా రోజుల తర్వాత తెలంగాణ భవన్ కు వచ్చిన కేసీఆర్ పార్టీ నేతల సమావేశంలో ఆవేశంగా మాట్లాడారు. నల్లగొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ఆదేశించారు. అయితే ఈ మూడు సభలకు కేసీఆర్ హాజరవుతారా? లేదా? అన్నది ఇప్పటికీ అందరికీ అనుమానమే. కానీ తాను వస్తానని చెప్పి అన్ని ఏర్పాట్లు చేయమంటారు. కానీ వచ్చేంత వరకూ నమ్మకం లేదన్నది బీఆర్ఎస్ నేతల నుంచి వినిపిస్తున్న మాట. అయితే ఇక కేసీఆర్ బయటకు రాకపోతే అసలుకే ఎసరు తప్పదన్న భయం నేతల్లో ఇప్పటికే నెలకొని ఉంది. ఇప్పటికే అన్ని ఎన్నికల్లో ఓటమి పాలయిన బీఆర్ఎస్ ఇక కేసీఆర్ బయటకు రాకపోతే మరింత క్యాడర్ నీరుగారిపోతుందని తెలుసు.బీఆర్ఎస్ వర స ఓటములతో పాటు కుమార్తె కల్వకుంట్ల కవిత ఇప్పటికే యాత్ర పేరిట జనంలోకి వెళుతున్నారు. సామాజికయాత్ర పేరుతో తెలంగాణ లో పర్యటిస్తూ పార్టీ నేతలపైనే విమర్శలు చేయడాన్ని




కనీసం కేసీఆర్ ఖండిరచకపోవడం కూడా విమర్శలకు దారి తీస్తుంది. శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలయి రెండేళ్లు దాటుతున్నప్పటికీ పార్టీ అధినేత కేసీఆర్ కార్యకర్తలను కలిసేందుకు ఇష్టపడకపోవడం కూడా పార్టీపై ఎఫెక్ట్ పడనుందని చెబుతున్నారు. కేసీఆర్ ఫాం హౌస్ వదిలి జనంలోకి రావాలని క్యాడర్ కోరుకుంటున్నారు. కానీ కేసీఆర్ ను చూస్తుంటే ఇప్పట్లో కదిలేలా కనిపించడం లేదు. మరి కేసీఆర్ మీడియా సమావేశంలో చెప్పినట్లు బయటకు వస్తారా? రారా? అన్న చర్చ పార్టీలో జరుగుతుంది.

**పొన్నం కౌంటర్**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మీడియా సమావేశంలో కూర్చుని తోలు తీస్తామంటే ఊరుకోబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే డీపీఆర్ వెనక్కు వచ్చిందని అన్నారు. నిజంగా నీటి పారుదల శాఖపై చర్చించాలంటే అసెంబ్లీ సమావేశాలకు రావాలని కోరారు. పాలమూరు ` రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై చర్చించడానికి తాము కూడా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.ప్రజలు మీ తోలు తీసినా మీలో మార్పు రాలేదన్నారు. కేసీఆర్ పాతపురాణాన్ని వల్లె వేశారన్నారు. దద్దమ్మ పాలన చేసింది తాము కాదని,మీరేనని పొన్నం ప్రభాకర్ అన్నారు. మీ హయాంలో డీపీఆర్ వెనక్కు వచ్చినప్పుడు నిద్రపోతున్నారా? అని ప్రశ్నించారు. జగన్, మోదీతో అంటకాగినప్పుడు ఏమయిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఇప్పటికే మీ బిడ్డ కవిత నీ తోలు తీస్తుందని మండి పడ్డారు.



# వైకుంఠ ఏకాదశికి పకడ్బందీ ఏర్పాట్లు

**అఖండ సూర్య, తిరుమల :**

శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆగమోక్తంగా నిర్వహించాం . వైకుంఠ ఏకాదశి రద్దీని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘల్ అన్నారు. ఆన్లైన్ లక్కీ డిప్ ద్వారా టికెట్లు పొందిన 1.89 లక్షల మందికి మాత్రమే వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి రోజుల్లో దర్శనం వుంటుంది. టికెట్లు ఉన్న భక్తులు వారికి కేటాయించిన సమయానికే రావాలి. క్యూలైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా 2 గంటల్లోనే దర్శనం పూర్తయ్యేలా ప్రణాళిక. జనవరి 2 నుంచి 8 వరకు (మిగిలిన 7 రోజులు) సామాన్య భక్తులకు సర్వదర్శన అనుమతి వుంటుందని అన్నారు. 4వ రోజు నుంచి 10వ రోజు వరకు రోజుకు 15 వేల ఎస్ఎస్డి (స్లాట) టోకెన్లు, 1,500 శ్రీవాణి టోకెన్లు ఆన్లైన్లో విడుదల చేస్తాం. చివరి 3 రోజులు తిరుపతి స్థానికుల కోసం రోజుకు 5,000 చొప్పున ప్రత్యేక టోకెన్ల కేటాయింపు జరుగుతుంది. వైకుంఠ ద్వారా దర్శనం కోసం అధిక రద్దీ ఉంటుంది. చంటిపిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు తిరుమల యాత్ర వాయిదా వేసుకోవాలి. జనవరి 8 తర్వాతే రావాలని టీటీడీ సూచన. భక్తుల భద్రత కోసం 3,500 మంది పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది మరియు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ వుంటుంది. క్యూలైన్లలోని భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేసామని అన్నారు. .

# పావు వంతు లెక్చరర్లతో చదువు సాగేదెలా?

**అఖండ సూర్య, హైదరాబాద్ :**

రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల పరిస్థితి దారుణంగా తయారైంది. సరిపడ బోధనా సిబ్బంది లేక సర్కారు కాలేజీల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఉన్నత విద్యను ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖాళీ అవుతున్న పోస్టులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేయకపోవడంతో డిగ్రీ కాలేజీల్లో బోధించే అధ్యాపకుల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతోంది.రెగ్యులర్ అధ్యాపకులను నియమించకుండా వారి స్థానంలో గెస్ట్, కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించుకొని నెట్టుకొస్తున్నారు. కాలేజీల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో తమ పిల్లలను ఆ కాలేజీల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు పెద్దగా సుముఖత చూపించడంలేదు. డిగ్రీ కాలేజీల్లోని కీలక పోస్టులైన ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 149 డిగ్రీ కాలేజీలుంటే, వీటిలో 4,520 పోస్టులకు పనిచేస్తున్నది మాత్రం కేవలం 1,695 మందే. 2,825 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇందులోనూ 2,570 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం. ఈ 2,570 పోస్టుల్లో 50 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, మరో 50 శాతం జూనియర్ లెక్చరర్లను ప్రమోషన్ల ద్వారా భర్తీచేస్తారు. అంతేకాకుండా 145 ప్రిన్సిపాల్ పోస్టులకు గానూ ప్రస్తుతం పని చేస్తున్నది కేవలం 84 మందే.మిగతా పోస్టులు ఖాళీనే. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు 133 ఉంటే కేవలం 23 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 110 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థులను ఆటలు ఆడిరచే పరిస్థితే లేదు. లైబ్రేరియన్ పోస్టులు 133 ఉంటే, ఏకంగా 90 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పనిచేస్తున్నది 43 మంది మాత్రమే. ఇలా ప్రధాన పోస్టుల్లో సిబ్బంది లేక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు కునారిల్లుతున్నాయి. ఉన్నవారినే ఇన్‌చార్జిలుగా పెట్టి కళాశాలలను నెట్టుకొస్తున్న పరిస్థితి ఉంది. సరిపడ అధ్యాపకులు కాలేజీల్లో లేకపోవడంతో అడ్మిషన్లు తీసుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఇష్టపడంలేదు. పేరున్న మంచి కాలేజీల్లో సీట్లు నిండుతున్నా మిగతా కాలేజీల్లో అయితే నిండడం కష్టంగానే మారింది. ఈ ఏడాది కాలేజీల్లో సీట్లు అంతంత మాత్రంగానే నిండాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో దాదాపు 90 వేల సీట్లుంటే 51 వేల అడ్మిషన్లు మాత్రమే నిండాయి.సిబ్బంది కొరత, సరైన వసతుల్లేకపోవడంతో ఇంటర్ తర్వాత చాలా



మంది విద్యార్థులు ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లోనే చేరుతున్నారు. ప్రైవేట్ కాలేజీల్లో దాదాపు 1.22 లక్షల మంది చదువుతున్నారు. ప్రైవేట్ వైపు విద్యార్థులు మళ్లకుండా ఉండాలంటే ప్రభుత్వం అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతోపాటు కాలేజీల్లో ల్యాబ్‌లు, ఇతర వసతులను కల్పించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ వాసులకు గుడ్‌న్యూస్

**అఖండ సూర్య, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగర ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించే దశగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిల్ కార్పొరేషన్ ఒక సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. గత కొంత కాలంగా పెండిరగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ బంపర ఆఫర్ ప్రకటించింది. నగరంలోని ప్రైవేటు, ప్రభుత్వం ఆస్తులకు సంబంధించి పేరుకుపోయిన పన్ను బకాయిలపై భారీ మినహాయింపులను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 90 శాతం వడ్డీ మినహాయింపు: ఒకేసారి చెల్లింపుతో విముక్తి ఈ పథకం ప్రకారం ఆస్తి పన్ను బకాయి ఉన్న వినియోగదారులు తమ పెండిరగ్ బకాయిలపై ఉన్న వడ్డీలో ఏకంగా 90 శాతం మినహాయింపును పొందవచ్చు. అంటే వినియోగదారులు తాము చెల్లించాల్సిన అసలు పన్నుతోపాటు కేవలం పది శాతం వడ్డీని మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఈ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానం ద్వారా వేల సంఖ్యలో ఉన్న పన్ను చెల్లింపుదారులకు గొప్ప ఉపశమనం లభించనుంది.




మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని రాల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు ఈ రాయితీ వర్తిస్తుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. విస్తరించిన నగరానికి వర్తింపు: ఇటీవల గ్రేట్ హైదరాబాద్ పరిధిని ప్రభుత్వం భారీగా విస్తరించిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న 20 పురపాలక సంఘాలు, ఏడు నగరపాలక సంస్థలన జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఈ విలీన ప్రక్రియతో బృహత్ నగరంగా అవతరించిన హైదరాబాద్‌లో కొత్త ప్రాంతాలను కూడా ఈ ప్రాపర్టీ ట్యాక్స్ ఆఫర్ వర్తించనుంది. దీని వల్ల అటు ప్రజలకు వడ్డీ భారం తగ్గడమే కాకుండా ఇటు జీహెచ్ఎంసీకి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా నగర వాసులు తమ ఆస్తి పన్ను రికార్డులను క్లియర్ చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అప్పుల భారం లేకుండా నవ నగర నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు.

# పల్నాడులో మళ్లీ రక్తపాతం

- **వేట కొడవళ్లతో నరికి ఇద్దరు అన్నదమ్ముల హత్య**
- **మృతులు టీడీపీ సానుభూతిపరులు హనుమంతరావు, శ్రీరామమూర్తి**

**అఖండ సూర్య, పల్నాడు :**

పల్నాడు జిల్లాలో మరోసారి నెత్తురు పారింది. దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో ఇద్దరు అన్నదమ్ములు దారుణ హత్యకు గురవడం తీవ్ర కలకలం రేపింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు వేట కొడవళ్లతో వారిని కిరాతకంగా నరికి చంపారు. మృతులను టీడీపీ కార్యకర్తలైన కొత్త హనుమంతరావు, కొత్త శ్రీరామమూర్తిగా పోలీసులు గుర్తించారు. ఈ జంట హత్యలతో గ్రామంలో భయాందోళన నెలకొంది.అడిగొప్పల గ్రామానికి చెందిన హనుమంతరావు, శ్రీరామమూర్తి సోదరులు. గత రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వీరిపై ప్రణాళిక ప్రకారం దాడికి పాల్పడ్డారు. గ్రామ శివారులోని ఓ బండరాయి వద్ద హనుమంతరావు మృతదేహం లభించగా, నీలంపేట అమ్మవారి గుడి దగ్గర ఉన్న వాటర్ ప్లాంట్ సమీపంలో శ్రీరామమూర్తిని హతమార్చారు. ఇద్దరినీ అత్యంత పాశవికంగా వేట కొడవళ్లతో నరకడంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి, వివరాలు సేకరించారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటనతో అప్రమత్తమైన ఉన్నతాధికారులు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దించారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. కొన్ని రోజుల క్రితం సమీపంలోని గుండ్లపాడు గ్రామంలో ఇలాగే జంట హత్యలు జరిగాయి. దాని నుంచి తేరుకోకముందే ఇప్పుడు జరిగిన ఈ ఘటనతో పల్నాడు వాసులు భయాందోళనకు గురవుతున్నారు.



# డుమ్మా టీచర్లకు రేవంత్ షాక్

- **50 మంది తొలగింపు**

**అఖండ సూర్య, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నానాటికీ దిగజారుతుంది. ఇప్పటికే ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ బడులు తెలంగాణలోనే అధికంగా ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. మరోవైపు సర్కార్ బడుల్లో విధులు నిర్వహించే కొందరు టీచర్లు వేళాపాళా లేకుండా ఇష్టారీతిన సెలవులు పెట్టడంపై రేవంత్ సర్కార్ కీలక చర్యలకు ఉపక్రమించింది. ఇకపై టీచర్లు చెప్పా పెట్టకుండా విధులకు నెల రోజులపాటు వరుసగా గైర్హాజరైతే వారి ఉద్యోగం శాశ్వతంగా తొలగించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ప్రకటన జారీ చేశారు. సర్కార్ బడుల్లోని ఎఫ్ఆర్ఎస్, మధ్యాహ్న భోజనం అమలు వంటి విషయాలపై డీఈఓలతో తాజాగా ఆన్‌లైన్‌లో సమీక్షించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఏయే స్కూళ్లలో ఉపాధ్యాయుల హాజరు ఎంత శాతం ఉందో తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఈ వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నందున వాటిపై డీఈవోలు తరచూ సమీక్షించాలని విద్యాశాఖ ఆదేశించింది. ఉపాధ్యాయులు నెలరోజులపాటు ఎలాంటి అనుమతి లేకుండా విధులకు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసు జారీ చేయాలని, విచారణలో రుజువైతే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు గెజిట్‌లో ప్రచురించాలని డీఈఓలకు సూచించారు. ఒక రోజు అనధికారికంగా స్కూల్‌కి రాకున్నా ఇదే విధంగా చర్యలు తీసుకోవచ్చు. అయితే అకస్మాత్తు అనారోగ్యం, రోడ్డు ప్రమాదం వంటి సాకులతో కోర్టుల్లో కేసులు వేసే అవకాశం ఉన్నందున నెల రోజులు అనధికారిక సెలవు పెడితే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తెలిపారుకాగా గత ఆగస్టు నుంచి ఎఫ్ఆర్ఎస్ అమల్లోకి రావడంతో టీచర్లు వచ్చిన, వెళ్లిన సమయం నమోదవుతోంది. అయితే టీచర్స్ టైమింగ్స్‌పై అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. కేవలం విధులకు హాజరయ్యారా? లేదా? అన్నదే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇకపై టీచర్ల ఆలస్యంపై కూడా దృష్టి సారిస్తామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు యేటా కొందరు టీచర్లు దీర్ఘకాలిక సెలవులపై వెళ్తుంటారు. 6 నెలలని అనుమతి తీసుకొని రెండేళ్లైనా విధులకు రావడం లేదు. అలాంటి వారిని గత రెండేళ్లలో సుమారు 50 మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు విద్యాశాఖ తెలిపింది. కనీసం సెలవులను పొడిగించుకుంటామని కూడా సమాచారం ఇవ్వడం లేదని, ఇలా దీర్ఘకాలికంగా విధులకు హాజరు కానివారిని కూడా తొలగించాలని సూచించారు. కాగా ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 24 వేల పాఠశాలల్లో సుమారు 1.15 లక్షల మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు





# నడకతో ఆరోగ్యం.. నడకతో ఆయుష్షు..

**వాకింగ్ అత్యుత్తమైన ఆరోగ్య అలవాటు. పైసా ఖర్చు లేకుండా మన శరీరాన్ని బాగు చేసుకొనే ప్రక్రియ. క్రమం తప్పకుండా నడిస్తే రోగాలు దరి చేరవని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వాకింగ్ వల్ల లాభాలేంటి? అసలు వాకింగ్ ఏ సమయంలో చేయాలి? ఎలా చేయాలి? అన్న విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం. నడక వల్ల కలిగే ప్రయోజనాలు చాలా ఎక్కువ.**

**డిప్రెషన్ దూరమవుతుంది..!**

నడక వల్ల డిప్రెషన్ దూరమవుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నడక వల్ల గుండె సంబంధిత వ్యాధులు కూడా తగ్గే ముప్పు తగ్గుందంటున్నారు. వేగంగా నడవడం వల్ల గుండెకు, శ్వాస వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుంది. ఆంగ్జయిటీ లేదా డిప్రెషన్‌తో బాధపడేవారికి నడక మరింత మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. నడవడం వల్ల శరీరంలోని ఎముకలు పటిష్టంగా మారతాయి. ఎముకలు పెళుసుగా మారడాన్ని నడకతో నివారించవచ్చు. రోజూ నడిస్తే శరీరంలోని కండరాలు బలంగా మారతాయి. నడక శరీరాన్ని సమతుల్యంగా ఉంచుతుంది. శరీరానికి సరైన ఆకృతిని అందిస్తుంది. కండరాలను ఆరోగ్యంగా మార్చుతుంది. బరువు తగ్గించుకోవడానికి నడక ఒక మంచి మార్గం. నడక వల్ల శక్తి ఖర్చు అవుతుంది. ఫలితంగా బరువు తగ్గవచ్చు. నడక వల్ల శరీరంలో చక్కెర స్థాయిలో అదుపులో ఉంటాయని అనేక అధ్యయనాల్లో తేలింది. నడక వల్ల కొవ్వు పేరుకోదు. గుండె జబ్బులు, డయాబెటిస్, కాలేయ వ్యాధులకు కొవ్వు పేరుకుపోవడమే కారణం. ఇన్సులిన్‌కు శరీరం స్పందించే తీరును కూడా నడక మెరుగుపరుస్తుంది.

**ఆయుష్షు ను పెంచుతుంది**

నడక, ఆయుష్షును పెంచుతుంది. నడక వల్ల 1620 సంవత్సరాలు అదనంగా జీవించవచ్చు. ఎంత ఎక్కువగా నడిస్తే, మరణాన్ని అంత దూరంగా తరిమేయవచ్చు. నడక కేవలం శరీర దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. డిప్రెషన్ విషయంలో నడక అనేది ఒక యాంటీ డిప్రెసెంట్‌గా పని చేస్తుంది. రోజూ వాకింగ్ చేయడం వల్ల క్రమశిక్షణ అలవడుతుంది. మానసిక స్థితి కూడా బాగుంటుంది. బహిరంగ ప్రదేశాల్లో నడవడం వల్ల శరీరంలో విటమిన్ 'డి' స్థాయిలు పెరుగుతాయి. శరీరానికి సూర్యరశ్మి తగలడం వల్ల శరీరంలో విటమిన్ డి ఉత్పత్తి అవుతుంది.

**ఎలా నడవాలి?**

తొలుత నెమ్మదిగా నడకను మొదలుపెట్టి క్రమ క్రమంగా వేగాన్ని పెంచాలి. గంటకు 6.4 కి.మీ వేగంతో రోజూ 30 నిమిషాల పాటు నడవడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఏదైనా వాకింగ్ గ్రూపులో చేరితే రోజూ నడవాలనే ఉత్సాహం కూడా వస్తుంది. ఒక్కసారి మీరు నడవాలని నిర్ణయించుకున్న తర్వాత అది మీ జీవితంలో భాగంగా మారుతుంది. ఇటీవలి కొన్ని పరిశోధనల ప్రకారం, మహిళలైతే ఉదయం 8 గంటల నుంచి 11 గంటల మధ్య నడిస్తే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అన్నింటికంటే రోజంతా చురుగ్గా ఉండటానికి నడక మంచి మార్గం. నడక ఉత్సాహంగా ఉంచుతుంది

**ఏ వయసు వారు ప్రారంభించాలి..!**

వాకింగ్ ను ఎవరైనా.. ఎప్పుడైనా మొదలుపెట్టొచ్చు. 45 ఏళ్ల లోపు వారికి ఎలాంటి పరీక్షలు అవసరం లేదు. 45 ఏళ్లు దాటినవారు..నడిస్తే ఆయాసం, గుండెనొప్పి, అధిక రక్తపోటు వంటి సమస్యలున్న వారు ముందుగా డాక్టర్‌ను కన్సల్ట్ అయ్యి నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నవయసు నుంచే డయాబెటిక్ టైప్1 ఉన్న వారు డాక్టర్ సూచన మేరకే వాకింగ్, వర్కవుట్స్ చేయాలి. ఎందుకంటే వీళ్లు ఇన్సులిన్ తీసుకుంటుంటారు కాబట్టి రక్తంలో గ్లూకోజు బాగా పడిపోయే అవకాశముంది.డయాబెటిక్ టైప్2 ఉన్న వారు అందరిలాగే వాకింగ్ చేయొచ్చు. ముందుజాగ్రత్తగా గ్లూకోజు బిస్కట్లు పెట్టుకోవటం మంచిది. గ్లూకోజు పడిపోయినట్లనిపిస్తే వెంటనే తినటానికి ఉపయోగపడతాయి.

**ఈ పరిస్థితుల్లో నడవొద్దు..!**

ఫుల్లుగా తిని వాకింగ్ చేయడం మంచిది కాదు. రెండు మూడ్రోజులు బ్రేక్ ఇచ్చి నడవడం కంటే డైలీ వాకింగ్ చేస్తేనే ప్రయోజనం. వాకింగ్ ఆపేసిన మళ్లీ ప్రారంభించాలంటే నెమ్మదిగా స్టార్ట్ చేయాలి. డైలీ అరగంట వాకింగ్ కు టైమ్ కేటాయించాలి తక్కువ దూరంతో వాకింగ్ స్టార్ట్ చేసి రోజురోజుకు పెంచుకుంటూ వెళ్లాలి.



# చన్నీటి స్నానం మంచిదేనా?

చన్నీటితో స్నానం చేయాలా? వేడి నీటితో స్నానం చేయాలా? గోరువెచ్చటి నీటితో స్నానం చేస్తే బెటరా? చాలా మందిని ఈ సమస్యలు వేదిస్తుంటాయి. చలికాలం ఎలాగూ తప్పదు కాబట్టి చాలా మంది హాట్ వాటర్ తోనే స్నానం చేస్తారు. అయితే కొంతమంది కాలాలకు అతీతంగా ప్రతి సీజన్ లోనూ వేడినీటితోనే స్నాం చేస్తారు. అసలు నీటితో స్నానం మంచిది.. నిపుణులు ఏం చెప్తున్నారు? ఈ కథనంలో తెలుసుకుందాం..

చల్లటి నీటితో స్నానం చేయడమే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతుంటారు. చర్మ సంబంధిత సమస్యలు మొదలు ఎన్నో ఇతర సమస్యలకు చెక్ పెట్టొచ్చని అంటుంటారు. ఇక చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని కూడా చాలా మంది భావిస్తుంటారు. చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల శరీరం వెంటనే రిఫ్రెష్ అవుతుంది. శరీరానికి ఇన్‌స్టంట్ ఎనర్జీ వస్తుంది. చల్లటి నీటితో స్నానం చేసిన వెంటనే ఉల్లాసంగా ఉంటారు. అలాగే చల్లని నీరు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది మీ చర్మాన్ని మెరిసేలా, ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగవుతుందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఎంత టెన్షన్, ఒత్తిడి ఉన్నా బలదూర్ అవుతుందని చెబుతున్నారు. అయితే రోగ నిరోధక శక్తి బలపడుతుందా అంటే మాత్రం. కచ్చితంగా అవుననే సమాధానం చెప్పలేమని నిపుణులు అంటున్నారు. రోగనిరోధక శక్తిని బలోపేతం కావాలంటే చల్లటి నీటితో స్నానం చేస్తే సరిపోదని. తీసుకునే ఆహారంలో కూడా ఎన్నో జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. ముఖ్యంగా విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు.



# జపనీస్ మచా ఫ్లేవర్ టీతో ఎన్నో ఆరోగ్యప్రయోజనాలు

మనదేశంలో టీ ఫ్యాన్స్ కు కొదవ లేదు. చాలా మందికి పొద్దునే ఓ కప్పు టీతాగితే డే స్టార్ట్ కాదు. ఇక ప్రస్తుతం మార్కెట్ లో రకరకాల టీ ఫ్లేవర్లు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే లేటెస్ట్ గా జపనీస్ మచా ఫ్లేవర్ టీ ట్రెండ్ అవుతోంది. అసలు ఈ టీ ప్రయోజనం ఏమిటి? దీంతో లాభాలు ఏంటి? ఈ టీని ఎలా తయారుచేస్తారు? ఈ కథనంలో తెలుసుకుందాం..!

**మాచా ఫ్లేవర్ టీ ..**

భారత్ లో టీ ఎంత ప్రాచుర్యం పొందిందో జపాన్ లో మచా ఫ్లేవర్ టీ కూడా అంతే ప్రాధాన్యత కలిగి ఉంది. రుచి మాత్రమే కాదు ఆరోగ్యానికి సంబంధించిన ఎన్నో పోషకాలు ఇందులో ఉన్నాయి. జపాన్‌కు చెందిన ప్రసిద్ధ గ్రీన్ టీ 'మచ్చా', దీనిని జపనీస్ మచా అని కూడా పిలుస్తారు. ఈ టీ ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందుతోంది. 'మచా' గ్రీన్ టీ ఆకులను గ్రైండ్ చేసి పొడి తయారు చేస్తారు. ఈ టీలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, ఎనర్జీ, డిటాక్సిఫికేషన్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ టీ తో కలిగే లాభాల కోసం ఇంకా అనేక ప్రయోగాలు కొనసాగుతున్నాయి.






# చుండ్రుకు చెక్ పెట్టండిలా..!

చుండ్రు ఈ సమస్య అందరినీ వేదిస్తోంది. అసలు చుండ్రును ఎలా పోగొట్టుకోవాలా.. ప్రస్తుత జీవనశైలి, ఆరోగ్య సమస్యలతో చాలా మందికి చుండ్రు సమస్యగా మారింది. ఇక నీటి కాలుష్యం, వాయు కాలుష్యం, కెమికల్స్‌తో కూడిన షాంపూలు వాడడం కూడా ఓ కారణమని చెబుతున్నారు. చుండ్రును తగ్గించుకోవడానికి మార్కెట్లో లభించే రకరకాల షాంపూలను, నూనెలను ఉపయోగిస్తుంటారు. అయితే ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఉపశమనం లభించకపోతే బిర్యానీ ఆకులతో నేచురల్ చిట్కా పాటిస్తే.. చుండ్రు ఇట్టే పరార్ అవుతుంది. బిర్యానీ ఆకులోని ఔషధ గుణాలు చుండ్రును తరిమేస్తాయని నిపుణులు చెబుతున్నారు. బిర్యానీ ఆకుల ద్వారా కేవలం చుండ్రు మాత్రమే కాకుండా.. తలపై ఉండే వాపు, దురద, దద్దుర్లు, పొడి బారడం వంటి సమస్యలను దూరం అవుతాయి. ఇంతకీ బిర్యానీ ఆకులతో హెయిర్ ప్యాక్‌ను ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఇలా చేయండి..!**

బిర్యానీ ఆకులను తీసుకొని, కొన్ని నీళ్లు పొసుకొని బాగా మరిగించాలి. ఆకులు పూర్తిగా మరిగిన తర్వాత, చల్లార్చి బిర్యానీ ఆకులను మిక్సీ పట్టుకోవాలి. అలాగే అందులో.. కాస్త వేప ఆయిల్ లేదా అలోవెరా జెల్, ఉసిరి పొడి లాంటివి యాడ్ చేసి మిక్స్ చేయాలి. అనంతరం ఈ మిశ్రమాన్ని తలకు బాగా పట్టించాలి. ఇలా ఓ ఐదు నిమిషాలు మసాజ్ చేసిన తర్వాత పావుగంట పాటు ఆరబెట్టాలి. ఆ తర్వాత షాంపూతో తలను శుభ్రం చేసుకుంటే సరిపోతుంది. ఇలా వారంలో రెండు సార్లు చేస్తే మార్పు ఇట్టే కనిపిస్తుంది.





# వన్ స్టాప్ సొల్యూషన్ యాప్

**అఖండ సూర్య, నెల్లూరు :**
ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పురమిత్ర పేరుతో కూటమి ప్రభుత్వం ఓ యాప్‌ను గతంలో అందుబాటులోకి తెచ్చింది. తాజాగా ఈ యాప్‌లో పలు మార్పులు చేశారు. ఇక నుంచి ప్రజలు సమస్యలు మరింత త్వరగా పరిష్కారం కానున్నాయి.ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ఏపీ ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను గతంలో తీసుకొచ్చింది. ఈ యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకుని ప్రజలు ఫొటోలతో సహా తమ సమస్యను అప్‌లోడ్ చేయవచ్చు. ప్రభుత్వ వీలైనంత త్వరగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని స్థానిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు.అధికారులు సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నారు. అయితే తాజాగా ఈ యాప్‌కి సంబంధించి ఏపీ ప్రభుత్వం పలు కీలక మార్పులు చేసింది. ఒక ప్రాంతంలో ఒకే అంశంపై ఐదుకిపైగా ఫిర్యాదులు వస్తే మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌లో ఆరెంజ్ కలర్ హాట్‌స్పాట్లుగా కనిపిస్తాయి. వీటిని పరిష్కరించడానికి అధికారులు తమ క్షేత్రస్థాయి పర్యటనల్లో హై ప్రయారిటీ ఇవ్వాల్సి ఉంటుంది.ఒక సమస్యపై ఏదైనా ప్రాంతంలో ఐదుకిపైగా ఫిర్యాదులు వస్తే అవి కమిషనర్ల దృష్టికి ఆటోమేటిక్‌గా వెళ్తాయి. కమిషనర్ల లాగిన్స్‌లో అవి హాట్‌స్పాట్లుగా కనిపించడం వల్ల వెంటనే చర్యలు తీసుకోవడానికి వీలుంటుంది. నగరపాలక, మున్సిపల్, నగర పంచాయితీల కమిషనర్ల లాగిన్స్‌లో ఈ కొత్త మార్పు కనిపించనుంది.ఇలా ఒకే సమస్యపై ఐదు మందికిపైగా ఫిర్యాదు చేసినప్పుడు అది హాట్‌స్పాట్‌గా యాప్‌లో కనిపించడం వల్ల అక్కడ సమస్య తీవ్రంగా ఉందని అధికారులకు అర్థమవుతుంది. దీని వల్ల అధికారులు వెంటనే అప్రమత్తమై ప్రత్యేక దృష్టి పెట్టవచ్చు. దీని వల్ల ప్రజల సమస్యకు కూడా వెంటనే పరిష్కారం లభిస్తుంది.అంతేకాకుండా అధికారులందరూ కలిసి సమస్యను పరిష్కరించడానికి ఇది ఉపయోగపడుతుంది. అలాగే అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ సమస్యను పరిష్కరించాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించినట్లు యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. స్ట్రీట్ లైట్స్, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య, కుక్కలు, దోమల బెడద వంటి సమస్యలను కమిషనర్ల స్థాయిలోనే పరిష్కరించాలి.

# టీడీపీ నేతల్లో ఆనందం లేదెందుకంటే



**అఖండ సూర్య, విజయవాడ :**
తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ ఎన్నికల హీట్ మొదలయింది. వచ్చే ఏడాది నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. అందులో వైసీపీకి చెందిన మూడు, టీడీపీకి చెందిన ఒక స్థానం ఖాళీ అవుతుంది. టీడీపీకి చెందిన సానా సతీష్‌తో పాటు వైసీపికి చెందిన పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డితో పాటు పరిమళ్ నత్వానీ పదవీ కాలం పూర్తి కావస్తుంది. అయితే ఇదే ఇప్పుడు టీడీపీ అధిష్టానినకి తలనొప్పిగా మారింది. టీడీపీకి చెందిన సానా సతీష్ కు మరోసారి రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. ఆయన పూర్తి కాలం పదవిలో లేకపోవడంతో మరొక అవకాశం ఇవ్వాలని ఇప్పటికే నాయకత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఆ ఒక్కటీ మాత్రం సానా సతీష్‌కు తిరిగి దక్కనుంది.ఖాళీ అవుతున్న నాలుగు స్థానాల్లో ఖచ్చితంగా కూటమి గెలుచుకుంటుంది. అందుకే ఈ సారి ఈ పదవులకు పోటీ ఎక్కువగా ఉందని సమాచారం. ఇక మిగిలేది మూడు మాత్రమే. ఈ మూడిరటిలో టీడీపీకి దక్కేది ఒక్కటేనని తెలుస్తోంది. ఎందుకంటే పరిమళ్ నత్వానీ స్థానంలో బీజేపీ నేత ఒకరిని పోటీకి దింపేందుకు ఇప్పటికే ఒప్పందం కుదిరినట్లు సమాచారం. రాష్ట్రంలో బీజేపీ నేతకు ఈ అవకాశం ఇస్తారా? లేక జాతీయ స్థాయిలో మరొకరికి ఇస్తారా? అన్నది మత్రం తేలకపోయినా మూడిరటిలో ఒక్కటి మాత్రం కమలం ఖాతాలో పడుతుంది. చంద్రబాబు నాయుడు కూడా ఇటీవల ఢల్లీపర్యటనలో వచ్చే ఏడాది ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానంలో మిత్రపక్షమైన బీజేపీకి ఇస్తామని చెప్పి వచ్చినట్లు కూడా హస్తిన నుంచి వినిపిస్తున్న టాక్. ఇక మరొకటి జనసేనకు ఖచ్చితంగా ఈ సారి రాజ్యసభ అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. జనసేనకు ఇప్పటి వరకూ రాజ్యసభలో అవకాశం కలగలేదు. అయితే ఖాళీ అవుతున్న నాలుగు స్థానాల్లో ఒకటి ఇస్తామని చంద్రబాబు పవన్ కల్యాణ్ కు ఎప్పుడో మాట ఇచ్చినట్లు అంటున్నారు. జనసేన నుంచి అభ్యర్థి ముందుగానే ఖరారయినట్లు తెలుస్తోంది. లింగమనేని రమేష్ ను జనసేన నుంచి పోటీ చేయించి రాజ్యసభకు పంపాలని నిర్ణయించారు. చంద్రబాబు కూడా ఇందుకు అంగీకరించడంతో అది జనసేన ఖాతాలో పడినట్లే మిగిలిన ఒక్క సీటు కోసం పార్టీలో తీవ్రమైన పోటీ ఉంది. అనేక మంది ఆశావహులున్నారు. అయితే చంద్రబాబు చివరికి ఎవరి పేరును నిర్ణయిస్తారన్నది మాత్రం ఉత్కంఠ రేపుతుంది.

# ఏపీలో కమలం సరికొత్త స్ట్రాటజీస్!


**అఖండ సూర్య, విశాఖపట్టణం :**
కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు..దేశం మొత్తం బీజేపీ పాలిత రాష్ట్రాలుగా ఉండాలనేది కమలనాథుల కల. ఈ ఎజెండాతోనే 2014లో మోదీ పీఎ అయినప్పటి నుంచి..అయితే సొంతంగా..లేకపోతే కూటమి పక్షాలతో కలిపి ఒక్కో రాష్ట్రంలో జెండా పాతుతూ వస్తోంది బీజేపీ. అయితే ఏపీకి వచ్చేసరికి బీజేపీ డిఫరెంట్ సినారియోను ఫేస్ చేస్తోంది.కూటమిలో భాగంగా ఉంది. కేంద్రంలో జనసేన, టీడీపీ మద్దతు కీలకమైంది. అయినా నవ్యాంధ్రలో సొంతంగా బలపడాలనే ఆకాంక్షను మాత్రం వదిలిపెట్టడం లేదు కమలం పార్టీ లీడర్లు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్లుగా అధికారం ఉండగానే పార్టీని బలోపేతం చేసుకునే ప్లాన్‌లో ఉన్నారట. జాతీయ నాయకత్వం డైరెక్షన్స్ ప్రకారం అడుగులు ముందుకు వేస్తున్నారు ఏపీ బీజేపీ నేతలుగత ఎన్నికల్లో ఏపీలో బీజేపీ ఎనిమిది ఎమ్మెల్యే, మూడు ఎంపీ స్థానాలను గెలుచుకుంది. ఇక ఒక ఎమ్మెల్సీ పదవితో పాటు కొన్ని నామినేటెడ్ పోస్టులను ఆ పార్టీకి కూటమి పొత్తులో దక్కాయి. అలాగే రెండు రాజ్యసభ సీట్లు సొంతం చేసుకుంది. అయితే బీజేపీకి దక్కిన సీట్లు, నామినేటెడ్ పదవులు..పొత్తు వల్లనే అన్నది కమలనాథులతో పాటు ప్రజలందరికీ తెలిసిన ఓపెన్ సీక్రెట్.బీజేపీ 2014లో టీడీపీతో కలిసి 4 ఎంపీ, 4 ఎమ్మెల్యే సీట్లను గెలుచుకుంది. 2019లో సింగిల్‌గా పోటీ చేసే సరికి ఓటు షేర్ ఒక్క శాతం కంటే పెద్దగా రాలేదు. 2024లో మళ్లీ పొత్తుతో కమలం మరోసారి సత్తా చాటింది. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్నా..ఏపీలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయినా..ఏపీలో బీజేపీకి పట్టున్న ప్రాంతం ఏదంటే టక్కున సమాధానం చెప్పలేని పరిస్థితి. అర్బన్ ఏరియాల్లో బీజేపీ పట్ల జనం సానుభూతితో ఉండటం కామనే. కానీ రూరల్ ఏరియాలో మాత్రం అంతంత మాత్రమే. అయితే పట్టణ ప్రాంతాల్లో బీజేపీ బలాన్ని మరింత పెంచుకునేందుకు సరికొత్త వ్యూహాన్ని తెరమీదకు తెచ్చారు కమలనాథులు.బీజేపీ సీనియర్ నేత దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయ్ శత జయంతి వేడుకలను పెద్దఎత్తున నిర్వహించి.. విద్యావంతులను, పట్టణ ప్రాంత వాసులను తమవైపు తిప్పుకోవాలని చూస్తోందట. దీంతో వాజ్ పేయ్ శత జయంతి పేరిట యాత్ర అనంతపురం నుంచి ప్రారంభమైంది. శ్రీకాకుళం నుంచి విజయనగరం, విశాఖ దాకా సాగనుంది. గోదావరి జిల్లాలు, కృష్ణా గుంటూరులో కూడా ఈ యాత్ర నిర్వహించి 25న అమరావతిలో భారీ బహిరంగ సభతో ముగిస్తారట.వాజ్ పేయ్ పాలన, పనిలో పనిగా మోదీ అడ్మినిస్ట్రేషన్‌ను వివరిస్తూ జనం మద్దతు కూడగట్టే వ్యూహరచన చేస్తోందట బీజేపీ. దీనికి కేంద్రమంత్రులను బీజేపీకి చెందిన ఇతర రాష్ట్రాల సీఎంలను తీసుకొస్తున్నారు. అలాగే బీజేపీ నేషనల్ లీడర్లను కూడా ఏపీకి రప్పిస్తూ ఇప్పుడు మోదీ నాయకత్వంలో, అంతకు ముందు వాజ్ పేయ్ పాలనలో దేశానికి జరిగిన అభివృద్ధి ఏంటి.? తీసుకొచ్చిన సంస్కరణలేంటి.? అన్న దానిపై వివరించే ప్రయత్నం చేస్తున్నారుత్వరలో ఏపీలో జరగబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బీజేపీ




తనదైన పావులు కదుపుతూ..కార్యాచరణను రూపొందిస్తోందట. ఎక్కువ సీట్లను తాము తీసుకోవడం ద్వారా గ్రౌండ్ లెవల్‌లో బలపడితే అది 2029 ఎన్నికలకు ప్లస్ పాయింట్ అవుతుందని లెక్కలు వేసుకుంటుంది. అప్పుడు కనీసం 20 సీట్ల దాకా పొత్తులో భాగంగా గెలుస్తామనేది కమలనాథుల అంచనా అంటున్నారు దీనికి తోడు ఈ మధ్యే ఏపీ బీజేపీ ఎంపీల మీట్‌లో ప్రధాని మోదీ చేసిన దిశానిర్దేశం కూడా పనిచేస్తుందని అంటున్నారు. ఏపీలో వైసీపీపై ఎటాక్ స్టార్ట్ చేయాలని మోదీ సూచించినట్లు చెబుతున్నారు. దీంతో వైసీపీ ఓటు బ్యాంకును తమవైపునకు తిప్పుకోవాలనేది బీజేపీ స్కెచ్ అన్న టాక్ వినిపిస్తోంది. ఏపీలో బలపడేందుకు బీజేపీ వేస్తున్న మాస్టర్ ప్లాన్స్ ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి మరి.

# క్వాంటం వ్యాలీ? కొత్త దిశా

**అఖండ సూర్య, విజయవాడ :**
అమరావతి ఇక కేవలం రాజధాని మాత్రమే కాదు. రానున్న కాలంలో దేశానికి దిశ చూపే టెక్నాలజీ కేంద్రంగా మారేందుకు అడుగులు వేస్తోంది. క్వాంటం టెక్నాలజీ వంటి అత్యాధునిక రంగంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, పరిశోధనలు, ఉద్యోగాల కల్పన.. ఆల్ ఇన్ వన్ కాన్సెప్ట్ అమరావతి నుంచే ప్రారంభం కానుంది. తాజాగా క్వాంటం వ్యాలీకి నిధులు విడుదల చేయడంతో ఈ దిశగా ప్రభుత్వ సంకల్పం మరోసారి స్పష్టమైంది. ‘ఉద్యోగాలే ఉద్యోగాలు’ అన్న నినాదం కాగితాలకే పరిమితం కాకుండా, గ్రౌండ్ పై కనిపించే దశకు చేరుతోంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సీఆర్డీయే 65వ అథారిటీ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలు అమరావతి భవిష్యత్తుకు మైలురాయిగా నిలుస్తున్నాయి.క్వాంటం వ్యాలీకి సంబంధించిన ప్రత్యేక భవనాల నిర్మాణానికి టెండర్లు ఖరారు కావడం, అదనంగా మరిన్ని భవనాల నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించడం అన్నీ కలిపి అమరావతిని టెక్నాలజీ మ్యాప్‌లో మరో మెట్టు ఎక్కిస్తున్నాయి.ప్రపంచం వేగంగా మారుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డేటా అనలిటిక్స్‌తో పాటు ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ దేశాల భవిష్యత్తును నిర్ణయించే రంగంగా మారింది. కంప్యూటింగ్ శక్తిని విప్లవాత్మకంగా మార్చే ఈ టెక్నాలజీలో ముందడుగు వేయడం అంటే భవిష్యత్తును ముందే అందుకోవడమే. ఆ అవకాశాన్ని అమరావతి సొంతం చేసుకుంటోంది. క్వాంటం వ్యాలీ లక్ష్యం ఒక్క పరిశోధన కేంద్రం మాత్రమే కాదు. ఇది ఒక పూర్తి ఎకోసిస్టమ్. రీసెర్చ్ ల్యాబ్స్, స్టార్టప్ ఇన్క్యుబేషన్, ఇండస్ట్రీ భాగస్వామ్యం, గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్స్.. అన్నీ కలిసి




పనిచేసే వ్యవస్థ. దీనివల్ల నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందని ప్రభుత్వ అంచనా.సీఆర్డీయే సమావేశంలో తీసుకున్న ప్రధాన నిర్ణయాల్లో ఒకటి.. క్వాంటం వ్యాలీలో ఎక్విప్‌మెంట్ కోసం ప్రత్యేక భవనం నిర్మించడం. సుమారు 43,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 103.96 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ భవనానికి టెండర్లు పిలిచి ఒ1ను ఖరారు చేశారు. ఇది రెండు ఎకరాల విస్తీర్ణంలో, టెక్నికల్ నిపుణుల డిజైన్ ప్రకారం నిర్మించనున్నారు. ఈ భవనం సాధారణ కార్యాలయంగా కాదు. అత్యాధునిక క్వాంటం పరికరాలు, సెన్సిటివ్ ఎక్విప్‌మెంట్, పరిశోధనల కోసం అవసరమైన ప్రత్యేక వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మించనున్నారు. టెంపరేచర్ కంట్రోల్, వైబ్రేషన్ ఫ్రీ ఫ్లోర్స్, సెక్యూరిటీ అన్నీ కలిపి ప్లాన్ చేసినవిక్వాంటం వ్యాలీలో మరో రెండు భవనాల నిర్మాణాన్ని కూడా వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా, టైమ్‌లైన్‌కు కట్టుబడి ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. “డిజైన్ దశలోనే ఆలస్యం చేయొద్దు. పనులు మొదలైతే ఆగకూడదు” అన్నది ముఖ్యమంత్రి స్పష్టం చేసిన దిశ. ఈ రెండు భవనాలు రీసెర్చ్ టీమ్స్, స్టార్టప్స్, గ్లోబల్ కంపెనీలకు అవసరమైన ఆఫీస్, ల్యాబ్ స్పేస్‌గా ఉపయోగపడనున్నాయి. అంటే, క్వాంటం వ్యాలీ ప్రారంభ దశ నుంచే కార్యకలాపాలు గట్టిగా మొదలయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.క్వాంటం వ్యాలీ వల్ల ఉద్యోగాలు ఎలా వస్తాయి? అన్న ప్రశ్న సహజం. ఇది కేవలం ఒక ప్రభుత్వ ప్రాజెక్ట్ కాదు. ఇది ఒక మల్టీ`లేయర్ ఎకోసిస్టమ్. మొదటి దశలో నిర్మాణ పనుల ద్వారానే వందల మంది కార్మికులకు ఉపాధి. ఇంజినీర్లు, టెక్నికల్ సిబ్బంది, సపోర్ట్ స్టాఫ్? అందరూ అవసరం.రెండో దశలో పరిశోధన కేంద్రాలు ప్రారంభమవుతాయి. ఫిజిక్స్, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న యువతకు రీసెర్చ్ అసిస్టెంట్స్, సైంటిస్ట్స్, ల్యాబ్ టెక్నీషియన్లుగా అవకాశాలు. మూడో దశలో స్టార్టప్స్. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం సెక్యూరిటీ, క్వాంటం సెన్సార్స్ వంటి రంగాల్లో స్టార్టప్స్ రావడం ద్వారా సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, డేటా సైంటిస్ట్స్, హార్డ్‌వేర్ ఇంజినీర్లకు భారీగా ఉద్యోగాలు. నాలుగో దశలో గ్లోబల్ కంపెనీలు. ఒకసారి ఎకోసిస్టమ్ ఏర్పడితే, పెద్ద కంపెనీలు అమరావతిని తమ ఆర్‌అండ్‌డీ హబ్‌గా ఎంచుకునే అవకాశం ఉంది. అప్పుడు ఉద్యోగాల సంఖ్య వేలల్లోకి వెళ్తుందిఇప్పటివరకు ఐటీ అంటే బెంగళూరు, హైదరాబాద్ అన్న భావన ఉండేది. క్వాంటం వ్యాలీతో అమరావతి కూడా ఆ లిస్టులో చేరనుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ యువతకు ఇది గోల్డెన్ ఛాన్స్. బయట రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గే అవకాశం ఉంది. ఇక్కడే చదువు, ఇక్కడే పరిశోధన, ఇక్కడే ఉద్యోగం?అన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కాలేజీలతో లింకేజ్ ఏర్పడితే, స్టూడెంట్స్‌కు ఇంటర్న్‌షిప్స్, ప్రాజెక్ట్ వర్క్స్, ప్లేస్‌మెంట్స్? అన్నీ కలిపి ప్లాట్‌ఫామ్‌గా క్వాంటం వ్యాలీ మారుతుంది. అమరావతి బ్రాండ్ బలపడేలా క్వాంటం వ్యాలీ కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు. ఇది అమరావతి బ్రాండ్‌ను గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టే ప్రయత్నం. ఇప్పటివరకు అమరావతి అంటే పరిపాలనా రాజధాని అనే గుర్తింపు. ఇకపై టెక్నాలజీ రాజధానిగా కూడా గుర్తింపు పొందే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇది ఇతర రంగాలకు కూడా ఊతమిస్తుంది. హౌసింగ్, రియల్ ఎస్టేట్, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్? అన్ని రంగాల్లో ఉద్యోగాలు పెరిగితే నగరంలో ఆర్థిక చక్రం వేగం పెరుగుతుంది. స్పష్టమైన విజన్ సీఆర్డీయే సమావేశంలో కనిపించింది.

# భారీగా పెరిగిన కోడిగ్రుడ్డు ధర

**అఖండ సూర్య, విజయవాడ :**
నాన్‌వెజ్ ప్రియులకు ఇది బ్యాడ్‌న్యూస్ అనే చెప్పవచ్చు. ఇప్పటికే కోడి గుడ్ల ధరలు పెరుగుతోండగా.. దానితో పాటు చికెన్ ధరలు కూడా భగ్గుముంటున్నాయి. త్వరలో క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి లాంటి ప్రధాన పండుగలు వస్తుండటంతో వివిధ ప్రాంతాలకు కోళ్ల సరఫరా పెరిగిపోయింది. దీంతో డిమాండ్ కారణంగా చికెన్ ధరలు పెరిగిపోతున్నాయి. దాణా ఖర్చులు పెరుగడంతో కోళ్ల ఫామ్స్ నిర్వహణ కూడా యజమానులకు కష్టంగా మారిపోయింది. దీంతో ధరల పెరుగుదలకు ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. గుడ్లు, చికెన్ ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల ఇంటి ఖర్చు పెరుగుతోంది. దీంతో పండుగ వేళ సామాన్యులకు భారం తప్పడం లేదు. మరికొన్ని రోజుల పాటు ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని తెలుస్తోంది.నెల క్రిందట గుడ్డు ధర రూ.5 ఉండగా.. ఇప్పుడు ఏకంగా రూ.3 పెరిగి రూ.8కి చేరుకుంది. హోల్‌సెల్ మార్కెట్లో రూ.7.50గా ఉండగా.. రిటైలర్లు రూ.8కి విక్రయిస్తున్నారు. ఇక నాటుకోడి గుడ్డు ధర రూ.15 పలుకుతోంది. ఇక వీటితో పాటు చికెన్ ధరలు కూడా అమాంతం పెరిగాయి. నెలలోనే రూ.100 మేర కేజీ చికెన్ ధర పెరిగింది. నెల క్రితం రూ.190 నుంచి రూ.200 మధ్య కేజీ చికెన్ ధర కొనసాగింది. ఈ నెల ప్రారంభంలో రూ.230 వరకు చేరుకోగా.. ఆదివారం నాటికి రూ.290కి చేరుకుంది. దీంతో నెల రోజుల్లో రూ.100 మేర చికెన్ ధర పెరిగినట్లయింది. పండుగల సీజన్ కావడంతో చికెన్‌కు ఫుల్ డిమాండ్ పెరగడం, డిమాండ్‌కు తగ్గట్లు కోళ్ల ఫామ్స్ నుంచి కోళ్లు రాకపోవడంతో ధరలు పెంచుతున్నారు.ఇక కోళ్లకు వేసే దాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. అలాగే ఇతర ఖర్చులు కూడా పెరగడంతో చికెన్ ధరలు పెంచాల్సి వస్తోందని యజమానులు చెబుతున్నారు. అసలే త్వరలో పండుగల సీజన్ వస్తుండటంతో చికెన్ ఎక్కువగా తింటూ ఉంటారు. ఈ సమయంలో రేట్లు పెరగడం సామాన్యులకు భారం కానుందని చెప్పవచ్చు. మరో నెల రోజుల పాటు పరిస్థితి ఇలాగే ఉంటుందని, ఆ తర్వాత ధరలు తగ్గే అవకాశం ఉంటుందని పౌల్ట్రీ ఎక్స్‌పర్ట్ చెబుతున్నారు.ప్రస్తుతం ఒక్క కోడిగుడ్డు రికార్డు స్థాయిలో రూ. 8కి చేరింది. ఇక హోల్‌సేల్ మార్కెట్లోనే ఒక్కో గుడ్డు ధర రూ.7.30 పలుకుతుండటం విశేషం. గతంలో ఒక ట్రే (30 గుడ్లు) రూ.160 నుంచి రూ.170 వరకు లభించేవి. కానీ, ప్రస్తుతం అది రూ.210 నుంచి రూ. 220కి చేరింది. కోడిగుడ్డు ధరలు ఈ స్థాయికి చేరుకోవడం పౌల్ట్రీ ఇండస్ట్రీ చరిత్రలోనే తొలిసారి అని చెబుతున్నారు. అయితే, ధరలు ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం డిమాండ్ కు తగిన ఉత్పత్తి లేకపోవడమే. ఇక నాటు కోడి గుడ్ల విషయానికి వస్తే ఒక్కో గుడ్డు ధర రూ.15 వరకు పలుకుతోంది.గతంలో తెలుగు రాష్ట్రాల్లో రోజుకు సుమారు 8కోట్ల గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. అయితే, కోళ్ల ఫారాల నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్న నేపథ్యంలో చాలా మంది పౌల్ట్రీ యాజమానులు ఈ రంగానికి దూరమవుతున్నారు. కోళ్లకు పెట్టే దాణా, మక్కలు, సోయా, చేపపొట్టు వంటి ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల చిన్న, మధ్యతరహా రైతులు కోళ్ల ఫారాలను మూసివేస్తున్న పరిస్థితి. గతంలో కోల్డ్ స్టోరేజీల్లో దాదాపు 20కోట్ల గుడ్లు నిల్వ ఉండేవని, ప్రస్తుతం ఆ నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు.



ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మరికొద్దిరోజులు కోడిగుడ్డు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. కోళ్ల దాణాపై సబ్సిడీ ఇవ్వడం లేదా ఉత్పత్తిని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తప్ప ధరలు అదుపులోకి వచ్చే సూచనలు కనిపించడం లేదు.



# కడపలో రెడ్డప్ప గారి రాజకీయానికి చెక్

**అఖండ సూర్య, కడప :**
ఏపీ రాజకీయాల్లో కడప జిల్లాది ప్రత్యేక స్థానం. ఎందుకంటే దశాబ్దాలుగా అక్కడ వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబ హవా నడిచింది. నందమూరి తారక రామారావు లాంటి నేతలు సైతం కడప విషయంలో అనేక రకాల ఆలోచనలు చేశారు. కానీ అనుకున్న స్థాయిలో సక్సెస్ కాలేకపోయారు. కడపలో ఏకపక్ష విజయం తెలుగుదేశం పార్టీకి ఎప్పటికీ లోటే. రాజశేఖర్ రెడ్డి ఉన్నంతవరకు కాంగ్రెస్ పార్టీకి ఆ జిల్లాలో తిరుగులేదు. జగన్మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హవా నడిచింది. కానీ గడిచిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. పది అసెంబ్లీ సీట్లకు గాను ఏడు చోట్ల టిడిపి కూటమి గెలుపొందింది. నేతలంతా సమన్వయంతో పని చేయడంతో ఇదంతా సాధ్యమైంది. అయితే రాజశేఖర్ రెడ్డి కుటుంబంలో జరిగిన పరిణామాలకు.. కడపలో రెడ్డప్ప గారి కుటుంబం దూకుడు తోడు కావడంతో టిడిపి కూటమికి ప్లస్ గా మారింది. రెడ్డప్ప గారి మాధవి రెడ్డి కడప ఎమ్మెల్యేగా విజయం సాధించగా.. ఆమె భర్త శ్రీనివాస్ రెడ్డి టిడిపి జిల్లా అధ్యక్షుడిగా చాలా ఏళ్లుగా కొనసాగుతూ వచ్చారు. ఇప్పుడు టిడిపి అధ్యక్ష పదవి నుంచి రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డిని తొలగించారు. ఇది కడప జిల్లాలో పొలిటికల్ హీట్ పెంచింది.తెలుగుదేశం పార్టీ కూటమి కడప జిల్లాలో విజయం సాధించింది. ఫలితాలు వచ్చాక



మాత్రం నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డికి పార్టీ హై కమాండ్ ఫ్రీ హ్యాండ్ ఇవ్వడంతో ఆయన ఎవరిని లెక్క చేయలేదు. పార్టీ మంచి విజయం సాధించి పట్టు నిలుపుకోవాల్సిన సమయంలో నేతల మధ్య విభేదాలు పెరుగుతుండడం పై హై కమాండ్ ఆందోళన చెందింది. ఇటువంటి తరుణంలో రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డిని టిడిపి అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగించడం నిజంగా సాహసమే. ఎందుకంటే కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ పట్టు సాధించడానికి ఆ కుటుంబమే కారణం. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. టిడిపి నేతల ఒత్తిడికి చంద్రబాబు తలొగ్గాల్సి వచ్చింది. రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ టిడిపి పగ్గాలు తీసుకొని చాలా ఏళ్లు అవుతోంది. వాస్తవానికి తెలుగుదేశం పార్టీ అత్యంత క్లిష్ట సమయంలోనే ఆయన అధ్యక్ష పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన గత ఐదేళ్లకు పైగా ఆ పదవిలో ఉన్నారు. టిడిపి అధ్యక్ష బాధ్యతలు అంటేనే ఎవరు ముందుకు రాని రోజుల్లో నేనున్నాను అని ముందుకొచ్చి ఆ బాధ్యతలు స్వీకరించారు. అయితే కూటమి గెలిచిన తర్వాత టిడిపి నేతలతో ఆయనకు విభేదాలు ఏర్పడ్డాయి. సహజంగానే చంద్రబాబుపై ఈ విషయంలో ఒత్తిడి పెరిగింది. అందుకే ఆయన స్థానంలో భూపేష్ రెడ్డిని నియమించారు చంద్రబాబు. ఆయన బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి స్వయానా అన్న కొడుకు. 2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఆదినారాయణ రెడ్డి టిడిపిలోకి ఫిరాయించారు. 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి టార్గెట్ అవుతానని భావించి బిజెపిలో చేరారు. కానీ ఆయన అన్న కుమారుడు టిడిపిలోని కొనసాగుతూ వచ్చారు. 2024 ఎన్నికల్లో జమ్మలమడుగు టిడిపి అభ్యర్థిగా భూపేష్ రెడ్డి అంత సిద్ధం చేసుకున్నారు. కానీ చివరి నిమిషంలో బిజెపితో పొత్తు కుదరడంతో ఆ సీటు ఆ పార్టీకి వెళ్ళింది. బాబాయ్ కోసం ఆ సీటు వదులుకున్నారు భూపేష్ రెడ్డి. కడప పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. దీంతో ఆయనకు టిడిపి జిల్లా అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టారు చంద్రబాబు. అయితే అదే అధ్యక్ష పదవి కోసం రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి వ్యతిరేకులు ప్రయత్నించారు. చివరకు రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి అభిప్రాయాన్ని తీసుకుని భూపేష్ రెడ్డిని నియమించినట్లు తెలుస్తోంది.

## సైబర్ ఫ్రాడ్‌కు బలైన పంజాబ్ మాజీ ఐజీ..
# తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య

- భారీ సైబర్ మోసంలో రూ.8.10 కోట్లు పోగొట్టుకున్న మాజీ ఐజీ
- పాటియాలా నివాసంలో తుపాకీతో కాల్చుకున్న వైనం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన అమర్ సింగ్ చాహల్
- 12 పేజీల సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

**అఖండ సూర్య :**

పంజాబ్ రాష్ట్రానికి చెందిన రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ) అమర్ సింగ్ చాహల్ కన్నుమూశారు. భారీ సైబర్ మోసంలో రూ.8.10 కోట్లు నష్టపోయిన ఆయన, తీవ్ర మనస్తాపంతో సోమవారం తన నివాసంలో తుపాకీతో కాల్చుకున్నారు. డైలి జాగరణ్ కథనం ప్రకారం, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించారు. ఈ ఘటన పోలీసు వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.
పాటియాలాలోని తన నివాసంలో సెక్యూరిటీ గార్డుకు చెందిన రివాల్వర్‌తో ఆయన కాల్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందిన పది నిమిషాల్లోనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కొన ఊపిరితో ఉన్న చాహల్‌ను పార్క్ ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స ఫలించక ఆయన మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఘటనా స్థలం నుంచి 12 నుంచి 16 పేజీల సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీజీపీ గౌరవ్ యాదవ్‌ను ఉద్దేశించి రాసిన ఈ లేఖలో, తాను మోసపోయిన తీరును, ఆర్థిక ఇబ్బందులను ఆయన వివరించారు.
గత అక్టోబర్‌లో ఓ మోసపూరిత కంపెనీలో చాహల్ పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. మొదట తన సొంత డబ్బు రూ.1 కోటి పెట్టుబడిగా పెట్టగా, ఆ తర్వాత కంపెనీ డిమాండ్ల మేరకు స్నేహితులు, బంధువుల నుంచి అప్పులు చేసి మిగతా మొత్తాన్ని చెల్లించారు. ఈ మోసంపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు కూడా ఆయన లేఖలు రాసినట్లు సమాచారం. అమర్ సింగ్ చాహల్ కెరీర్‌లో వివాదాలు కూడా ఉన్నాయి. 2015లో జరిగిన బెహబల్ కలాన్, కోట్‌కపురా కాల్పుల ఘటనల్లో ఆయన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్, ఆయన కుమారుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌తో పాటు పలువురు పోలీసు అధికారులపై సిట్ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉన్నత హోదాలో పని చేసిన అధికారి సైతం సైబర్ నేరగాళ్ల బారిన పడి ప్రాణాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.



## పీఎంకు అండర్ వరల్డ్
# డాన్ కుమార్తె మొర

- ప్రధాని కల్పించుకుంటేనే తనకు న్యాయం జరుగుతుందని వేడుకోలు
- 12 ఏళ్లకే పెళ్లి.. 14 ఏళ్లకు అబార్షన్.. ఏళ్ల తరబడి లైంగిక హింస
- హాజీ మస్తాన్ ఆస్తుల కోసమే తనను వేధించారని ఆవేదన

**అఖండ సూర్య :**

ముంబై అండర్ వరల్డ్ డాన్ హాజీ మస్తాన్ కుమార్తె హసీన్ మస్తాన్ మీర్జా తాజాగా మీడియా ముందుకు వచ్చారు. తాను ఏళ్ల తరబడి లైంగిక హింసకు గురయ్యానని, తనకు న్యాయం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. తన మాజీ భర్త, ఆయన కుటుంబంపై తాను చేస్తున్న న్యాయ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. డబ్బు, రాజకీయ అండ లేకపోవడం వల్ల తనకు న్యాయం జరగడంలేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోక్యం చేసుకుంటేనే తనకు న్యాయం జరుగుతుందని అన్నారు. తన తండ్రి హాజీ మస్తాన్ ఎంతోమందికి సాయం చేశాడని, ఆయన చనిపోయాకే తనకు కష్టాలు మొదలయ్యాయని హసీన్ తెలిపారు. 12 ఏళ్ల వయసులోనే తనకు బలవంతంగా పెళ్లి చేశారని, 14 ఏళ్ల వయసులో తనకు అబార్షన్ అయిందని ఆమె చెప్పారు. తన తండ్రి చనిపోయాక ఆయన ఆస్తుల కోసం తనను వేధింపులకు గురిచేశారని మాజీ భర్త కుటుంబంపై ఆరోపణలు చేశారు. ఏళ్ల తరబడి లైంగిక హింసకు గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. హాజీ మస్తాన్ ఆస్తులన్నీ తమకే దక్కుతాయని తన మాజీ భర్త కుటుంబం ఆశించిందని చెప్పారు. అందుకోసమే తనపై అత్యాచారం చేశానని తన మాజీ భర్త చెప్పాడన్నారు. ఆస్తులు దక్కకపోవడంతో విడాకులు ఇచ్చి తనను నడి రోడ్డుపై వదిలేశారని, తన వద్ద డబ్బు ఏమీ లేదని హసీన్ వాపోయారు. మాజీ భర్త, ఆయన కుటుంబంపై 2013 నుంచి న్యాయపోరాటం చేస్తున్నానని హసీన్ చెప్పారు. అయితే, డబ్బు లేకపోవడంతో తన కేసు ముందుకు సాగడం లేదన్నారు. పోలీసులు కూడా తనకు ఎలాంటి సాయం చేయలేదని విమర్శించారు. పోలీసులు ఈ కేసును పక్కన పడేయకుండా ఉండేందుకు, తనకు న్యాయం జరిగేందుకు ప్రధాని మోదీ సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్న నేతలు చాలామంది తనకు తెలుసని, అయితే రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం తనకు లేదని హసీన్ స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్ లో యోగి ఆదిత్యనాథ్ బుల్డోజర్ జస్టిస్‌పై హసీన్ పొగడ్తలు కురిపించారు. యోగి బుల్డోజర్లు ముంబైకి కూడా రావాలని ఆమె ఆకాంక్షించారు.






## మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ..
# డీజీపీ ఎదుట 22 మంది సరెండర్

**అఖండ సూర్య :** మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశా మల్కాన్‌గిరి జిల్లాలో మంగళవారం 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఒడిశా డీజీపీ వైబీ ఖురానీ, ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో లొంగిపోయారు. సరెండర్ సందర్భంగా మావోయిస్టులు తమ వద్ద ఉన్న 9 తుపాకులు, 150 రౌండ్ల మందుగుండు సామాగ్రి, 20 కిలోల పేలుడు పదార్థాలు, 13 ఐఈడీలు, జెలటిన్ స్టిక్స్, ఇతర వస్తువులు అప్పగించారు. లొంగిపోయిన మావోయిస్టులలో 19 మంది ఒడిసాకు చెందిన వారు, ఇద్దరు ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీకి చెందినవారు ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ జనజీవన స్రవంతిలో కలిసే మావోయిస్టులకు ప్రభుత్వం తరపున పునరావాసం కల్పిస్తామని చెప్పారు.



## దేశాలకు భారత విద్యార్థుల క్యూ...
# నీతి ఆయోగ్ నివేదికలో కీలక విషయాలు

- విదేశాల్లో 13.35 లక్షల మంది భారతీయ విద్యార్థులు
- చదువులకు టాప్ డెస్టినేషన్‌గా నిలిచిన కెనడా
- భారత్‌కు భారీగా తప్పని బ్రెయిన్ డ్రెయిన్ సమస్య
- విదేశీ విద్యపై ఏటా రూ. 2.9 లక్షల కోట్ల వ్యయం

**అఖండ సూర్య :**

భారతదేశం నుంచి ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ప్రపంచంలోనే అత్యధికంగా 1823 ఏళ్ల వయసు యువత (సుమారు 15.5 కోట్లు) భారత్ లోనే ఉన్నప్పటికీ, విదేశీ విద్యపై ఆధారపడటం ఎక్కువవుతోందని నీతి ఆయోగ్ సోమవారం విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది. 2024 నాటికి 13.35 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నారని ఈ నివేదిక వెల్లడించింది.
భారత విద్యార్థులు ఎక్కువగా ఇష్టపడే దేశాల్లో కెనడా, అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. 2024లో అత్యధికంగా 4.27 లక్షల మంది విద్యార్థులతో కెనడా మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత అమెరికాలో 3.37 లక్షల మంది, యూకేలో 1.85 లక్షల మంది, ఆస్ట్రేలియాలో 1.22 లక్షల మంది, జర్మనీలో దాదాపు 43,000 మంది భారత విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఈ నివేదిక 'బ్రెయిన్ డ్రెయిన్' సమస్య తీవ్రతను ఎత్తిచూపింది. 2024లో భారత్‌కు చదువుకోవడానికి వస్తున్న ప్రతి ఒక్క విదేశీ విద్యార్థికి బదులుగా, 28 మంది భారత విద్యార్థులు విదేశాలకు వెళుతున్నారు. కేవలం కెనడా, అమెరికా, యూకే, ఆస్ట్రేలియా దేశాల్లోనే 202324 విద్యా సంవత్సరంలో మన విద్యార్థులు ఉన్నత విద్య కోసం సుమారు రూ. 2.9 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు నివేదిక అంచనా వేసింది. లాట్వియా, ఐర్లాండ్ వంటి చిన్న యూరోపియన్ దేశాల్లో సైతం భారత విద్యార్థుల వాటా గణనీయంగా ఉండటం గమనార్హం. లాట్వియాలోని మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల్లో 17.4 శాతం మంది భారతీయులే ఉండగా, ఐర్లాండ్‌లో ఈ సంఖ్య 15.3 శాతంగా ఉంది. ఈ వలసల వల్ల దేశం ప్రతిభావంతులను, విలువైన విదేశీ మారకాన్ని కోల్పోతోందని నివేదిక పేర్కొంది.





## సముద్రం అడుగున రైలు ప్రయాణం..
# 2 గంటల్లోనే గమ్యానికి!

- ప్రయాణాన్ని సమూలంగా మార్చేసే భారీ ప్రాజెక్టుకు పడుతున్న అడుగులు
- గంటకు 600-1000 కిలోమీటర్ల వేగంతో 'డీప్ బ్లూ ఎక్స్‌ప్రెస్' ప్రయాణం
- ప్రాజెక్టుకు 50 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని అంచనా
- ప్రాజెక్టు పూర్తయితే అంతర్జాతీయ వాణిజ్యానికి కేంద్రంగా ముంబై

**అఖండ సూర్య :**

భారత్ యూఏఈ మధ్య ప్రయాణాన్ని సమూలంగా మార్చేసే ఒక భారీ ప్రాజెక్టుకు అడుగులు పడుతున్నాయి. ముంబై నుంచి దుబాయ్‌కి అరేబియా మహా సముద్రం అడుగున హైస్పీడ్ రైలును నడపాలనే ప్రతిపాదన ఇప్పుడు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కల గనుక నిజమైతే గంటకు 600 నుంచి 1,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ 'డీప్ బ్లూ ఎక్స్‌ప్రెస్' విమానం కంటే వేగంగా గమ్యస్థానానికి చేరుస్తుంది.
ఈ ప్రాజెక్టులో అత్యంత ఆకర్షణీయమైన అంశం ఏమిటంటే.. సముద్ర మట్టానికి 200 మీటర్ల లోతులో ఉండే ఈ టన్నెల్‌కు పనోరమిక్ కిటికీలను ఏర్పాటు చేయనున్నారు. అంటే, మీరు రైల్లో కూర్చుని వెళ్తుంటే.. కిటికీ బయట తిమింగలాలు, షార్కులు, రకరకాల సముద్ర జీవులు మీ పక్కనే ఈదుతున్నట్లు కనిపిస్తాయి. సూపర్ సోనిక్ వేగంతో వెళ్తున్నప్పటికీ, ప్రపంచంలోనే అతిపెద్ద అక్వేరియంలో ప్రయాణిస్తున్న అద్భుత అనుభూతిని ఇది అందిస్తుంది. సుమారు 50 బిలియన్ డాలర్ల భారీ బడ్జెట్‌తో తలపెట్టిన ఈ ప్రాజెక్టు కేవలం ప్రయాణికుల కోసమే కాదు, రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను కూడా బలోపేతం చేయనుంది. దుబాయ్ నుంచి భారత్‌కు ముడి చమురును ఈ పైపులైన్ ద్వారా రవాణా చేయవచ్చు. భారత్ నుంచి స్వచ్ఛమైన నీటిని యూఏఈకి తరలించే అవకాశం ఉంటుంది. ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తే ప్రయాణ ఖర్చులు దాదాపు 60 శాతం వరకు తగ్గుతాయని అంచనా.

**ముంబై సరికొత్త గ్లోబల్ హబ్!**

ఈ ప్రాజెక్టు పూర్తయితే ముంబై నగరం అంతర్జాతీయ వాణిజ్యానికి మరింత పెద్ద కేంద్రంగా మారుతుంది. అంతేకాకుండా, ఈ నిర్మాణం ద్వారా దాదాపు 50,000 కొత్త ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ముంబై నుంచి దుబాయ్‌కి విమానంలో వెళ్లాలంటే 3 నుంచి 3.5 గంటల సమయం పడుతోంది. కానీ ఈ అండర్ వాటర్ ట్రైన్ ద్వారా కేవలం 2 గంటల్లోనే చేరుకోవచ్చు. ప్రస్తుతం ఈ భారీ ప్రాజెక్టుపై భారత్, యూఏఈ ప్రభుత్వాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇది కార్యరూపం దాల్చితే ప్రపంచ రవాణా రంగంలోనే ఇదొక చారిత్రాత్మక విప్లవం కానుంది.

## ప్రియుడితో కలిసి భర్తను చంపి
# ముక్కలుగా కోసి సంచిలో కుక్కిన భార్య!

- 'బ్లైండ్ మర్డర్' కేసు మిస్టరీని ఛేదించిన యూపీ పోలీసులు
- ప్రియుడితో అభ్యంతరకర స్థితిలో ఉండగా భార్యను చూసిన భర్త
- ప్రియుడితో కలిసి భర్తను తలపై కొట్టి చంపేసిన భార్య
- ఆపై కట్టర్ తెప్పించి మృతదేహాన్ని ముక్కలు చేసిన వైనం
- నిందితులను పట్టించిన మృతుడి చేతిపై ఉన్న పచ్చబొట్టు

**అఖండ సూర్య :**

సంచలనం సృష్టించిన 'బ్లైండ్ మర్డర్' కేసు మిస్టరీని ఉత్తరప్రదేశ్ పోలీసులు ఛేదించారు. ప్రియుడితో కలిసి భర్తను కిరాతకంగా హత్య చేసిన భార్య ఆట కట్టించి కటకటాల వెనక్కి పంపారు. ఈ నెల 15న చందౌసి ప్రాంతంలోని ఒక ఈద్గా వెనుక నల్లటి బ్యాగులో కుళ్లిన స్థితిలో ఒక మనిషి మొండెం లభ్యమైంది. తల లేకపోవడంతో ఆ వ్యక్తి ఎవరో గుర్తు పట్టడం పోలీసులకు సవాలుగా మారింది. అయితే, ఆ మొండెం చేతిపై 'రాహుల్' అనే పేరు టాటూగా ఉండటాన్ని పోలీసులు గమనించారు. అదే ఈ కేసులో కీలకంగా మారింది. రాహుల్ అనే పేరుతో ఉన్న మిస్సింగ్ కేసులను ఆరా తీయగా రూబీ అనే మహిళ తన భర్త రాహుల్ కనిపించడం లేదని నవంబర్ 24న ఫిర్యాదు చేసినట్టు తేలింది. పోలీసులు ఆమెను పిలిపించి ఆ మొండెం పక్కన ఉన్న బట్టలను చూపించారు. కానీ ఆ కిలాడీ భార్య ఏమాత్రం తడబడకుండా 'ఇవి నా భర్తవి కావు' అని చెప్పింది. అయితే ఆమె ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు ఆమె మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తనిఖీ చేశారు.
పోలీసులు రూబీ ఫోన్ గ్యాలరీని వెతుకుతుండగా ఒక ఫోటో కనిపించింది. అందులో తన భర్త రాహుల్ వేసుకున్న టీషర్ట్, ఆ బ్యాగులో దొరికిన టీషర్ట్ ఒకటేనని పోలీసులు నిర్ధారించుకున్నారు. ఆ ఫోటోను చూపించి గట్టిగా నిలదీయడంతో రూబీ అసలు విషయాన్ని ఒప్పుకుంది. రూబీకి గౌరవ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. నవంబర్ 17 అర్ధరాత్రి రూబీ తన ప్రియుడిని ఇంటికి పిలిపించుకుంది. అదే సమయంలో హఠాత్తుగా భర్త రాహుల్ రావడంతో వారిద్దరినీ అభ్యంతరకర స్థితిలో చూశాడు. గొడవ మొదలవడంతో రూబీ, గౌరవ్ కలిసి రాహుల్ తలపై బలంగా కొట్టి అక్కడికక్కడే చంపేశారు. నేరం బయటపడకుండా ఉండేందుకు మరుసటి రోజు కట్టర్ మెషీన్‌ను తెప్పించి రాహుల్ శరీరాన్ని ముక్కలుగా కోశారు. వాటిని ఒక బ్యాగులో పెట్టి 50 కిలోమీటర్ల దూరంలోని గంగా నదిలో పడేశారు. మొండాన్ని మరో బ్యాగులో పెట్టి ఊరి బయట పడేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు వారం రోజుల తర్వాత స్వయంగా పోలీసుల వద్దకు వెళ్లి భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. పోలీసులు తాజాగా ఆ కట్టర్ మెషీన్‌ను స్వాధీనం చేసుకున్నారు. రూబీ, ఆమె ప్రియుడు గౌరవ్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. నదిలో పడేసిన మిగిలిన శరీర భాగాల కోసం గాలింపు కొనసాగుతోంది.





## ఢిల్లీలో బంగ్లాదేశ్ హైకమిషన్ ఎదుట ఉద్రిక్తత

- దీపు చంద్ర దాస్ హత్యపై ఢిల్లీలో భారీ నిరసనలు
- ఢిల్లీలోని బంగ్లా హైకమిషన్ ఎదుట కట్టుదిట్టమైన భద్రత
- బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులపై ఆగ్రహం
- భారత్‌లో దౌత్య కార్యాలయాల భద్రతపై బంగ్లాదేశ్ ఆందోళన

**అఖండ సూర్య :**

బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడు దీపు చంద్ర దాస్ హత్యకు నిరసనగా న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ఎదుట నిరసనలు కొనసాగుతున్నాయి. గత వారం మైమెన్సింగ్ జిల్లాలో ఇస్లామిస్ట్ గుంపు దాడిలో దీపు దారుణంగా హత్యకు గురికావడం దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేపింది. ఈ ఘటనను ఖండిస్తూ విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, దేవాలయాల ధ్వంసం తక్షణమే ఆపాలని వారు డిమాండ్ చేశారు. నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు హైకమిషన్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మూడు వరుసల బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు, పారా మిలిటరీ దళాలను మోహరించారు. అయినప్పటికీ కొంతమంది నిరసనకారులు బారికేడ్లను తోసుకుంటూ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీపు దాస్‌కు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. "ఈరోజు మనం గొంతెత్తకపోతే, రేపు ప్రతి ఒక్కరూ దీపే అవుతారు" అంటూ ఒక నిరసనకారి చేసిన వ్యాఖ్య అక్కడి ఉద్రిక్తతను ప్రతిబింబించింది. ఈ నెల 19న బంగ్లాదేశ్ మైమెన్సింగ్‌లోని బలూకాలో 25 ఏళ్ల గార్మెంట్ ఫ్యాక్టరీ కార్మికుడు దీపు చంద్ర దాస్‌పై దైవదూషణ ఆరోపణలతో గుంపు దాడి చేసి, అతని మృతదేహాన్ని తగలబెట్టడం కలకలం రేపింది. ఈ ఘటనలో ఇప్పటివరకు కనీసం 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇదిలా ఉంటే... భారత్‌లోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాలపై జరిగిన నిరసనలపై బంగ్లాదేశ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో భారత హైకమిషనర్‌ను పిలిపించి నిరసన తెలిపింది. దౌత్య కార్యాలయాలపై హింస, బెదిరింపులు అంతర్జాతీయ ప్రమాణాలకు విరుద్ధమని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నెల 20న ఢిల్లీలో నిరసన, 22న సిలిగురిలోని బంగ్లాదేశ్ వీసా కేంద్రంపై జరిగిన విధ్వంసాన్ని ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భారత్‌ను కోరింది.





## తమిళనాడులో పొంగల్ కానుకల సందడి

- ఎన్నికల వేళ స్టాలిన్ సర్కారు వ్యూహాత్మక నిర్ణయం
- రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఇంటికీ రూ.3 వేలు
- ఓ ధోతి, చీర, నిత్యావసరాలు కూడా అందించనున్న ప్రభుత్వం

**అఖండ సూర్య :**

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమిళనాడు సర్కారు వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రజలను ప్రసన్నం చేసుకోవడానికి సంక్రాంతి కానుక ప్రకటించింది. ఎన్నికల ముంగిట వస్తున్న పండుగ కావడంతో ఈసారి పొంగల్ కానుక భిన్నంగా ఉండనుంది. పొంగల్ సందర్భంగా తమిళనాడులోని రేషన్ కార్డుదారులకు నగదు, నిత్యావసరాలతో పాటు ఓ ధోతి, చీర కూడా ఇవ్వనున్నట్లు పేర్కొంది. తమిళనాడు పొంగల్ గిఫ్ట్ పథకం 2026 లో భాగంగా అర్హులైన ప్రతీ కుటుంబానికి రూ.3 వేల నగదుతో పాటు గిఫ్ట్ హ్యాంపర్‌ను అందించనున్నట్లు తెలిపింది. జనవరి రెండవ వారంలో సీఎం ఎంకే స్టాలిన్ ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం. పంపిణీ ప్రక్రియను సులభతరం చేయడానికి జనవరి మొదటి వారంలో రేషన్ షాపు సిబ్బంది ఇంటింటికీ తిరిగి టోకెన్లు పంపిణీ చేస్తారు. దానిపై పేర్కొన్న తేదీ, సమయం ఆధారంగా లబ్ధిదారులు రేషన్ షాప్ లకు వెళ్లి పొంగల్ కానుక అందుకోవచ్చని తమిళనాడు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**పొంగల్ గిఫ్ట్ లో ఏముంటాయంటే..**

ఒక కిలో బియ్యం, కిలో చక్కెర, ఒక పొడవాటి చెరుకు గడ, ధోతీ, చీర, జీడిపప్పు, ఎండు ద్రాక్ష, యాలకులతో పాటు రూ.3 వేల నగదు.



## టీమిండియా ప్రవర్తనపై ఐసీసీకి ఫిర్యాదు చేస్తాం

- అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో భారత్‌పై పాక్ ఘన విజయం
- 13 ఏళ్ల తర్వాత పాకిస్థాన్‌కు అండర్-19 ఆసియా కప్ టైటిల్
- భారత ఆటగాళ్ల ప్రవర్తనపై ఐసీసీకి ఫిర్యాదు చేస్తామన్న పీసీబీ
- క్రికెట్ స్పిరిట్‌పై సర్ఫరాజ్ అహ్మద్ వ్యాఖ్యలు

**అఖండ సూర్య, న్యూ ఢిల్లీ**

అండర్19 ఆసియా కప్ 2025 ఫైనల్‌లో భారత్‌పై పాకిస్థాన్ భారీ విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. సమీర్ మిన్హాస్ చారిత్రాత్మక శతకంతో మెరిసిన ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ 347/8 భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం భారత్‌ను కేవలం 156 పరుగులకే ఆలౌట్ చేసి 191 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో పాక్‌కు 13 ఏళ్ల తర్వాత వచ్చిన అండర్19 ఆసియా కప్ టైటిల్ కాగా, మొత్తం మీద ఇది వారి రెండో టైటిల్‌గా నిలిచింది. అయితే, ఈ ఫైనల్ మ్యాచ్ అనంతరం వివాదం తలెత్తింది. భారత ఆటగాళ్ల ప్రవర్తనపై పాకిస్థాన్ అండర్19 జట్టు కోచ్ సర్ఫరాజ్ అహ్మద్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. మ్యాచ్ సమయంలో భారత ఆటగాళ్లు రెచ్చగొట్టేలా వ్యవహరించారని ఆరోపించాడు. దీనిపై స్పందించిన పాక్ క్రికెట్ బోర్డు ఛైర్మన్, ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ, ఈ అంశంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆధ్వర్యంలో జరిగిన జట్టు సన్మాన కార్యక్రమంలో నఖ్వీ మాట్లాడుతూ, "క్రీడలు, రాజకీయాలు వేరుగా ఉండాలి. కానీ, ఫైనల్‌లో భారత ఆటగాళ్ల ప్రవర్తన సరైనది కాదు" అని వ్యాఖ్యానించారు. సర్ఫరాజ్ కూడా ఇది క్రికెట్ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. అయితే, పాకిస్థాన్ ఆటగాళ్లు మాత్రం విజయం అనంతరం క్రీడాస్ఫూర్తితోనే సంబరాలు చేసుకున్నారని ఆయన అన్నారు.

## విజయ్ హజారే ట్రోఫీలో కోహ్లీ రీఎంట్రీ.. అభిమానులకు నిరాశ

- ఢిల్లీ, ఆంధ్ర మ్యాచ్ ప్రేక్షకులు లేకుండా నిర్వహణ
- భద్రతా కారణాలతో ప్రభుత్వ నిర్ణయం
- ఢిల్లీ జట్టుకు కలిసి రానున్న కోహ్లీ ప్రాతినిధ్యం

**అఖండ సూర్య, న్యూ ఢిల్లీ**

టీమిండియా సీనియర్ ఆటగాడు విరాట్ కోహ్లీ మళ్లీ దేశవాళీ క్రికెట్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నాడు. 202526 విజయ్ హజారే ట్రోఫీ ద్వారా ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్న కోహ్లీపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, ఆయన బ్యాటింగ్‌ను ప్రత్యక్షంగా చూసే అవకాశం అభిమానులకు లేదు. ఢిల్లీ, ఆంధ్ర జట్ల మధ్య జరిగే తొలి రౌండ్ మ్యాచ్ బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో ప్రేక్షకులు లేకుండా జరగనుంది. ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్‌ఫో కథనం ప్రకారం కర్ణాటక ప్రభుత్వం భద్రతా కారణాల దృష్ట్యా మ్యాచ్‌లను మూసివేసిన తలుపుల వెనుక నిర్వహించాలంటూ కేఎస్‌సీఏకు ఆదేశించే అవకాశం ఉందని సమాచారం. పోలీసుల అనుమతి లభించకపోతే, బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (CoE)ను ప్రత్యామ్నాయ వేదికగా సిద్ధం చేస్తున్నారు. మొదట రెండు స్టాండ్లను తెరచి 2,000 నుంచి 3,000 మంది ప్రేక్షకులకు అనుమతి ఇవ్వాలని కేఎస్‌సీఏ భావించినా ప్రభుత్వం దీనిని తిరస్కరించింది.

పండుగ సీజన్‌లో ప్రముఖ ఆటగాళ్లు పాల్గొనడం వల్ల స్టేడియం పరిసరాల్లో గందరగోళం ఏర్పడే అవకాశముందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. కోహ్లీతో పాటు రిషభ్ పంత్ అందుబాటులో ఉండటంతోనే వేదికను ఆలూర్ నుంచి చిన్నస్వామికి మార్చిన సంగతి తెలిసిందే. ఒకవేళ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో మ్యాచ్‌లు జరిగితే, అక్కడ కోహ్లీ తొలిసారి మ్యాచ్ ఆడినట్లవుతుంది. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో రెండు సెంచరీలు, ఒక అర్ధశతకం సాధించిన కోహ్లీ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అదే జోరును దేశవాళీ క్రికెట్‌లో కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. విజయ్ హజారే ట్రోఫీ అనంతరం న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో కూడా కోహ్లీ పాల్గొననున్నాడు. బీసీసీఐ నిబంధనల మేరకు కేంద్ర కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లు దేశవాళీ టోర్నీల్లో పాల్గొనాల్సి ఉండటంతో కోహ్లీ ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ టోర్నీలో ఢిల్లీ జట్టుకు రిషభ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.




## డమ్మీ అయిపోయిన పాక్ ప్రధాని.. పాక్ ఆర్మీ చీఫ్‌ని కలిసిన అండర్-19 జట్టు!

- అండర్-19 ఆసియా కప్ ఫైనల్ లో పాక్ ఘన విజయం
- చిత్తుగా ఓడిపోయిన భారత్
- ప్రధానిని కాకుండా ఆర్మీ చీఫ్ ను కలిసిన పాక్ జట్టు

**అఖండ సూర్య, న్యూ ఢిల్లీ**

ఈనెల 21న జరిగిన అండర్19 ఆసియా కప్ ఫైనల్లో పాకిస్థాన్ జట్టు భారత్‌పై ఘన విజయం సాధించింది. భారత్ పై 191 పరుగుల తేడాతో పాక్ గెలిచింది. పాకిస్థాన్ బ్యాట్స్‌మన్ సమీర్ అద్భుత ప్రదర్శనతో 113 బంతుల్లో 172 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 348 పరుగుల భారీ లక్ష్యంతో ఛేజింగ్ కు దిగిన టీమిండియా కేవలం 156 పరుగులకే ఆలౌట్ అయింది. విజయం అనంతరం పాక్ జట్టు ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ ను కలిసింది. మునీర్‌కు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మెహ్సిన్ నఖ్వీ జట్టు సభ్యులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా వారితో పాటు పాక్ జట్టు మెంటార్ సర్ఫరాజ్ అహ్మద్ కూడా ఉన్నారు. ఘన విజయం సాధించిన పాక్ జట్టును ఆసిమ్ మునీర్ ప్రశంసించారు. యువ క్రికెటర్లు తమ ప్రతిభ, క్రమశిక్షణ, సమష్టి కృషితో దేశానికి పేరు తెచ్చారని కితాబునిచ్చారు. ఈ విజయం కేవలం క్రికెట్ రంగానికే కాకుండా, పాకిస్థాన్ దేశానికి గర్వకారణమని మునీర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. మరోవైపు పాక్ జట్టు ఆ దేశ ప్రధాని షహబాజ్ షరీఫ్ ను కాకుండా ఆర్మీ చీఫ్ ను కలవడం చర్చనీయాంశంగా మారింది. పాక్ ప్రధాని డమ్మీ అయిపోయారంటూ సోషల్ మీడియాలో సెటైర్లు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే ఆసిమ్ మునీర్ కు అపరిమిత అధికారాలను కట్టబెట్టిన సంగతి తెలిసిందే.



## ప్రపంచ స్టార్ అయినా స్వదేశంలో అడుగడుగునా భయం.. బుల్లెట్‌ప్రూఫ్ కారు వెనుక అసలు కథ చెప్పిన రషీద్ ఖాన్

- రషీద్ ఖాన్ కాబూల్ వీధుల్లో స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి
- భద్రత కోసం తప్పనిసరిగా బుల్లెట్‌ప్రూఫ్ కారు వినియోగం
- ఆఫ్ఘనిస్థాన్‌లో ఇది సాధారణ జీవన విధానమన్న రషీద్
- ప్రపంచ స్థాయి గుర్తింపు అతడిని హై-రిస్క్ టార్గెట్‌గా మార్చిన వైనం
- అన్ని ప్రమాదాల మధ్య కూడా దేశానికి గర్వంగా ప్రాతినిధ్యం

**అఖండ సూర్య, న్యూ ఢిల్లీ**

క్రికెట్‌లో ఒకసారి పేరు వస్తే జీవితం విలాసాలతో నిండిపోతుందని చాలామంది అనుకుంటారు. కానీ, ప్రపంచ క్రికెట్‌లో టాప్ స్పిన్నర్‌గా, ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందిన రషీద్ ఖాన్ జీవితం మాత్రం భిన్నంగా ఉంది. తన సెలబ్రిటీ హోదా విలాసాలను ఇవ్వలేదనీ, నిరంతర భద్రతా ఆందోళనలను మోస్తోందని తాజాగా వెల్లడించాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో రషీద్ ఖాన్ తన స్వదేశం ఆఫ్ఘనిస్థాన్‌లో ఎదుర్కొంటున్న కఠిన పరిస్థితులను వివరించాడు. కాబూల్ వీధుల్లో సాధారణ వ్యక్తిలా నడవలేని పరిస్థితి తనదని, భద్రత కోసం బుల్లెట్‌ప్రూఫ్ కారు తప్పనిసరిగా ఉపయోగించాల్సి వస్తోందని చెప్పాడు.

పీటర్సన్ "నువ్వు కాబూల్‌లో స్వేచ్ఛగా తిరగగలవా?" అని అడగగానే రషీద్ "లేదు" అని సూటిగా సమాధానం చెప్పాడు. "నాకు బుల్లెట్‌ప్రూఫ్ కారు ఉంది" అన్న రషీద్ మాటలు పీటర్సన్‌ను ఆశ్చర్యానికి గురి చేశాయి. ఎందుకని ప్రశ్నించగా, "భద్రత కోసమే. తగని స్థలంలో, తగని సమయంలో ఉండకూడదు. ఆఫ్ఘనిస్థాన్‌లో ఇది చాలా సాధారణమే" అని తెలిపాడు.

రషీద్‌కు ఆ కారు విలాసానికి ప్రతీక కాదు. అది అతని ప్రాణ రక్షణకు అవసరమైన సాధనం. రాజకీయ అస్థిరత, భద్రతా సమస్యలు కొనసాగుతున్న దేశంలో జీవించడం అతడిని ఎప్పుడూ అప్రమత్తంగా ఉంచుతోంది. అత్యంత గమనార్హమైన విషయం ఏమిటంటే, ఇలాంటి తీవ్రమైన భద్రతా చర్యలను రషీద్ సాధారణంగానే అంగీకరించడం. ఇది ఆఫ్ఘన్ ప్రజల నిత్య జీవన వాస్తవాన్ని ప్రతిబింబిస్తుంది. ఐపీఎల్, బీబీఎల్ వంటి అంతర్జాతీయ లీగ్‌లలో ఆడి ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకున్న రషీద్ ఖాన్, ఆఫ్ఘనిస్థాన్‌లోని సెలబ్రిటీల్లో ఒకడు. అదే అతడిని హైరిస్క్ టార్గెట్‌గా మార్చింది. అయినప్పటికీ అన్ని పరిమితుల మధ్య కూడా తన దేశానికి ప్రాతినిధ్యం వహించడం అనేది ఎప్పుడూ చాలా గర్వంగా ఉంటుందన్నాడు.



## టీమిండియా ప్రవర్తనపై పాక్ మాజీ కెప్టెన్ సంచలన వ్యాఖ్యలు

- అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో భారత్‌పై పాకిస్థాన్ భారీ విజయం
- 191 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించిన పాక్ జట్టు
- 13 ఏళ్ల తర్వాత రెండోసారి ఆసియా కప్ ట్రోఫీ సాధించిన పాకిస్థాన్
- భారత యువ జట్టు ప్రవర్తన క్రీడాస్ఫూర్తికి విరుద్ధమన్న సర్ఫరాజ్
- పాక్ డ్రెస్సింగ్ రూమ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్

**అఖండ సూర్య, న్యూ ఢిల్లీ**

అండర్19 ఆసియా కప్ ఫైనల్‌లో టీమిండియాకు ఘోర పరాభవం ఎదురైంది. ఆదివారం (డిసెంబర్ 21) జరిగిన తుది పోరులో పాకిస్థాన్ జట్టు భారత్‌పై 191 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో పాకిస్థాన్ 13 ఏళ్ల తర్వాత రెండోసారి అండర్19 ఆసియా కప్ ట్రోఫీని సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 347 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. పాక్ బ్యాట్స్‌మన్ సమీర్ మిన్హాస్ అద్భుత ప్రదర్శనతో మెరిశాడు. అతడు 113 బంతుల్లో 172 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్‌కు కీలక పాత్ర పోషించాడు.

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కెప్టెన్ ఆయుష్ మాత్రే నేతృత్వంలోని భారత అండర్19 జట్టు పూర్తిగా విఫలమైంది. పాక్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక 156 పరుగులకే ఆలౌట్ అయింది. ఇదిలా ఉండగా, మ్యాచ్ అనంతరం పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. భారత అండర్19 జట్టు ప్రవర్తన క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ఉందని ఆయన ఆరోపించారు. గతంలో క్రీడాస్ఫూర్తిని గౌరవించే భారత జట్లతో తాము ఆడామని, అయితే ఈ మ్యాచ్‌లో యువ ఆటగాళ్ల ప్రవర్తన నిరాశ కలిగించిందని తెలిపారు. మ్యాచ్ సమయంలో పాకిస్థాన్ డ్రెస్సింగ్ రూమ్ నుంచి వచ్చిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో సర్ఫరాజ్ తమ ఆటగాళ్లతో మాట్లాడుతూ.. "అజ్ఞానంతో ప్రవర్తించే వారిని చూసి మనం కూడా అలాగే ప్రవర్తించకూడదు. మర్యాదతోనే ఆట ఆడాలి" అని చెప్పినట్లు కనిపిస్తోంది. ఈ వ్యాఖ్యలు తానే చేసినవని సర్ఫరాజ్ అనంతరం మీడియా సమావేశంలో ధ్రువీకరించడం గమనార్హం.



## మహిళా క్రికెటర్లకు శుభవార్త.. దేశవాళీ మ్యాచ్ ఫీజులను రెట్టింపు చేసిన బీసీసీఐ

- సీనియర్ ఆటగాళ్లకు రోజుకు రూ.50,000-రూ.60,000 వరకు ఆదాయం
- అండర్-19, అండర్-23 మహిళా క్రికెటర్లకూ భారీ పెంపు
- అంపైర్లు, మ్యాచ్ రిఫరీలకు కూడా పెరిగిన పారితోషికం

**అఖండ సూర్య, న్యూ ఢిల్లీ**

భారత మహిళల క్రికెట్‌కు బీసీసీఐ పెద్ద ప్రోత్సాహం ఇచ్చింది. ఇటీవల భారత్ మహిళల జట్టు తొలి వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకున్న నేపథ్యంలో దేశవాళీ క్రికెట్‌లో మహిళా ఆటగాళ్లు, అధికారుల మ్యాచ్ ఫీజులను గణనీయంగా పెంచుతూ బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ భారీ పెంపునకు బోర్డు అత్యున్నత సంస్థ అయిన ఏపెక్స్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. దేశవాళీ క్రికెట్ వ్యవస్థలో మరింత న్యాయమైన వేతన నిర్మాణాన్ని తీసుకురావడమే దీని లక్ష్యం అని బీసీసీఐ స్పష్టం చేసింది. సవరించిన వేతనాల ప్రకారం సీనియర్ మహిళా దేశవాళీ క్రికెటర్లు ఇప్పుడు మ్యాచ్ లో ఒక్కో రోజుకు రూ.50,000 నుంచి రూ.60,000 వరకు సంపాదించనున్నారు. ఇది ఇప్పటివరకు లభిస్తున్న రూ.20,000 (రిజర్వ్‌లకు రూ.10,000)తో పోలిస్తే భారీ పెరుగుదల. వన్డేలు, బహుళ రోజుల టోర్నీల్లో ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉండే ఆటగాళ్లకు రోజుకు రూ.50,000 చెల్లించనుండగా, రిజర్వ్ ప్లేయర్లకు రూ.25,000 అందనుంది. జాతీయ స్థాయి టీ20 టోర్నీల్లో ప్లేయింగ్ ఎలెవన్ ఆటగాళ్లకు మ్యాచ్ రోజుకు రూ.25,000, రిజర్వ్‌లకు రూ.12,500 చెల్లిస్తారు. ఒక సీజన్‌లో అన్ని ఫార్మాట్లలో ఆడే అగ్రశ్రేణి మహిళా క్రికెటర్ ఇప్పుడు ఏడాదికి రూ.12 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు సంపాదించే అవకాశం ఉందని బీసీసీఐ అధికారులు తెలిపారు. మహిళా జూనియర్ క్రికెటర్లకూ ఈ పెంపు వర్తిస్తుంది. అండర్ 23, అండర్19 ఆటగాళ్లకు రోజుకు రూ.25,000, రిజర్వ్‌లకు రూ.12,500 చెల్లించనున్నారు. అంతేకాకుండా అంపైర్లు, మ్యాచ్ రిఫరీల పారితోషికాలు కూడా భారీగా పెరిగాయి. దేశవాళీ లీగ్ మ్యాచ్‌లకు రోజుకు రూ.40,000, నాకౌట్ మ్యాచ్‌లకు రూ.50,000 నుంచి రూ.60,000 వరకు చెల్లిస్తారు. ఈ నిర్ణయం మహిళా క్రికెటర్లకు ఆర్థిక భద్రత, ప్రోత్సాహం కల్పించడమే కాకుండా దేశవాళీ క్రికెట్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని బీసీసీఐ పేర్కొంది.

## క్రికెట్ కు గుడ్ బై చెప్పిన కృష్ణప్ప గౌతమ్

- అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన కృష్ణప్ప గౌతమ్
- భారత్ తరఫున ఒకే ఒక్క వన్డే ఆడిన కర్ణాటక ఆల్‌రౌండర్
- ఐపీఎల్ 2021లో అత్యంత ఖరీదైన అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా రికార్డ్
- కేపీఎల్‌లో ఒకే మ్యాచ్‌లో సెంచరీ, 8 వికెట్లతో అద్భుత ప్రదర్శన


**అఖండ సూర్య, న్యూ ఢిల్లీ**

భారత క్రికెటర్, కర్ణాటక ఆల్‌రౌండర్ కృష్ణప్ప గౌతమ్ తన ప్రొఫెషనల్ క్రికెట్ కెరీర్‌కు ముగింపు పలికాడు. సోమవారం అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. బెంగళూరులోని కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (KSCA) మీడియా లాంజ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈ నిర్ణయాన్ని వెల్లడించాడు. ఈ కార్యక్రమానికి కేఎస్‌సీఏ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు సుజిత్ సోమసుందర్, కార్యదర్శి సంతోష్ మీనన్ హాజరయ్యాడు

37 ఏళ్ల గౌతమ్, 2021 జూలై 23న శ్రీలంకపై తన ఏకైక అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఆడారు. ఆ మ్యాచ్‌లో వికెట్ కీపర్ మినోద్ భానుకను ఔట్ చేసి తన ఏకైక అంతర్జాతీయ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ద్వారా కృష్ణప్ప గౌతమ్ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాడు. ఐపీఎల్ 2021 వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ అతడిని రూ. 9.25 కోట్లకు కొనుగోలు చేయడంతో, అప్పటివరకు అత్యంత ఖరీదైన అన్‌క్యాప్డ్ భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. తన ఐపీఎల్ కెరీర్‌లో ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 2024 మే నెలలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచే ఐపీఎల్‌లో అతడి చివరి మ్యాచ్. ఐపీఎల్‌లో 36 మ్యాచ్‌లలో, ఈ ఫ్లెక్సిబుల్ బౌలింగ్ ఆల్‌రౌండర్ 247 రన్స్ స్కోర్ చేశాడు... అలాగే 21 వికెట్లు తీశాడు. దేశీయ క్రికెట్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేశాడు, 32 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 737 రన్స్ చేసి, 116 వికెట్లు సాధించాడు. లిస్ట్ ఎ మ్యాచ్‌లలో అతను 32 మ్యాచ్‌లలో 400 రన్స్ స్కోర్ చేసి, 51 వికెట్లు తీశాడు, అతని టీ20 కెరీర్‌లో 49 మ్యాచ్ లలో 454 రన్స్ మరియు 32 వికెట్లు సాధించాడు.

ముఖ్యంగా 2019 కర్ణాటక ప్రీమియర్ లీగ్‌లో బళ్లారి టస్కర్స్ తరఫున ఆడుతూ ఒకే మ్యాచ్‌లో 56 బంతుల్లో 134 పరుగులు చేసి, ఆ తర్వాత బౌలింగ్‌లో 15 పరుగులకే 8 వికెట్లు పడగొట్టి చరిత్ర సృష్టించాడు. ఈ అసాధారణ ప్రదర్శన అతని కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది.





# భారత్‌న్యూజిలాండ్ వాణిజ్య ఒప్పందంపై ఆ దేశ విదేశాంగ మంత్రి తిరుగుబాటు

- **భారత్-న్యూజిలాండ్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం**
- **ఇది న్యూజిలాండ్‌కు తీవ్ర నష్టం చేకూరుస్తుందన్న విదేశాంగ మంత్రి విన్‌స్టన్ పీటర్స్**
- **తమ డెయిరీ ఉత్పత్తులపై భారత్ సుంకాలు తగ్గించలేదని ఆరోపణ**
- **ఒప్పందాన్ని చారిత్రక మైలురాయిగా అభివర్ణించిన మోదీ**

**అఖండ సూర్య :**

భారత్, న్యూజిలాండ్ మధ్య ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA)పై న్యూజిలాండ్ ప్రభుత్వంలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దేశ విదేశాంగ మంత్రి విన్‌స్టన్ పీటర్స్ ఈ ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శిస్తూ ఇది 'స్వేచ్ఛాయుతమైనది కాదు.. నిష్పాక్షికమైనది అసలే కాదు' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది న్యూజిలాండ్‌కు తీవ్ర నష్టం చేకూర్చే 'బ్యాడ్ డీల్' అని ఆయన అభివర్ణించారు.

న్యూజిలాండ్ ఫస్ట్ పార్టీ అధినేతగా, సంకీర్ణ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న పీటర్స్ ఈ ఒప్పందంపై ఎక్స్ వేదికగా తన అసహనాన్ని వ్యక్తం చేశారు. న్యూజిలాండ్ ప్రధాన ఎగుమతి రంగమైన డెయిరీ (పాలు, వెన్న, చీజ్) ఉత్పత్తులపై భారత్ ఎటువంటి సుంకాలు తగ్గించలేదని, దీనివల్ల తమ రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. డైరీ ఉత్పత్తులు లేని మొదటి వాణిజ్య ఒప్పందం ఇదేనని మండిపడ్డారు. ఈ ఒప్పందం ద్వారా భారతీయ కార్మికులు, విద్యార్థుల వలసలకు న్యూజిలాండ్ భారీగా రాయితీలు ఇచ్చిందని, ఇది తమ దేశ నిరుద్యోగులపై ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు.

**ప్రధానుల హర్షం.. మంత్రి అసంతృప్తి**

న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ మాత్రం ఈ ఒప్పందాన్ని సమర్థించారు. భారత్ లాంటి వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థతో జతకట్టడం వల్ల తమ దేశానికి భారీగా ఉద్యోగాలు, వృద్ధి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అటు భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ ఒప్పందాన్ని ఒక 'చారిత్రాత్మక మైలురాయి'గా అభివర్ణించారు. కేవలం 9 నెలల్లోనే ఈ చర్చలు ముగియడం విశేషమని, రాబోయే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు అవుతుందని మోదీ పేర్కొన్నారు.

**త్వరపడి తప్పు చేశారు!**

న్యూజిలాండ్ విదేశాంగ మంత్రి పీటర్స్ మాత్రం తన ప్రభుత్వంపైనే విమర్శలు గుప్పించారు. ''మంచి ఒప్పందం కోసం మరికొంత కాలం వేచి చూడాలని మేము కోరినా, మా సంకీర్ణ భాగస్వామి (నేషనల్ పార్టీ) వినకుండా హడావుడిగా తక్కువ నాణ్యత గల ఒప్పందాన్ని కుదుర్చుకుంది'' అని ఆయన ఆరోపించారు. అయితే, తన వ్యతిరేకత కేవలం ఒప్పందంలోని అంశాలపైనే తప్ప, భారత్ దేశంపై కాదని పీటర్స్ స్పష్టం చేశారు. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పట్ల తనకు గౌరవం ఉందని, తమ మధ్య ఉన్నది కేవలం అభిప్రాయభేదమేనని ఆయన వివరించారు. భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని, కానీ తమ దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి కాదని ఆయన తేల్చి చెప్పారు.

భారత్ తన రైతుల ప్రయోజనాల దృష్ట్యా డైరీ, సుగంధ ద్రవ్యాలు, వంట నూనెలు వంటి సున్నితమైన రంగాలను ఈ ఒప్పందం నుంచి మినహాయించింది. ఈ నేపథ్యంలో, న్యూజిలాండ్ ప్రభుత్వంలోని ఈ అంతర్గత విభేదాలు భవిష్యత్తులో ఈ ఒప్పందం అమలుపై ఎటువంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

# మంగోలియా సరిహద్దులో 100 ఖండాంతర క్షిపణులను మోహరించిన చైనా

- **మంగోలియా సరిహద్దులో 100కి పైగా ఐసీబీఎంలు మోహరించిన చైనా**
- **పెంటగాన్ ముసాయిదా నివేదికలో వెల్లడైన కీలక విషయాలు**
- **2030 నాటికి వెయ్యికి పైగా అణ్వస్త్రాలు సమకూర్చుకునే యత్నం**
- **అణ్వస్త్ర నియంత్రణ చర్చలపై చైనా ఆసక్తి చూపడం లేదని వెల్లడి**
- **ఇవన్నీ తమపై దుష్ప్రచారమేనంటున్న డ్రాగన్ ప్రభుత్వం**

**అఖండ సూర్య :**

అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన రేకెత్తించే రీతిలో చైనా తన అణ్వాయుధ సామర్థ్యాన్ని శరవేగంగా విస్తరిస్తోంది. మంగోలియా సరిహద్దుకు సమీపంలో కొత్తగా నిర్మించిన మూడు క్షిపణి క్షేత్రాలలో (సైలో ఫీల్డ్స్) 100కి పైగా ఘన ఇంధన ఆధారిత డీఎఫ్31 (DF31) ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను (ICBMs) చైనా మోహరించినట్లు అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ రూపొందించిన ఒక ముసాయిదా నివేదిక వెల్లడించింది. గతంలో ఈ సైలో క్షేత్రాల నిర్మాణం గురించి పెంటగాన్ ప్రస్తావించినప్పటికీ, వాటిలో క్షిపణులను లోడ్ చేశారన్న విషయాన్ని బయటపెట్టడం ఇదే తొలిసారి.

పెంటగాన్ నివేదిక ప్రకారం, చైనా తన అణు ఆయుధాగారాన్ని ఇతర అణ్వస్త్ర దేశాల కంటే వేగంగా విస్తరిస్తోంది, ఆధునికీకరిస్తోంది. 2024 నాటికి చైనా వద్ద సుమారు 600 అణు వార్‌హెడ్‌లు ఉండగా, 2030 నాటికి ఆ సంఖ్య 1,000 దాటుతుందని అంచనా వేస్తున్నారు. ఈ క్షిపణి క్షేత్రాలను పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ నిర్వహిస్తోంది. డీఎఫ్31 క్షిపణులు దాదాపు 11,700 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలవు. అణ్వాయుధాల నియంత్రణకు సంబంధించిన చర్చల విషయంలో చైనా ఏమాత్రం ఆసక్తి చూపడం లేదని ఈ నివేదిక స్పష్టం చేసింది. "ఈ తరహా చర్యలు లేదా సమగ్ర అణ్వస్త్ర నియంత్రణ చర్చలు జరిపేందుకు బీజింగ్ వైపు నుంచి ఎలాంటి ఆసక్తి కనిపించడం లేదు," అని నివేదికలో పేర్కొన్నారు. 2026 ప్రారంభంలో అమెరికా-రష్యాల మధ్య ఉన్న 'న్యూ స్టార్ట్' అణు ఒప్పందం ముగియనున్న నేపథ్యంలో చైనా విస్తరణ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల నవంబర్ 22న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. చైనా, రష్యాలతో నిరాయుధీకరణ చర్చలు జరిపే అవకాశం ఉందని సూచించడం గమనార్హం. అయితే, తమ అణ్వాయుధాల విస్తరణపై వస్తున్న ఈ నివేదికలను చైనా మొదటి నుంచి ఖండిస్తోంది. "ఇదంతా చైనాను అప్రతిష్టపాలు చేయడానికి, అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించడానికి చేస్తున్న దుష్ప్రచారమే," అని చైనా అధికారులు గతంలో పలుమార్లు ఆరోపించారు. ప్రస్తుతానికి ఇది ముసాయిదా నివేదిక మాత్రమేనని, అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించే ముందు ఇందులో మార్పులు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ తాజా నివేదికపై వ్యాఖ్యానించేందుకు పెంటగాన్, చైనా రాయబార కార్యాలయ అధికారులు వెంటనే నిరాకరించారు.




# భారత నిపుణులకు గట్టి దెబ్బ.. హెచ్-1బీ వీసా ఇంటర్వ్యూల రద్దుతో పెరుగుతున్న అనిశ్చితి

- **హెచ్-1బీ, హెచ్-4 వీసాలకు సోషల్ మీడియా వెట్టింగ్‌ను విస్తరించిన అమెరికా**
- **ఈ నెల 15 నుంచి ప్రపంచవ్యాప్తంగా కొత్త స్క్రీనింగ్ అమలు**
- **భారత్‌లో వేలాది వీసా ఇంటర్వ్యూలు నెలల పాటు వాయిదా**
- **భారత ఐటీ నిపుణులు, వైద్యులపై తీవ్ర ప్రభావం**

**అఖండ సూర్య :**

హెచ్1బీ, హెచ్4 వీసాల కోసం దరఖాస్తు చేసుకునే వారిపై అమెరికా ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకుంటోంది. ప్రామాణిక వీసా స్క్రీనింగ్‌లో భాగంగా ఆన్‌లైన్ ప్రెజెన్స్ (సోషల్ మీడియా) పరిశీలన (వెట్టింగ్)ను అన్ని హెచ్1బీ, హెచ్4 వీసాల దరఖాస్తుదారులకు విస్తరించినట్లు అమెరికా ప్రకటించింది. ఈ వెట్టింగ్ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల పౌరులకు వర్తిస్తుందని భారతదేశంలోని అమెరికా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది.

ఈ నెల 15 నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చిందని, దీంతో ఈ వీసా కేటగిరీలకు సంబంధించి అదనపు ప్రాసెసింగ్ సమయం పట్టే అవకాశముందని ఎంబసీ తెలిపింది. దరఖాస్తుదారులు వీలైనంత త్వరగా అప్లై చేసుకోవాలని సూచించింది. ఈ ప్రకటన వెలువడిన సమయంలోనే భారత్‌లో ఈ నెలాఖరులో జరగాల్సిన వేలాది హెచ్1బీ వీసా ఇంటర్వ్యూలను అకస్మాత్తుగా పలు నెలల పాటు వాయిదా వేయడం తీవ్ర ఆందోళనకు దారి తీసింది. అమెరికా టెక్నాలజీ కంపెనీలు విస్తృతంగా వినియోగించే హెచ్1బీ వీసా కార్యక్రమంలో భారతీయ నిపుణులు ప్రత్యేకంగా ఐటీ ఉద్యోగులు, వైద్యులు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. అయితే హెచ్1బీ ప్రోగ్రామ్ దుర్వినియోగాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని అమెరికా అధికారులు చెబుతున్నారు. అత్యుత్తమ విదేశీ ప్రతిభను నియమించుకునే అవకాశాన్ని కొనసాగిస్తూనే, అక్రమాలు జరగకుండా చూడాలన్నదే తమ ఉద్దేశమని ఎంబసీ వివరించింది. కొత్త వెట్టింగ్ కారణంగా ఇప్పటికే షెడ్యూల్ చేసిన ఇంటర్వ్యూలు భారీగా రద్దు అయ్యాయి. ఈ నెల 15న ఇంటర్వ్యూ ఉన్న వారికి మార్చిలో కొత్త తేదీలు ఇవ్వగా, 19న అపాయింట్‌మెంట్ ఉన్నవారికి మే చివరి వరకు వాయిదా వేశారు. దీంతో ఇప్పటికే భారత్‌కు వచ్చిన అనేక మంది ఉద్యోగులు వీసా లేక అమెరికాకు తిరిగి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే... అమెరికా వీసా 'ఒక హక్కు కాదని, అది ఒక ప్రత్యేక హోదా' (ప్రివిలేజ్) మాత్రమేనని ఎంబసీ పలు సందర్భాల్లో స్పష్టం చేసింది. వీసా జారీ అయిన తర్వాత కూడా స్క్రీనింగ్ కొనసాగుతుందని, చట్టాన్ని ఉల్లంఘిస్తే వీసా రద్దు చేస్తామని హెచ్చరించింది. రాజ్యసభలో కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ కూడా ప్రతి వీసా నిర్ణయం జాతీయ భద్రతకు సంబంధించినదేనని అమెరికా స్పష్టం చేసినట్లు తెలిపారు.





# భారత్– బంగ్లాల మధ్య ఉద్రిక్తతల వేళ రష్యా కీలక వ్యాఖ్యలు

- **బంగ్లాదేశ్ స్వాతంత్ర్యోద్యమంలో భారత్ పాత్రను గుర్తు చేసుకోవాలని హితవు**
- **సాధ్యమైనంత త్వరగా భారతదేశంతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలని సూచన**
- **ఇరు దేశాల మధ్య స్థిరత్వం కోసం వైరాన్ని వీడాలన్న రష్యా రాయబారి**

**అఖండ సూర్య :**

భారత్ బంగ్లాదేశ్ ల మధ్య ఇటీవల ఉద్రిక్తతలు పెరిగిన విషయం విదితమే. అంతర్గత అశాంతితో పాటు ఇటీవలి రాజకీయ పరిణామాల నేపథ్యంలో భారత్ కు బంగ్లాదేశ్ దూరమవుతోంది. భారత్ పట్ల శత్రుభావంతో వ్యవహరిస్తోంది. ఇరుదేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ లోని రష్యా రాయబారి అలెగ్జాండర్ గ్రిగొరివిచ్ ఖోజిన్ తాజాగా కీలక వ్యాఖ్యలు [illegible]

బంగ్లాదేశ్ కు హితవు పలికారు. వైరాన్ని వీడి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని సూచించారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటంలో భారత్ పాత్రను గుర్తు చేసుకోవాలని చెప్పారు. ఢాకాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఖోజిన్ మాట్లాడుతూ.. ''భారత్ తో ఉద్రిక్తతలను ఎంత త్వరగా తగ్గించుకుంటే అంత మంచిది. 1971 లో బంగ్లాదేశ్ కు స్వాతంత్ర్యం వచ్చిందంటే కారణం భారతదేశం చేసిన సాయమేననే విషయం మర్చిపోవద్దు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి అవసరమైన సాయం చేసేందుకు రష్యా సిద్ధంగా ఉంది. భారత్, బంగ్లాదేశ్, రష్యా.. మూడు దేశాలు కలిసి పనిచేస్తూ అభివృద్ధి సాధించాలి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించుకోవడం ఆసియా ప్రాంతంలో స్థిరత్వానికి దోహదపడుతుంది'' అని వ్యాఖ్యానించారు. అదేసమయంలో భారత్, బంగ్లాదేశ్ ల ద్వైపాక్షిక సంబంధాల్లో రష్యా తలదూర్చాలని అనుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఇరు దేశాల మధ్య ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతలు మరింత పెరగకూడదని రష్యా భావిస్తోందని, అవసరమైన పక్షంలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు ముందుకు రావడానికి సిద్ధమని ఖోజిన్ స్పష్టం చేశారు.




## భారత హైకమిషనర్‌ను పిలిపించుకున్న బంగ్లాదేశ్ ప్రభుత్వం

- **భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మను పిలిపించుకున్న బంగ్లాదేశ్**
- **భారత్‌లోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాల భద్రతపై ఆందోళన**
- **ఢిల్లీ, కోల్‌కతాలో భద్రతా పరిస్థితులపై చర్చ**
- **దౌత్య సిబ్బంది రక్షణకు చర్యలు కోరిన బంగ్లాదేశ్**

**అఖండ సూర్య :**

భారత్‌లో ఉన్న బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాల భద్రతపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక దౌత్య చర్యకు దిగింది. మంగళవారం బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మను పిలిపించుకుంది. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి ఆసద్ ఆలం సియాం ధృవీకరించారు.

ఢిల్లీ, కోల్‌కతా సహా భారత్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాల చుట్టూ ఇటీవల ఏర్పడిన పరిస్థితులే ఈ సమావేశానికి కారణమని దౌత్య వర్గాలు వెల్లడించాయి. భారత్‌లో చోటుచేసుకున్న నిరసనలు, ఆందోళనలు బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాల భద్రతపై ప్రభావం చూపవచ్చన్న భయం వ్యక్తమవుతోంది. ఈ భేటీలో బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాల భద్రతను కట్టుదిట్టంగా నిర్వహించాల్సిన అవసరాన్ని బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత్‌కు స్పష్టం చేసినట్లు సమాచారం. దౌత్య సిబ్బంది రక్షణతో పాటు కార్యాలయాల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది.



# బహిరంగ సభలో భార్య లోదుస్తుల గురించి ప్రస్తావించిన ట్రంప్!

- **నార్త్ కరోలినా ర్యాలీలో మెలానియా అండర్ గార్మెంట్స్ గురించి ట్రంప్ వ్యాఖ్యలు**
- **రాజకీయ ప్రసంగం మధ్యలో ఈ వ్యాఖ్యలు చేయడంతో అందరూ షాక్**
- **తనపై జరుగుతున్న విచారణలు అన్యాయమని చెప్పే క్రమంలో నోరు జారిన అధ్యక్షుడు**

**అఖండ సూర్య :**

రాజకీయ సభల్లో ప్రత్యర్థులపై విరుచుకుపడటం డొనాల్డ్ ట్రంప్‌కు అలవాటే. కానీ, తాజాగా నార్త్ కరోలినాలో జరిగిన ర్యాలీలో ఆయన తన భార్య మెలానియా ట్రంప్ లోదుస్తుల గురించి మాట్లాడి అందరినీ విస్మయానికి గురిచేశారు. రాజకీయ ప్రసంగం మధ్యలో అకస్మాత్తుగా ఈ వ్యక్తిగత విషయాలను ప్రస్తావించడంతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. 2022 ఆగస్టులో ఫ్లోరిడాలోని ట్రంప్ నివాసం 'మార్‌ఎలాగో'పై ఎఫ్‌బీఐ జరిపిన సోదాల గురించి ఆయన ఈ సభలో ప్రస్తావించారు. ఆ సమయంలో ఫెడరల్ ఏజెంట్లు తన భార్య మెలానియా క్లోసెట్ (అలమర) మొత్తాన్ని గాలించారని ట్రంప్ ఆరోపించారు. ''ఏజెంట్లు ఆమె సామాన్లన్నీ వెతికారు. అక్కడ ఆమె లోదుస్తులు చాలా పద్ధతిగా, పర్ఫెక్ట్‌గా మడతపెట్టి ఉన్నాయి. బహుశా ఆమె వాటిని ఐరన్ చేస్తారనుకుంటా" అంటూ వ్యాఖ్యానించారు. తనపై జరుగుతున్న విచారణలు అన్యాయమని చెప్పే క్రమంలో ట్రంప్ ఈ వింత పోలికలను వాడటం గమనార్హం.

అదే సభలో ట్రంప్ అమెరికా ఆర్థిక వ్యవస్థపై కూడా మాట్లాడారు. తమ హయాంలో ద్రవ్యోల్బణం తగ్గిందని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించి ఉద్యోగ కల్పనలో రికార్డు సృష్టించామని చెప్పుకొచ్చారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడానికి, సామాన్యుడిపై భారం తగ్గించడానికి తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. అలాగే మందుల ధరలను తగ్గించడంపై కూడా దృష్టి సారించామన్నారు. నార్త్ కరోలినాలోని ఫర్నిచర్ పరిశ్రమను కాపాడటానికి విదేశీ వస్తువులపై సుంకాలను విధించడాన్ని ట్రంప్ సమర్థించుకున్నారు. అమెరికా తయారీ రంగాన్ని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని, ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడటం తగ్గించాలని ఆయన పిలుపునిచ్చారు. ముందున్న 2026 మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థులను గెలిపించాలని ట్రంప్ ఓటర్లను కోరారు. నార్త్ కరోలినాలో రిపబ్లికన్ పార్టీ పట్టు సాధించాలని, దానికి మద్దతుదారులు సిద్ధంగా ఉండాలని ఆయన ఉత్సాహపరిచారు. రాజకీయ అంశాల కంటే కూడా మెలానియా వ్యక్తిగత వస్తువులపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలే ఇప్పుడు అంతర్జాతీయ మీడియాలో హైలైట్ అవుతున్నాయి.



# ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్ క్లింటన్ ఫొటోలపై ట్రంప్ ఏమన్నారంటే..!

- **ఎప్‌స్టీన్ ఫైళ్ల వల్ల నిరపరాధుల ప్రతిష్ఠ దెబ్బతింటుందని ట్రంప్ వ్యాఖ్య**
- **ఇది రిపబ్లికన్ విజయాల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నమని ఆరోపణ**
- **బిల్ క్లింటన్ ఫొటోల విడుదలపై ట్రంప్ అసంతృప్తి**
- **ఫొటోలో కనిపించడమే నేరంగా మారుతోందని విమర్శ**


**అఖండ సూర్య :**

లైంగిక నేరాల కేసులో దోషిగా తేలిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన దర్యాప్తు ఫైళ్ల విడుదలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఎప్‌స్టీన్‌ను కలిసిన అనేక మంది ప్రముఖుల ప్రతిష్ఠ ఈ ఫైళ్ల వల్ల దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. శుక్రవారం నుంచి అమెరికా న్యాయశాఖ ఈ ఫైళ్లను విడుదల చేయడం ప్రారంభించిన నేపథ్యంలో ట్రంప్ తొలిసారి స్పందించారు. మార్‌ఎలాగోలో మీడియాతో మాట్లాడిన ట్రంప్.. "ఈ ఎప్‌స్టీన్ వ్యవహారం రిపబ్లికన్ పార్టీ సాధించిన గొప్ప విజయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న ప్రయత్నం" అని వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని అనవసరంగా పెద్దదిగా చేస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. మొదటి విడత ఫొటోలలో మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ కనిపించడంపై స్పందించిన ట్రంప్, "నాకు బిల్ క్లింటన్ అంటే ఇష్టం. ఆయనతో ఎప్పుడూ మంచి సంబంధాలే ఉన్నాయి. ఆయన ఫొటోలు బయటకు రావడం బాధాకరం" అన్నారు. తానూ ఎప్‌స్టీన్‌తో ఉన్న ఫొటోలలో కనిపించానని, ఆ కాలంలో చాలా మంది అతనితో స్నేహంగా మెలిగారని ట్రంప్ స్పష్టం చేశారు. ఎప్‌స్టీన్‌తో నిజంగా సంబంధం లేని, కేవలం పార్టీల్లో కలిసిన బ్యాంకర్లు, న్యాయవాదులు వంటి గౌరవనీయుల ఫొటోలు బయటకు రావడం వల్ల వారి ప్రతిష్ఠ నాశనం అవుతోందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఒక ఫొటోలో కనిపించడమే నేరమా? దీని వల్ల అనవసరంగా చాలా మంది బాధపడుతున్నారు" అని ఆయన అన్నారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ 2019లో లైంగిక అక్రమ రవాణా కేసులో విచారణ కొనసాగుతున్న సమయంలోనే న్యూయార్క్ జైలులో మృతి చెందాడు. అది ఆత్మహత్యగా అధికారులు నిర్ధారించారు. అయితే, అతనితో సంబంధాలు ఉన్న ప్రముఖులపై ఇప్పటికీ వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి.



# 'కన్నెపెట్టరో.. కన్నుకొట్టరో' ఇప్పుడిదొక ట్రెండ్ సెట్టర్..

ఇటీవల సోషల్ మీడియాలోనే కాదు, సినీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా నిలిచిన టీజర్ 'డెకాయిట్'. అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. మృణాల్ ఠాకూర్ కథానాయిక. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల టీజర్‌ను విడుదల చేయగా, విశేష స్పందన లభించింది. ముఖ్యంగా టీజర్ బ్యాక్‌గ్రౌండ్‌లో నాగార్జున నటించిన 'హలో బ్రదర్'లోని 'కన్నె పెట్టరో కన్ను కొట్టరో' సాంగ్‌ను వాడుకుంటూ ఎడిట్ చేసిన విధానం మెప్పించింది. గ్యానీ దాన్ని రీమిక్స్ చేయగా, కోదాటి పవన్ కల్యాణ్ ఎడిటింగ్ చేశారు. టీజర్ కట్‌ను ప్రశంసిస్తూ కామెంట్లు వెల్లువెత్తాయి. ఇప్పటివరకూ ఈ టీజర్‌ను 18 మిలియన్ల మంది వీక్షించారు. 'డెకాయిట్'లో వాడిన 'కన్నె పెట్టరో..' సాంగ్ రీమిక్స్‌ను వాడుకుంటూ నాగార్జున అభిమాని ఒకరు టీజర్‌ను కట్ చేశారు. కేవలం నాగార్జున నటించిన సినిమాల్లోని సన్నివేశాలను తీసుకుని, దాన్ని తీర్చిదిద్దారు. తాజాగా ఆ వీడియోను నాగ్ తనయుడు, నటుడు నాగచైతన్య పంచుకుంటూ 'దిస్ ఈజ్ కిల్లర్.. సూపర్ ఎడిట్' అంటూ కితాబిచ్చారు. ఇంకెందుకు ఆలస్యం 'డెకాయిట్'.. నాగార్జున వెర్షన్ టీజర్ రెండూ మీరు చూసేయండి.



# ఎఐతో పెళ్లి వీడియో

**అభిమానులను ఆట పట్టించిన జగపతిబాబు**



టాలీవుడ్‌లో శోభన్ బాబు తర్వాత అంతటి ఫ్యామిలీ హీరో ఇమేజ్ సంపాదించుకున్న నటుడు జగపతి బాబు. వరుస సూపర్ హిట్ చిత్రాలతో మహిళా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఆయన, సెకండ్ ఇన్నింగ్స్‌లో విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఊహించని స్థాయిలో సత్తా చాటుతున్నారు. అలాంటి సీనియర్ హీరో తాజాగా తన ఇంట్లో ఒక పెద్ద శుభకార్యం జరిగిందంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తన రెండో కూతురి పెళ్లి జరిగిపోయిందంటూ జగపతి బాబు షేర్ చేసిన వీడియో నెట్టింట వేగంగా వైరల్ అయింది. సాధారణంగా సెలబ్రిటీల ఇంట్లో పెళ్లి అంటే భారీ ఏర్పాట్లు, ఆర్భాటం ఉంటాయి. కానీ జగపతి బాబు మాత్రం చాలా సింపుల్‌గా మా రెండో అమ్మాయి పెళ్లయిపోయిందోచ్ అంటూ వీడియోను షేర్ చేయడంతో అభిమానులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. నిజంగానే పెళ్లి జరిగిందా? లేక సరదాగా చేసిన పోస్టా? అన్న సందేహాలు నెటిజన్లలో మొదలయ్యాయి. ఈ సస్పెన్స్‌కు క్లారిటీ వచ్చింది. జగపతి బాబు షేర్ చేసిన వీడియో అసలు నిజమైన పెళ్లి వీడియో కాదు. అది పూర్తిగా ఏఐ టెక్నాలజీతో రూపొందించిన క్రియేటివ్ కంటెంట్ అని తేలింది. టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందిందో చూపించడమే కాకుండా, తన అభిమానులను సరదాగా ఆటపట్టించాలన్న ఉద్దేశంతోనే ఈ వీడియోను షేర్ చేసినట్లు తెలుస్తోంది. జగపతి బాబు ఇప్పటికే తన పెద్ద కూతురు పెళ్లిని చాలా నిరాడంబరంగా, విదేశీయుడితో జరిపించిన విషయం తెలిసిందే. అలాగే తన పిల్లల విషయంలో ఆయన ఎంతో స్వేచ్ఛనిచ్చే తండ్రిగా కూడా పేరుంది. గతంలో ఇచ్చిన పలు ఇంటర్వ్యూల్లో తన రెండో కుమార్తెకు పెళ్లి చేసుకోవాలన్న ఆసక్తి లేదని, అది పూర్తిగా ఆమె వ్యక్తిగత నిర్ణయమని ఆయన స్పష్టంగా చెప్పారు. 'నా పిల్లలు ఏం చేయాలనుకుంటారో అది వారి ఇష్టం. పెళ్లి అనేది వారి ఛాయిస్. నేను ఎప్పుడూ ఒత్తిడి చేయను' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో ప్రశంసలు అందుకున్నాయి.మొత్తానికి పెళ్లి కబురు అనుకుని సంబరపడ్డ అభిమానులకు ఇది ఒక స్వీట్ షాక్‌గా మారింది.


# రవిబాబు మరో ఆసక్తికర సినిమా

క్రియేటివ్ డైరెక్టర్ రవిబాబు మరోసారి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచే ప్రకటన చేశారు. ఇటీవల ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'ఏనుగు తొండం ఘటికాచలం' సినిమా థియేటర్లకు కాకుండా నేరుగా ఈటీవీ విన్ ఓటీటీలో విడుదలైన విషయం తెలిసిందే. ఆ సినిమా తర్వాత ఇప్పుడు రవిబాబు తన కొత్త ప్రాజెక్ట్‌ను అధికారికంగా అనౌన్స్ చేస్తూ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు. తాజాగా ఈ కొత్త సినిమాకు సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఆ పోస్టర్ చూడగానే ఇది సాధారణ సినిమాకాదు, పూర్తిగా భిన్నమైన కథతో రూపొందుతున్న సినిమా అనే ఫీలింగ్ కలుగుతోంది. వింతగా, మిస్టీరియస్‌గా ఉన్న పోస్టర్ సినిమా క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో ఉండబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. రవిబాబు స్టైల్‌కు తగ్గట్టుగా ఈ సినిమా కూడా కొత్త ఆలోచనలతో ప్రేక్షకులను ఆశ్చర్యపరచనుందనే అంచనాలు మొదలయ్యాయి. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను బుధవారం ఉదయం 10:30 గంటలకు వెల్లడిరచనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సినిమా టైటిల్‌తో పాటు నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను ఒకేసారి బయటపెట్టనున్నారు. దీంతో రవిబాబు అభిమానులతో పాటు సినీ వర్గాల్లో కూడా ఈ అప్డేట్ కోసం ఆసక్తి నెలకొంది.ఈ ప్రాజెక్ట్‌ను ఫ్లయింగ్ ఫ్రాగ్స్ సంస్థ, సురేష్ ప్రొడక్షన్స్ కలిసి నిర్మిస్తున్నాయి. ఈ రెండు ప్రతిష్ఠాత్మక బ్యానర్లు ఒకే ప్రాజెక్ట్ కోసం చేతులు కలపడం సినిమాపై మరింత నమ్మకాన్ని పెంచుతోంది. కంటెంట్‌కు పెద్దపీట వేసే ఈ బ్యానర్ల నుంచి ఒక నాణ్యమైన సినిమా రాబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు డిఫరెంట్ కాన్సెప్ట్స్, వినూత్న కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రవిబాబు, ఈసారి కూడా అదే స్థాయిలో ఒక కొత్త క్రైమ్ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారని తెలుస్తోంది.



# ఆటకు మళ్లీ సిద్ధం

"నేరస్థుడు, హంతకుడు, మోసగాడు, హీరో, తండ్రి, అమాయకుడు.. ఇలా ప్రపంచం నన్ను అనేక పేర్లతో పిలుస్తుంది. కానీ నాకు వాటితో అవసరం లేద"ని అంటున్నారు అజయ్ దేవగణ్. మరి ఆయనను పలు పేర్లతో పిలవడానికి కారణమేంటో తెలుసుకోవాలంటే 'దృశ్యం 3' చూడాల్సిందే. ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న 'దృశ్యం' ఫ్రాంచైజీలో రాబోతున్న చివరి భాగమిది. అభిషేక్ పాఠక్ తెరకెక్కిస్తున్నారు. శ్రియ, టబు, రజత్ కపూర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను వచ్చే ఏడాది అక్టోబరు 2న విడుదల చేస్తున్నట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం. ఈ వీడియోలో "కథ ఇంకా ముగియలేదు.. ఆట తిరిగి ప్రారంభం కానుంది" అంటూ అజయ్ చెప్పిన సంభాషణలు ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుగుతోందని, త్వరలో ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.



# సమంతతో వర్క్ చేయడం చాలా ఈజీ

సమంత అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో సమంత సరసన బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య నటిస్తున్నారు. తాజాగా ఆయన ఒక ఇంటర్వ్యూలో ఆమెతో కలిసి వర్క్ చేయడం గురించి మాట్లాడారు. "ఈ చిత్రంలో మా ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ బాగుంటుంది. ఆమె దీనికి నిర్మాత అయినప్పటికీ సెట్‌లో ఎప్పుడూ నటిగానే వ్యవహరిస్తారు. దీని షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. ఇంకా చాలా ఉంది. సమంతతో వర్క్ చేయడం చాలా సులభం. ఈ సినిమా టీమ్‌ను ఎప్పటికీ మర్చిపోలేను" అని గుల్షన్ తెలిపారు. సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై 'మా ఇంటి బంగారం' రూపొందుతోంది. 'ఓ బేబీ' విజయం తర్వాత నందిని రెడ్డి సమంత కలయికలో వస్తున్న చిత్రమిది. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో సమంత మునుపెన్నడూ చూడని లుక్‌లో కనిపించనుందని చిత్రవర్గాలు తెలిపాయి.



# హీరోయిన్ల డ్రెస్సింగ్‌పై శివాజీ వ్యాఖ్యలు

**దుమారం రేపుతున్న నటుడి కామెంట్స్**

హీరోయిన్‌ల అందం వాళ్లు వేసుకునే డ్రెస్‌లలో ఉంటుందని నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. నిండుగా దుస్తులు వేసుకుంటేనే గౌరవం ఉంటుందన్న ఆయన వ్యాఖ్యలపై పలువురు సెలబ్రిటీలు మండిపడుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'దండోరా' ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఏర్పాటుచేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శివాజీ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఈవెంట్‌లో యాంకర్ డ్రెస్ సెన్స్ బాగుందని చెప్పిన శివాజీ హీరోయిన్‌ల దుస్తుల గురించి మాట్లాడారు. నటీమణులు కొంచెం డ్రెస్ సెన్స్ పాటించాలి. ఇలా చెబుతున్నందుకు ఏమనుకోవద్దు. మీ అందం మొత్తం నిండుగా వేసుకొనే దుస్తుల్లోనే ఉంటుంది. ఫ్యాషన్ దుస్తులు వేసుకున్నప్పుడు అందరూ బాగున్నాయనే అంటారు. కానీ, లోపల తిట్టుకుంటారు. స్త్రీ అంటే ప్రకృతి. ఎంత అందంగా ఉంటే అంత గౌరవం పెరుగుతుంది మా అమ్మ.. అంటే నటి సావిత్రి ఇప్పటికీ నిండైన రూపంతో గుండెల్లో కనబడుతూ ఉంటుంది. అప్పట్లో సౌందర్య ఈ జనరేషన్‌లో రష్మిక చక్కగా ఉంటారు. గ్లామర్ ఉండాలి.. కానీ దానికి ఒక హద్దు ఉండాలి. స్వేచ్ఛ అనేది అదృష్టం. దాన్ని కోల్పోవద్దు. ప్రపంచ వేదికలపై కూడా చీర కట్టులో వచ్చినవారికే విశ్వసుందరి కిరీటాలు వచ్చాయని శివాజీ అన్నారు. అయితే ఆయన వ్యాఖ్యలు దుమారాం రేపాయి. డ్రెస్సుల గురించి చులకనగా మాట్లాడారని మండిపడుతున్నారు. ఆయన మాట్లాడుతూ నేటితరం హీరోయిన్ల గ్లామర్ ప్రదర్శనపై ఘాటు విమర్శలు చేశారు. 'స్త్రీ అందం చీరకట్టులో, ఒళ్లు కనిపించకుండా వేసుకునే బట్టల్లోనే ఉంటుంది. అలా కాకుండా అభ్యంతరకరంగా బట్టలు వేసుకుంటే అందులో విలువేముంటుంది? అని శివాజీ అన్నారు.



# మూడు కేజీల బరువు పెరగడం వల్ల ఓ పెద్ద ప్రాజెక్ట్ కోల్పోయా

'చక్కనమ్మ చిక్కినా అందమే' అంటుంటారు. కథానాయికలు ఎంత నాజూగ్గా ఉంటే అన్ని అవకాశాలు తలుపు తడతాయి. ఈ విషయంలో అశ్రద్ధగా ఉండటంతో ఓ పెద్ద ప్రాజెక్ట్ కోల్పోయానని బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే చెబుతున్నారు. ఆమె కీలక పాత్రలో నటించిన తాజా చిత్రం 'సాలీ మొహబ్బత్'. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె మాట్లాడారు. "నేను ఎప్పుడైనా బరువు పెరిగితే నాకు చాలా బాధగా ఉంటుంది. ఈ హెచ్చుతగ్గుల కారణంగా శారీరకంగా ఎన్నో సమస్యలు ఎదురవుతుంటాయి. నేనేమీ అబద్ధం చెప్పడం లేదు. బరువు పెరిగానని అనిపించినప్పుడల్లా త్వరగా తగ్గేయాలన్న ఆలోచన వచ్చేస్తుంది. ఈ విషయంలో ఇటీవల ఓ థెరపిస్ట్‌ను కూడా కలిశా. ఇలా అతిగా ఆలోచించడం కూడా ఓ సమస్య. బరువు పెరగడం వల్ల నాపై ప్రభావం చూపింది. అందుకే థెరపీ తీసుకోవాల్సి వస్తోంది"



"కొన్ని రోజుల కిందట ఒక పెద్ద సినిమాలో అవకాశం వచ్చింది. నేను నటిస్తాననే ఉద్దేశంతోనే నా కోసం ఆ పాత్రను తీర్చిదిద్దారు. ఆ సమయంలో నేను లండన్‌లో డ్యాన్స్ నేర్చుకుంటున్నా. కొన్ని రోజులు విహారయాత్రకు వెళ్లి వచ్చాక షూటింగ్‌కు వస్తానని చెప్పా. నేను ఇక్కడకు వచ్చేసరికి కాస్త బరువు పెరిగాను. నా వయసును పరిగణనలోకి తీసుకుంటే మెటబాలిజం సమర్థంగా పనిచేస్తుంది. షూటింగ్‌కు మరో నాలుగైదు నెలలు పడుతుందని అనుకున్నా. నేను విహారయాత్ర నుంచి రాగానే వాళ్లు షూటింగ్ మొదలు పెట్టేశారు. నాతో చర్చించి నా పాత్రకు సంబంధించిన ఫొటో షూట్ చేశారు. తీరా చూస్తే, కాస్త బొద్దుగా కనిపించా. దాంతో ఆ ప్రాజెక్ట్ నుంచి నన్ను తీసేశారు. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఇద్దరు కొత్త నటులను వారు పరిచయం చేశారు. వారి జీవితమే మారిపోయింది"

"ఇంతకీ నేను పెరిగిన బరువు ఎంతో తెలుసా? 34 కిలోలు మాత్రమే. ఒకవేళ ఆ సినిమా నేను చేసి ఉంటే, నా కెరీర్ మరోలా ఉండేది. ఏది జరిగితే అదే మంచిదనుకుంటాను. నా విలువ ఏంటో నాకు తెలుసు. హీరోయిన్‌ల బరువు గురించి మాట్లాడటం ఇండస్ట్రీలో సర్వసాధారణమే అయినా, దాన్ని జీర్ణించుకోవడం కాస్త కష్టం" అని రాధికా అభిప్రాయపడ్డారు. ఇటీవల ఇంటర్వ్యూలోనూ మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితుల కారణంగానే దక్షిణాది సినిమాలు చేయాల్సి వచ్చిందన్నారు. కొన్నిసార్లు సెట్‌లో భయంకరమైన అనుభవాలను ఎదుర్కొన్నట్లు చెప్పారు. ఆ రోజుల గురించి ఆలోచిస్తే ఇప్పటికీ తన గుండె భయంతో కొట్టుకుంటుందని చెప్పారు.

# శివాజీ వ్యాఖ్యల రచ్చ




- **దులిపేసిన సింగర్ చిన్మయి**
- **మా బాడీ..మా ఇష్టం అన్న అనసూయ**
- **శివాజీ తరఫునే నేను క్షమాపణలు చెబుతున్నా: మనోజ్**

నటుడు శివాజీ వ్యాఖ్యలపై సింగర్ చిన్మయి సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. హీరోయిన్లు చీరలు కట్టుకోవాలని, లేదంటే వారి 'సామాన్లు' కనిపిస్తాయని శివాజీ అనడాన్ని చిన్మయి తప్పుబట్టింది. ముఖ్యంగా 'దరిద్రపు ము?' వంటి బూతు పదాలను ప్రొఫెషనల్ వేదికలపై వాడటం ఏంటని శివాజీని ప్రశ్నించింది. సామాన్లు వంటి పదాలను కేవలం 'ఇన్సెల్స్' (స్త్రీ ద్వేషులు) మాత్రమే వాడుతుంటారని ఆమె విమర్శించింది. అంతేగాకుండా హీరోయిన్లు భారతీయ సంప్రదాయం పాటించాలని చెప్పిన శివాజీ.. తాను మాత్రం జీన్స్, హూడీలు ధరిస్తారు. సంప్రదాయం గురించి అంతగా మాట్లాడేటప్పుడు ఆయన కేవలం ధోతీలు మాత్రమే కట్టుకోవాలి కదా? నుదుట బొట్టు పెట్టుకోవాలి, వివాహం అయినట్లు గుర్తుగా కంకణాలు, మెట్టెలు ధరించాలి కదా? అంటూ చిన్మయి ప్రశ్నించింది. ఒక సినిమాలో విలన్‌గా నటించిన శివాజీ.. బయట ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా స్త్రీలను ద్వేషించే వ్యక్తులకు హీరోగా మారుతున్నారని ఆమె ఎద్దేవా చేసింది. ఒక బహిరంగ వేదికపై మహిళల పట్ల ఇలాంటి ప్రవర్తన ఉండటం నమ్మశక్యంగా లేదని, అసలు మహిళలను ఇక్కడ ఎలా చూస్తున్నారో అర్థమవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్మయి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీశాయి.


నటుడు శివాజీ వ్యాఖ్యలపై ఇప్పటికే సింగర్ చిన్మయి స్పందించగా.. తాజాగా యాంకర్, నటి అనసూయ కూడా శివాజీకి గట్టి కౌంటర్‌ను ఇచ్చింది. అనసూయ ఎక్స్ వేదికగా పోస్ట్ పెడుతూ.. ఇది మా బాడీ.. మీది కాదు. మాకు నచ్చినట్లు మేం ఉంటాం అంటూ శివాజీకి కౌంటర్ ఇచ్చారు. మహిళలకు తమకు నచ్చిన దుస్తులు వేసుకునే స్వేచ్ఛ ఉందని, వారి వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం తప్పని శివాజీ వ్యాఖ్యలను పలువురు తప్పుపట్టారు.





ఈ వ్యాఖ్యలను తప్పుబడుతూ ఇప్పటికే సింగర్ చిన్మయి, అనసూయ శివాజీని విమర్శించగా.. తాజాగా మంచు మనోజ్ కూడా శివాజీ పేరు ఎత్తకుండానే ఆయనకు గట్టి కౌంటర్ ఇచ్చారు. మహిళలను కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మనోజ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఒక లేఖ విడుదల చేశాడు. మహిళల దుస్తుల విషయంలో నీతులు చెప్పడం, వారిపై నైతిక బాధ్యత లేదు అని ఆరోపించడం అనేది చాలా పాత కాలపు ఆలోచన. ఇలాంటి వ్యాఖ్యలు తనను తీవ్ర నిరాశను కలిగించాయని మనోజ్ పేర్కొన్నారు. సమానత్వం, గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ అనేవి చర్చించలేని అంశాలని మహిళల బట్టలపై తీర్పు ఇచ్చే అధికారం ఎవరికీ లేదని ఆయన తేల్చి చెప్పారు. మహిళలను కించపరిచేలా వస్తువులుగా చూస్తూ మాట్లాడిన ఆ సీనియర్ నటుడి తరపున నేను క్షమాపణలు చెబుతున్నాను. పబ్లిక్ ఫిగర్స్‌గా ఉన్నవారు సమాజంపై తమ మాటల ప్రభావం ఉంటుందని గుర్తించి బాధ్యతగా మాట్లాడాలని ఆయన హితవు పలికారు. హిళలకు ఎప్పుడూ గౌరవం, సమానత్వం దక్కాలి. ఇలాంటి విషయాల్లో మౌనంగా ఉండటం సరైన పద్ధతి కాదు. మనోజ్ కుమార్ తన పోస్ట్‌ను ముగించాడు.

# సిఐడి విచారణకు హాజరైన మంచు లక్ష్మి



నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచార వ్యవహారానికి సంబంధించి సినీ నటి మంచు లక్ష్మి మంగళవారం హైదరాబాద్‌లోని సీఐడీ విచారణకు హాజరయ్యారు. లక్డీకపూల్‌లోని సీఐడీ కార్యాలయానికి చేరుకున్న ఆమెను ఈ యాప్‌లను ప్రమోట్ చేసినందుకుగానూ అందిన పారితోషికం మరియు కమిషన్ల లావాదేవీలపై అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నిస్తున్నారు. గతంలోనే ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఆమెను విచారించగా, ఇప్పుడు సీఐడీ అధికారులు మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. కాగా, ఇదే వ్యవహారంలో గతంలో టాలీవుడ్ ప్రముఖ నటులు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్ వంటి వారు కూడా విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. సెలబ్రిటీల ప్రచారం కారణంగా సామాన్యులు ఈ బెట్టింగ్ యాప్‌ల బారిన పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

This Newspaper is Published by Petta Venkata Suryanarayana from Plot No 98/Part 1, Co-operative Industrial Estate Phase-ii, Gandhi Nagar, Medchal Malkajgiri,Telangana - 500037 on behalf of Petta Venkata Suryanarayana, edited by Petta Venkata Suryanarayana and printed by Petta Venkata Suryanarayana at Sree Sesha Sai Enterprises ,Plot No 98/Part 1, Co-operative Industrial Estate Phase-II, Gandhi Nagar, Medchal Malkajgiri, Telangana - 500037, e-mail: seshasai09@gmail.com, Phone: 9618880945